మంగళవారం
6•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 42
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE






## జమ్ముకశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తి రద్దు

# 2 ముక్కలు

## కేంద్రపాలిత ప్రాంతాలుగా జమ్ముకశ్మీర్, లడఖ్




జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై రాజ్యసభలో ఓటింగ్

అనుకూలం **125**

వ్యతిరేకం **61**

- జమ్ముకశ్మీర్‌కు అసెంబ్లీ.. చట్టసభ లేకుండానే లడఖ్
- కేంద్రం సంచలన నిర్ణయం.. రాజ్యసభలో అమిత్‌షా బిల్లులు
- అంతకుముందే ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ రాష్ట్రపతి గెజిట్

రాజ్యసభలో వాడివేడి చర్చ.. ఓటింగ్‌లో నెగ్గిన తీర్మానం

బీజేపీ, వైసీపీ, టీడీపీ, బీఎస్పీ, బీజేడీ తదితర పార్టీల మద్దతు

వ్యతిరేకించిన కాంగ్రెస్, పీడీపీ, ఎన్సీ, డీఎంకే, లెఫ్ట్ పార్టీలు

కశ్మీర్ విభజనను ఆద్యంతం రహస్యంగా ఉంచిన కేంద్రం

370 రద్దుపై త్వరలో జాతికి వివరించనున్న ప్రధాని మోదీ

72 ఏండ్ల సమస్యకు ఇది పరిష్కారం

ఇకపై జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది

రాజ్యసభలో హోంమంత్రి



సోమవారం పార్లమెంటుకు వస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా

### ప్రశాంతంగానే కశ్మీర్‌లోయ.. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ

మాజీ ముఖ్యమంత్రులు ముఫ్తీ, ఒమర్ అరెస్ట్.. జమ్ముకశ్మీర్‌కు భారీగా భద్రతా బలగాలు

**కశ్మీర్** రెండు ముక్కలైంది. ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రత్యేకప్రతిపత్తి.. 370వ అధికరణం రద్దుతో అంతమైంది. దానిలో భాగంగా ఉన్న 35- ఏ ఉనికికోల్పోయింది. జమ్ముకశ్మీర్ అనుభవిస్తున్న ప్రత్యేక అధికారాలన్నీ రద్దయిపోయాయి. ఇక కశ్మీర్ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయి.. అఖండ భారతదేశంలో ఒక భాగంగా మారిపోయింది. ఉగ్రవాద హెచ్చరికల పేరుతో వారంరోజులుగా కొనసాగిన సస్పెన్స్.. చివరకు కశ్మీర్ విషయంలో కీలక నిర్ణయాలతో వీడింది. సోమవారం ఉదయం నుంచి అత్యంత నాటకీయంగా, అత్యంత వేగంగా వరుస పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉదయం రాజ్యసభలో ఇతర బిల్లులతోపాటు ఆర్టికల్ 370 రద్దు బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా హోంమంత్రి అమిత్‌షా అందరికీ షాక్ ఇచ్చారు. అంతకుముందే క్యాబినెట్ సమావేశం ఈ బిల్లును ఆమోదించింది. రాష్ట్రపతి ఆమోదంతో ఆర్టికల్ 370 రద్దుచేస్తూ తక్షణం అమల్లోకి వచ్చేలా గెజిట్ కూడా జారీచేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని కేంద్రం టాప్‌సీక్రెట్‌గా ఉంచడం విశేషం. పునర్వ్యవస్థీకరణ బిల్లుపై రాజ్యసభలో వాడివేడి చర్చ జరిగింది. అనంతరం ఓటింగ్ నిర్వహించగా.. అనుకూలంగా 125, వ్యతిరేకంగా 61 ఓట్లు వచ్చాయి. పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రకారం జమ్ముకశ్మీర్‌ను, లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చుతారు. ఇందులో జమ్ముకశ్మీర్‌కు అసెంబ్లీ ఉంటుంది. లడఖ్ మాత్రం అసెంబ్లీలేకుండానే కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగుతుంది. 370వ అధికరణం రద్దును పార్లమెంటు బయట, వెలుపల తీవ్రంగా నిరసించిన ప్రతిపక్షాలు.. జమ్ముకశ్మీర్‌ను, ప్రజాస్వామ్యాన్ని కేంద్రం హత్యచేసిందని మండిపడ్డాయి. బిల్లు ఆమోదం పొందిన సోమవారాన్ని బ్లాక్‌మండేగా అభివర్ణించాయి. బిల్లుకు ఎన్డీయే పక్షాలతోపాటు వైసీపీ, టీడీపీ, బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకే, ఆప్, టీఆర్‌ఎస్ మద్దతు పలుకగా, ఎన్డీయేపక్షమైన జేడీయూ బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేసింది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, పీడీపీ, డీఎంకే, ఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్, ఆర్జేడీ, వామపక్షాలు బిల్లును వ్యతిరేకించాయి. ఓ దశలో రాజ్యసభలో పీడీపీ సభ్యులు పెద్దఎత్తున ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ రాజ్యాంగ ప్రతిని చించివేయడంతో చైర్మన్ వెంకయ్యనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు మెహబూబాముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాను పోలీసులు అరెస్టుచేశారు.

వివరాలు 4,5వ పేజీల్లో

## కశ్మీర్‌లోనూ భారత రాజ్యాంగం

**ఆర్టికల్ 370 రద్దుతో కీలక మార్పులు**

1 **ప్రత్యేక రాజ్యాంగం**
ఇప్పటివరకు దేశంలో ప్రత్యేక రాజ్యాంగం కలిగిన ఏకైక రాష్ట్రం జమ్ముకశ్మీర్. ఇకపై తక్కిన భారత దేశం మాదిరిగానే జమ్ముకశ్మీర్‌లోనూ భారత రాజ్యాంగం అమలుకానున్నది.

2 **ఆస్తి కొనుగోలు హక్కు**
ఇప్పటివరకు జమ్ముకశ్మీర్‌లో పుట్టి పెరిగిన వారికి మాత్రమే రాష్ట్రంలో ఆస్తుల క్రయ విక్రయాలు చేసేందుకు అనుమతి ఉన్నది. ఇకపై దేశ ప్రజలు ఎవరైనా అక్కడ ఆస్తులను కొనుగోలు చేయొచ్చు. విక్రయించవచ్చు. రాష్ట్రేతరులను వివాహం చేసుకున్న మహిళలకు ఇంతకుముందు ఆస్తిహక్కు ఉండేదికాదు. ఇకపై వారికి ఆ హక్కు లభిస్తుంది.

3 **శాంతిభద్రతలు**
ఇంతకుముందు, జమ్ము కశ్మీర్‌లో శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండేవి. ప్రస్తుతం రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన నేపథ్యంలో ఢిల్లీ లేదా పుదుచ్చేరి

మిగతా 5వ పేజీలో





కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌ను హత్యచేసింది.జమ్ముకశ్మీర్‌ను భారతదేశ కిరీటంగా అభివర్ణిస్తుంటారు. అలాంటి రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడం ద్వారా తల నరికేశారు. రాష్ట్రాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ పాలన పరిధిలోకి తేవడం సిగ్గుపడాల్సిన విషయం. ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడం భారతదేశ చరిత్రలోనే మాయని మచ్చ.

– రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్



రాజ్యాంగం ప్రతిని చించివేసిన పీడీపీ సభ్యులు

4



భీకర అమ్మకాల ఒత్తిడిలో

### దేశీయ స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 418, నిఫ్టీ 135 పాయింట్లు పతనం

### రూపాయికి 'యువాన్' షాక్



ఒక్కరోజే రూపాయికిపైగా విలువ ఆవిరి

70.73 వద్దకు చేరిక

### 37 వేల దిశగా పసిడి



ఒకేరోజు రూ.800 పెరిగిన తులం ధర

వెయ్యి రూపాయలు అధికమైన వెండి

వివరాలు వాణిజ్య పేజీలో

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 80.00 | రిటైల్ లైవ్ | 102.00 |
| డ్రెస్డ్ | 148.00 | స్కిన్‌లెస్ | 168.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 328.00 | రంగారెడ్డి | 328.00 |
| మెదక్ | 328.00 | కరీంనగర్ | 331.00 |
| వరంగల్ | 331.00 | చిల్లర ధర | 3.90 |

# ఉగ్ర గంగమ్మ!

### మేడిగడ్డ దగ్గర 8 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

పేరూరు వద్ద 9.18 లక్షల క్యూసెక్కులకు పైగా

చుక్కనీరు లేని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు.. నిండుకుండలా ఎల్లంపల్లి జలాశయం

పది గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో జలశోభితంగా మేడిగడ్డ బరాజ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ నెట్‌వర్క్:** గోదావరి ఉధృతి పెరుగుతూనే ఉన్నది. ఎగువన కురుస్తున్న వర్షాలతో లక్షల క్యూసెక్కుల జలాలు ప్రవహిస్తున్నాయి. ప్రాణహిత నుంచి లక్షల క్యూసెక్కుల వరద గోదావరిలోకి వచ్చి చేరుతున్నది. సోమవారం కాళేశ్వరం దగ్గర ఆరు లక్షలకు పైగా, మేడిగడ్డకు దిగువన పేరూరు వద్ద ఏకంగా 9.18 లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహం నమోదవుతున్నది. మరోవైపు శ్రీరాంసాగర్‌కు చుక్కనీరు లేకపోగా.. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారింది. వర్షాలకుతోడు గోదావరి నదికి ఎగువన అదిలాబాద్ జిల్లాలో ఉన్న కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం చేరడంతో సోమవారం 10 గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదలచేస్తున్నారు. ప్రాజెక్టులోకి 39,204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 54,620 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎల్లంపల్లి జలాశయం 485.01 అడుగుల నీటిమట్టంతో 19.70 టీఎంసీల నిల్వకు చేరింది. ఇక్కడినుంచి విడుదలచేసిన జలాలు సుందిల్ల బరాజ్‌కు చేరుకొంటున్నాయి. సుందిల్లలో ప్రస్తుతం 6.5 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. ఎగువనుంచి నీరు వస్తుండటంతో ప్రస్తుతం 17 గేట్లను ఎత్తి 28,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

**అన్నారం బరాజ్‌కు పెరిగిన వరద నీరు**

సుందిల్ల బరాజ్, మానేరు నుంచి ప్రవాహం రావడంతో ఇంజినీర్లు అన్నారం బరాజ్‌లో తొమ్మిది గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. మొత్తంగా అన్నారం

మిగతా 3వ పేజీలో

### సాగర్‌కు కృష్ణమ్మ పయనం

వడివడిగా నిండుతున్న శ్రీశైలం రిజర్వాయర్.. విద్యుదుత్పత్తితో 42వేల క్యూసెక్కులు విడుదల

అంతేమేరలో నాగార్జునసాగర్ వద్ద ఇన్‌ఫ్లో నమోదు..కృష్ణాబేసిన్ ప్రాజెక్టులకు పరుగుతున్న వరద తాకిడి

మూడు లక్షల క్యూసెక్కులుగా నారాయణపుర ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో

3

నేడు సీఎం

## సజీవ గోదావరి సందర్శన

- మేడిగడ్డ నుంచి ధర్మపురి దాకా ఏరియల్‌వ్యూ ద్వారా తిలకించనున్న కేసీఆర్
- లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోనున్న సీఎం: మంత్రి కొప్పుల



**హైదరాబాద్, కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నూటనలభై కిలోమీటర్ల మేర సజీవంగా మారిన గోదావరిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం సందర్శించనున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ నుంచి జగిత్యాల జిల్లా ధర్మపురి వరకు గోదావరి నదిని ఏరియల్ వ్యూ ద్వారా తిలకించనున్నారు. ఉదయం 9.50 గంటలకు బేగంపేట నుంచి అధికారులు, ఇంజినీర్లతో సీఎం కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. 10.50 గంటలకు మేడిగడ్డ బరాజ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు గోలివాడ పంప్‌హౌస్‌కు చేరుకుంటారు. ఎల్లంపల్లి బరాజ్‌ను సందర్శించిన అనంతరం గోలివాడ పంప్‌హౌస్ వద్ద మధ్యాహ్న భోజనం చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అక్కడినుంచి

మిగతా 2వ పేజీలో

## కౌలు భూమి కబ్జా

ధర్మగంట

- కబ్జాదారుల పేరిట రికార్డుల్లోకి 2.28 ఎకరాలు
- నల్లగొండ జిల్లా రెవెన్యూ అధికారుల మాయ
- బెదిరిస్తున్న కబ్జాదారులు.. అండనివ్వని పోలీసులు
- బిజీగా ఉన్నానంటున్న మునుగోడు తాసిల్దార్
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు మౌలాబీ

9



సయ్యద్ మౌలాబి

**ఊళ్లో** ఉన్న భూమిని కౌలుకు ఇస్తే కౌలుదారులు కబ్జాచేశారు. వాళ్లతో కుమ్మక్కైన రెవెన్యూ అధికారులు కబ్జాదారుల పేరిట రికార్డులు మార్చేశారు. ఇదేం అన్యాయం అని ప్రశ్నిస్తే.. కబ్జాదారులు బాధితులను బెదిరిస్తున్నారు. ఆదుకోవాల్సిన పోలీసులు, పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వారసత్వంగా తండ్రి నుంచి వచ్చిన 2.28 ఎకరాల భూమి నుంచి గెంటివేతకు గురైన నల్లగొండ జిల్లా మామిళ్లగూడేనికి చెందిన బాధితురాలు సయ్యద్ మౌలాబీ.. న్యాయం కోసం చివరికి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

### రైతులకు అందిన పాస్‌పుస్తకాల ప్రతులు

'మ్యుటేషన్ కోసం ముప్పతిప్పలు' కథనానికి స్పందన

సమస్యను పరిష్కరించిన రంగారెడ్డి జిల్లా కందుకూరు తాసిల్దార్

## పోలీస్‌శాఖకు 32 సూపర్ న్యూమరరీపోస్టులు

- ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలీస్‌శాఖకు 32 సూపర్ న్యూమరరీపోస్టులను మంజూరుచేస్తూ రాష్ట్ర ఆర్థికశాఖ ఉత్తర్వులిచ్చింది. ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ర్యాంకులో 19 సూపర్ న్యూమరరీపోస్టులను జారీచేస్తూ ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ) బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ హోదాలో ఈ పోస్టులను మంజూరుచేస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు.



సోమవారం ప్రగతిభవన్‌లో తాను రచించిన 'కిష్కింధాకాండ మందర మకరందం' పుస్తకాన్ని సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న సీఎం సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు. చిత్రంలో టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు ఉన్నారు.



సోమవారం హైదరాబాద్‌లో మాజీమంత్రి సునీతా లక్ష్మారెడ్డికి పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఉన్నారు.

## నేడు సికింద్రాబాద్ నియోజకవర్గ టీఆర్ఎస్ సమావేశం

- హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వంపై క్యాడర్‌ను ఉత్సాహపర్చడానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఇందులోభాగంగా మంగళవారం నిర్వహించే సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరుకానున్నారు. సీతాఫల్‌మండి టీఆర్టీ క్వార్టర్స్ జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే సమావేశంలో కేటీఆర్‌తోపాటు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొంటారు. బోనాల పండుగ తదితర కారణాలతో సభ్యత్వనమోదుకు కొంత సమయం కావాలని స్థానికనేతలు కోరిన నేపథ్యంలో ఈ నెల 10 వరకు గడువు పొడిగించారు. 10 నుంచి 20 వరకు కమిటీలు వేయాలని కేటీఆర్ సూచించారు.

## నేడు తెలంగాణభవన్‌లో జయశంకర్ జయంతి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మంగళవారం తెలంగాణభవన్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే వేడుకలకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.



## ఎస్టీ గురుకుల డిగ్రీలెక్చరర్ల నియామకం పూర్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్టీ గిరిజన గురుకుల డిగ్రీకళాశాలల లెక్చరర్ల పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయింది. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సోమవారం సంక్షేమభవన్లో డిగ్రీ లెక్చరర్ల నియామక కౌన్సెలింగ్‌ను నిర్వహించి 143 మంది అర్హులను ఎంపిక చేశారు. 10 సబ్జెక్టులకు సంబంధించి లెక్చరర్ల నియామకాలను పూర్తిచేసినట్టు టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్ (తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ) కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## ఎస్టీ ఐఏఎస్ స్టడీసర్కిల్ ప్రిన్సిపాల్ పోస్టు భర్తీ

- గౌరవ వేతనంపై పనిచేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్న ఎస్టీ ఐఏఎస్ స్టడీసర్కిల్‌లో ప్రిన్సిపాల్‌గా గౌరవ వేతనంపై పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ శాఖ కమిషనర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విద్యారంగంలో అనుభవజ్ఞులై ఉండాలని, పీజీతోపాటు బీఈడీ అర్హత అవసరమని చెప్పారు. కనీసం పదేండ్లపాటు ప్రిన్సిపాల్‌గా ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం కల్పించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 9963075760 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

## ఎంపీహెచ్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను మాస్టర్ ఆఫ్ పబ్లిక్‌హెల్త్ (ఎంపీహెచ్) కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని, ఈ నెల 7 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. మరిన్న వివరాలకు knruhs.in, knruhs.telangana.gov.in వెబ్‌సైట్లను పరిశీలించాలని సూచించారు.

# స్వల్పకాల వంగడాలే మేలు

### వరి పంటకాలం 105 నుంచి 125 రోజులే

- వానలు ఆలస్యమైనందున ఇప్పుడు నారుపోసుకున్నా ఆగస్టు చివరినాటికి నాటేసుకోవచ్చు
- సంప్రదాయ వంగడాల స్థానంలో కొత్తవాటిని నాటాలని శాస్త్రవేత్తల సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో వానకాలం పంటలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎండిపోతాయనుకున్న పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. రైతుల ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. అయితే, రాష్ట్రంలో వానకాలం సాధారణ సాగు 24.11 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 11 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయింది. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం, సకాలంలో వానలు కురవకపోవడంతో వరి పంటకాలం అదునుదాటింది. ఇప్పటికే పోసిన సంప్రదాయ వరి వంగడాల నార్లు ముదిరిపోయాయి. ఇప్పుడు వానలు పడుతుండటం, రిజర్వాయర్లలోకి పెద్దఎత్తున వరద చేరుతుండటంతో వానకాలం సీజన్‌పై భరోసా పెరిగిన రైతులు మళ్లీ నార్లు పోయడానికి సిద్ధమవుతున్నారు. 150, 145, 140 రోజుల సాగు ఉండే దీర్ఘకాలిక వరి వంగడాలకు బదులుగా తక్కువకాలంలో 105 రోజుల నుంచి 125 రోజుల మధ్య దిగుబడి వచ్చే వరి రకాలను వేసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సూచించారు. దీర్ఘకాలిక రకాల వరికి జూన్‌లోనే నార్లు పోసి జూలై చివరి నాటికి నాట్లు వేయాల్సి ఉంటుంది. నారుపోశాక 30 రోజులు దాటకుండా నాట్లు వేయాలి. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్వల్పకాలిక వరిని వేయాలని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆగస్టు ఒకటి నుంచి నారుపోసినా ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకునే అవకాశం ఉంటుందని, స్వల్పకాలిక రకాల్లో చదరపు మీటర్‌కు 66 కుదుళ్లు ఉండేలా నాటుకోవాలని సూచించారు.



సూర్యాపేట జిల్లాలో జోరుగా సాగుతున్న వరినాట్లు

### స్వల్పకాలిక వరివంగడాల రకాలు

| వంగడం | పంటసీజన్ | పంటకాలం | రకం |
|---|---|---|---|
| బతుకమ్మ (జేజీఎల్ 1804) | వానకాలం | 125 | దొడ్డు రకం |
| కూనారం సన్నాలు (కేఎన్ఎం 118) | వానకాలం/యాసంగి | 125 | సన్న రకం |
| అంజన (జేజీఎల్ 11118) | వానకాలం/యాసంగి | 125 | సన్న రకం |
| రామప్ప (డబ్ల్యూజీఎల్23985) | వానకాలం/యాసంగి | 125 | సన్న రకం |
| జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798) | వానకాలం | 125 | సన్న రకం |
| తెల్లహంస | వానకాలం/యాసంగి | 125 | పొడవు గింజ |
| ఎర్రమల్లెలు (డబ్ల్యూజీఎల్ 20471) | వానకాలం/యాసంగి | 120 | సన్న రకం |
| ప్రద్యుమ్న (జేజీఎల్ 17004) | వానకాలం/యాసంగి | 105 | మధ్యస్థ రకం |
| సుగంధసాంబ (ఆర్ఎన్ఆర్ 2465) | వానకాలం | 130 | సన్న రకం |

### స్వల్పకాలిక రకాలు

రాష్ట్రంలో పండిస్తున్న దొడ్డురకం వరి యంటీయూ 1010కు బదులుగా బతుకమ్మ రకాన్ని వేసుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో పరిస్థితులకు ఎర్రమల్లెలు, తెల్లహంస, కృష్ణహంస (115-120 రోజులు), కూనారం సన్నరకాలు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు సన్నాలు, ఎర్రమల్లెలు, తెల్లహంస, సత్య (120 రోజులు) ఇందూర్ సాంబ రకాలు అనువుగా ఉంటాయని పేర్కొన్నారు.



# పాలమూరు ప్రాజెక్టుకు పదివేల కోట్లు

- పీఎఫ్‌సీ నుంచి రుణ సేకరణకు సర్కారు అనుమతి
- మరింత వేగంగా ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు
- పలు ప్రాజెక్టులకు మొత్తం రూ.14 వేల కోట్లు రుణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రాజెక్టులకు వివిధ ఆర్థికసంస్థల నుంచి రూ.14,138 కోట్ల మేర రుణాలు తీసుకునేందుకుగాను అనుమతినిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో ముఖ్యంగా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంకోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి రూ.10 వేల కోట్ల రుణం తీసుకునేందుకు అనుమతించింది. ప్రాజెక్టులోని ఎలక్ట్రో మెకానికల్ పనుల పూర్తికి వీలుగా ఈ రుణాలు తీసుకునేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. పాలమూరు ప్రాజెక్టులోని ఎలక్ట్రో మెకానికల్ పనులకు రూ.17 వేల కోట్లు అవసరం ఉండగా.. రూ.10 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు పీఎఫ్‌సీ ముందుకొచ్చింది. తాజా ఉత్తర్వుల నేపథ్యంలో కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మధ్య ఒప్పందానికి మార్గం సుగమం అయింది. కాగా దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ, వరదకాల్వ ప్రాజెక్టులతో కలిపి గతంలోనే ప్రభుత్వం 'తెలంగాణ స్టేట్ వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌డబ్ల్యూఐసీ) ఏర్పాటుచేసింది. ఈ కార్పొరేషన్ కూడా రూ.2,638 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం సోమవారం అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. గతంలోనే ఈ కార్పొరేషన్‌కు ఆంధ్రాబ్యాంకు కన్సార్టియం రూ.17 వేల కోట్ల రుణాలివ్వగా ఇప్పుడు మరో రూ.2,638 కోట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-12 పనుల కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి మరో రూ.1500 కోట్ల రుణం తీసుకునేందుకు కూడా అనుమతినిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



సోమవారం సచివాలయంలో స్వాతంత్య్ర వేడుకలపై వివిధశాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి

# స్వాతంత్య్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- సమీక్షలో అధికారులకు సీఎస్ ఎస్కే జోషి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్యదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15వ తేదీన గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో అధికారులతో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ.. ఆ రోజున ఉదయం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పరేడ్‌గ్రౌండ్స్‌లో సైనిక్ స్మారక్ వద్ద శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్, సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, చార్మినార్, గన్‌పార్క్, క్లాక్‌టవర్ వంటి ముఖ్యప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా తగిన విధంగా బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని పోలీసు విభాగం ఉన్నతాధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. అలాగే, బారికేడ్లు, మంచినీటి సరఫరా, గోల్కొండకు వెళ్లే మార్గాల్లో సైన్‌బోర్డుల ఏర్పాటు, పరిసరాల శుభ్రత, మొబైల్ టాయ్‌లెట్స్, మినీ బస్సులు నడపడం వంటి పనులు చేపట్టాలన్నారు. గోల్కొండ వద్ద తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉత్సవాల లైవ్ కవరేజ్ ఏర్పాట్లు చేయాలని, ఎల్ఈడీ స్క్రీన్లతోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టం పనులు చేపట్టాలని సమాచార పౌరసంబంధాలశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షాసమావేశంలో పోలీసు, రోడ్లు, భవనాలు, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్య, వైద్య, ఉద్యానవనం, అగ్నిమాపక, పురావస్తు, సాంస్కృతిక, ముద్రణ, రోడ్డు రవాణా సంస్థ, సమాచార పౌరసంబంధాలు, టీఎస్ఎస్పీడీసీఎల్, జీఏడీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.00 గంటలకు

సూర్యాస్తమయం: 6.43 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం షష్ఠి మధ్యాహ్నం 1.32 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: చిత్త రాత్రి 10.24 వరకు, తదుపరి స్వాతి, అమృతఘడియలు: సాయంత్రం 4.22 నుంచి 5.58 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.33 నుంచి సాయంత్రం 5.08 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.33 నుంచి 9.34 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.29 నుంచి 3.20 వరకు, వర్జ్యం: ఉదయం 7.20 నుంచి 8.56 వరకు.





సోమవారం సిద్దిపేట జిల్లా చింతమడకలో గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



చింతమడకలో మినీఅర్బన్‌పార్కు కోసం అటవీప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ శోభ, ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు

# హెల్త్‌ప్రొఫైల్ దేశానికే ఆదర్శం

- చింతమడకలో నాంది పడటం సంతోషం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సీఎం కేసీఆర్ స్వగ్రామంలో యశోద హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరం ప్రారంభం

**సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ స్వగ్రామం చింతమడక నుంచి ప్రారంభించిన హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలువాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ ఆరోగ్య సూచిక త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలుకానున్నదని చెప్పారు. గ్రామస్థులందరికీ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తామని గతనెల 22న సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలం చింతమడక పర్యటనలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీమేరకు.. సోమవారం చింతమడకలో ఆరోగ్య వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్ సౌజన్యంతో వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని హాస్పిటల్ ఎండీ డాక్టర్ సురేందర్‌రావు, జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాలతో కలిపి మొత్తం ఏడువేల మందికి.. రోజుకు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రజలను శిబిరానికి తీసుకొచ్చేందుకు వలంటీర్లను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. త్వరలో కంటి, దంత పరీక్షలకు వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తామన్నారు. ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్‌తో రాష్ట్రంలోని మరో పథకం.. దేశానికి ఆదర్శంగా నిలువనున్నదని చెప్పారు. ఇది సిద్దిపేట నియోజకవర్గం నుంచి ప్రారంభంకావడం సంతోషంగా ఉన్నదని, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### తొలిరోజు 418 మందికి పరీక్షలు

చింతమడక వైద్య శిబిరంలో నాలుగు రకాల రక్త పరీక్షలు, టూడీ ఏకో, ఈసీజీ, ఎక్స్‌రేతోపాటు పాప్‌స్మియర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ, స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. వారి వివరాలను కంప్యూటర్‌లో పొందుపర్చారు. మహిళలకు పాప్‌స్మియర్, మెమోగ్రఫీ పరీక్షలు చేశారు. తొలిరోజు 418 మందికి పరీక్షలు నిర్వహించారు. యశోదహాస్పిటల్ సిబ్బంది 120 మంది, పారామెడికల్ సిబ్బంది 20 మంది, ఐదుగురు ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు ఐదుగురు, హెల్త్ అసిస్టెంట్లు 10 మంది, అంగన్‌వాడీలు 15 మంది విధుల్లో పాల్గొన్నారు. ఆర్డీవో జయచంద్రారెడ్డి, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో అమర్‌సింగ్, గడ వైద్యాధికారి డాక్టర్ కాశీనాథ్ శిబిరాన్ని పర్యవేక్షించారు.

### చింతమడకలో మినీ అర్బన్ పార్కు

సీఎం కేసీఆర్ ఆదేశాలతో పీసీసీఎఫ్ శోభ, జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారులు రాకేశ్‌మోహన్, డిబ్రమన్, లోకేశ్ జైస్వాల్, శరవణన్, డీఎఫ్‌వో శ్రీధర్‌రావుతో కలిసి హరీశ్‌రావు చింతమడకలో 98 ఎకరాల్లో ఉన్న టేకుల్ల అటవీప్రాంతాన్ని పరిశీలించారు. చింతమడకలో అర్బన్‌పార్కు ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. అనంతరం సిద్దిపేట అర్బన్ పార్కును, చింతమడకలోని అటవీప్రాంతాన్ని సందర్శించిన హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఎండీ డాక్టర్ సురేందర్‌రావు.. అర్బన్ పార్కు అద్భుతంగా ఉన్నదని కొనియాడారు.

### లోకం పోకడ





# సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలి

- దక్షిణాది రాష్ట్రాలకోసం హైదరాబాద్‌లో నెలకొల్పాలి
- లోక్‌సభలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి
- ఆరువేల మంది జడ్జీల కొరత:ఎంపీ బీబీ పాటిల్





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాల్సిన ఆవశ్యకత ఉన్నదని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దీనిద్వారా కేసులో ఉన్నవారికి వ్యయం తగ్గుతుందని చెప్పారు. బెంచ్ ఏర్పాటుకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని..అన్నివిధాల సహకరించడానికి సీఎం కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. లోక్‌సభలో సోమవారం సుప్రీంకోర్టు జడ్జీల సవరణ బిల్లుపై ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటుచేయాలనేది దీర్ఘకాల డిమాండ్ అని, దక్షిణాది రాష్ట్రాల కోసం హైదరాబాద్‌లో బెంచ్ ఏర్పాటుచేయాలని తెలంగాణ ప్రభుత్వం కూడా కోరిందని గుర్తుచేశారు. తెలంగాణలో ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులను భర్తీచేయాలని కోరారు. తెలంగాణ హైకోర్టుకు 24 జడ్జీల పోస్టులు మంజూరుకాగా 12 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. దేశంలో 38 శాతం జడ్జీల పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. దేశంలో 73 మంది మహిళా జడ్జీలు ఉండగా.. మంజూరైన పోస్టుల్లో 10.89 శాతం మాత్రమే మహిళలు ఉన్నారని వివరించారు. సుప్రీంకోర్టులో జడ్జీల సంఖ్యను కనీసం 42కు పెంచాలని కోరారు.

### కోర్టుల్లో మూడుకోట్ల కేసులు పెండింగ్

దేశవ్యాప్తంగా కోర్టుల్లో మూడు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో ఆరువేలమంది జడ్జీల కొరత ఉన్నదని, ఇందులో ఐదువేల మంది కొరత కింది కోర్టులోనే ఉన్నదని చెప్పారు. 1987 లా కమిషన్ సూచనల ప్రకారం.. ప్రతి పది లక్షల మంది జనాభాకు యాభైమంది జడ్జీలు అవసరం కాగా.. ప్రస్తుతం 19 మంది మాత్రమే ఉన్నారన్నారు. సోమవారం లోక్‌సభలో సుప్రీంకోర్టు జడ్జీల సవరణబిల్లు 2019పై బీబీ పాటిల్ మాట్లాడుతూ.. కోర్టుల్లో 22.57 లక్షల కేసులు పదేండ్లకుపైగా, 25 శాతం కేసులు ఐదేండ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. హైకోర్టుజడ్జీలు రోజుకు 20 నుంచి 150 కేసుల వాదనలు వింటున్నారని.. ఒక కేసుకు సగటున రెండు నిమిషాల సమయం మాత్రమే ఉంటున్నదని పేర్కొన్నారు. పెండింగ్‌కేసుల్లో పది శాతం మహిళలు, మరో ఐదుశాతం సీనియర్ సిటిజన్లు వేసినవి ఉన్నాయని తెలిపారు. కేసులు పెండింగ్‌లో పెట్టడం ఆర్టికల్ 14, ఆర్టికల్ 21ని ఉల్లంఘించడమేనన్నారు.

## ఆరోగ్యశ్రీ నిర్వహణకు మరో వంద కోట్లు

- మొత్తం రూ.200 కోట్లు మంజూరుకు ఆర్థికశాఖ అనుమతి
- విడుతలవారీగా మరిన్ని నిధులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పేదలకు వైద్యసేవలందించే ఆరోగ్యశ్రీ పథకం నిర్వహణకుగాను ఆర్థికశాఖ రూ.200 కోట్ల నిధుల మంజూరుకు అనుమతించింది. మొదటి విడుతగా ఇదివరకే రూ.100 కోట్లు అనుమతించగా ఆ నిధులలో రూ.60 కోట్లు ఆరోగ్యశ్రీ పథకం, రూ.40 కోట్లు ఈహెచ్ఎస్ పథకం కింద అత్యవసర సేవలకు వినియోగించనున్నారు. సోమవారం మరోవిడుత రూ.100 కోట్లు నిధులను ఆర్థికశాఖ అనుమతించింది. విడుతలవారీగా మరిన్ని నిధులు కేటాయించేందుకు ఆ శాఖ ప్రణాళికలు రూపొందించింది.

## నేడు సీఎం సజీవ గోదావరి సందర్శన

మొదటిపేజీ తరువాయి...

బయలుదేరి 2.15 గంటలకు ధర్మపురికి వస్తారు. ధర్మపురిలో లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని 3 గంటలకు హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ధర్మపురికి వస్తున్నట్టు సాంఘిక సంక్షేమశాఖమంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం వెల్లడించారు. సీఎం రాక నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

# 23న పోలింగ్ కేంద్రాల తుది జాబితా

- కోర్టు కేసులతో వాయిదాపడిన మున్సిపాలిటీల్లో విడుదల: ఎస్‌ఈసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కోర్టు కేసుల కారణంగా పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించని మున్సిపాలిటీల్లో రీ షెడ్యూల్‌ను విడుదలచేస్తూ రాష్ట్ర ఎన్నికలసంఘం సోమవారం ఆదేశాలిచ్చింది. ఈ నెల 23న పోలింగ్ కేంద్రాల తుదిజాబితాలను ప్రకటించాలని అత్యవసర ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఎస్‌ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. హైకోర్టులో కేసులు దాఖలైన నేపథ్యంలో కొన్ని మున్సిపాలిటీల్లో ముసాయిదాలు ప్రకటించినా.. రాజకీయపార్టీలతో సమావేశాలు నిర్వహించకపోవడంతో తుది జాబితాలను ప్రకటించలేదని పేర్కొన్నారు. గతంలో పోలింగ్‌కేంద్రాలు ప్రచురించని మున్సిపాలిటీల కోసం విడిగా షెడ్యూల్ జారీచేయాలని మున్సిపల్ పరిపాలనా విభాగం విజ్ఞప్తిచేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఎస్‌ఈసీ.. రీ షెడ్యూల్‌ను జారీచేసింది. ఈ నెల 9న మున్సిపల్ కమిషనర్లు పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేయాలని, 13న పోలింగ్‌కేంద్రాల ముసాయిదాను విడుదలచేయాలని సూచించారు. 16న అభ్యంతరాలు, సలహాలు స్వీకరించాలని, 19న అభ్యంతరాలను పరిష్కరించి, 21న పోలింగ్‌కేంద్రాల జాబితాకు జిల్లా ఎన్నికల అధికారులు ఆమోదం తెలుపాలన్నారు.

## 69 మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- హైకోర్టుకు తెలిపిన ఎస్‌ఈసీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వార్డుల విభజన ప్రక్రియలో అభ్యంతరాలు వ్యక్తంకాని 69 మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్‌ఈసీ) సోమవారం హైకోర్టుకు తెలిపింది. పుర ఎన్నికలను సవాల్‌చేస్తూ దాఖలైన కేసులన్నీ కలిపి విచారించాలని ధర్మాసనానికి విజ్ఞప్తిచేసింది. దీంతో విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# ఆవుల్లో గర్భధారణ లేకుండానే పాల ఉత్పత్తి

- సాంకేతికతను అందుబాటులోకి తెచ్చిన టీఏజీ సంస్థ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గర్భధారణ అవసరం లేకుండానే ఆవుల్లో పాలు ఉత్పత్తి చేసే ట్రాపికల్ బోవిస్ జెనెటిక్స్ (టీబీజీ) సాంకేతికతను సోమవారం ట్రాపికల్ యానిమల్ జెనెటిక్స్ (టీఏజీ ) సంస్థ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ తాజ్‌కృష్ణలో మీడియాతో సంస్థ ఎండీ ప్రవీణ్ కిని మాట్లాడుతూ.. ఐదేండ్లపాటు పరిశోధన చేసి తీసుకువచ్చిన పిండ సాంకేతికతతో (ఎంబ్రోటెక్నాలజీ) ఆవులకు పూర్తిస్థాయి జన్యువులు అందడంతోపాటు గర్భధారణ లేకుండా హామీపూర్వక పాల ఉత్పత్తితో (పీఎఫ్‌ఎల్) రైతుల ఆదాయం రెట్టింపు చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత కృత్రిమ గర్భధారణ (ఏఐ) పద్ధతి ఆవులకు 50శాతం జన్యువులనే అందిస్తుందని, కొత్త సాంకేతికతతో వందశాతం జన్యువులను అందిస్తుందని చెప్పారు. జన్యువులు లేని ఆవు నెలకు 1,500 లీటర్ల పాలిస్తే రైతుకు రూ.9 వేలు వస్తాయని, పీఎఫ్‌ఎల్‌లో అయితే నెలకు 4,000 లీటర్ల పాల ఉత్పత్తితో పాటు రూ.28 వేల ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ సాంకేతికత త్వరలో రైతులకు పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తామని సంస్థ వ్యవస్థాపకుడు, మెంటర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్త బ్రూస్‌వైట్లా, టీఏజీ ప్రతినిధులు పాల్గొన్నారు.



# గంగారం మోటర్ల వెట్‌రన్ సక్సెస్

- రాయపేట గుట్టపై రిజర్వాయర్‌కు దిగ్విజయంగా నీటి ఎత్తిపోత
- స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి



సోమవారం కాల్వశ్రీరాంపూర్ మండలం రాయపేట రిజార్వాయర్‌లో ఎత్తిపోస్తున్న నీటిలో పూలు చల్లుతున్న ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు

**కాల్వశ్రీరాంపూర్:** పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఐదువేల ఎకరాల మెట్ట భూములను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా చేపట్టిన రాయపేట ఎత్తిపోతల పథకంలో కీలక అడుగు పడింది. హుస్సేన్ మియా వాగునీటి ఆధారంగా గంగారం పంప్‌హౌస్ నుంచి రాయపేట గుట్టపై 500 మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించారు. నీటి ఎత్తిపోతలకు పంప్‌హౌస్‌లో 150 హెచ్‌పీ సామర్థ్యం ఉన్న నాలుగు మోటర్లను ఏర్పాటుచేయగా, సోమవారం వెట్‌రన్ ప్రక్రియ చేపట్టారు. ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి స్విచాన్‌చేసి మోటర్లను ప్రారంభించగా, పైప్‌లైన్‌కు ఎలాంటి లీకేజీలు లేకుండా రాయపేట రిజర్వాయర్‌లో దిగ్విజయంగా నీటిని ఎత్తిపోశాయి. రాయపేట రిజర్వాయర్ వద్ద ఐడీసీ చైర్మన్ పూలు చల్లి నీటిని స్వాగతించారు. దీంతో తమ 40 ఏండ్ల నీటి గోస తప్పిందంటూ గంగారం, పెద్దంపేట, లక్ష్మీపూర్, పందిల్ల, కాల్వశ్రీరాంపూర్, రాయపేట గ్రామాల్లోని రైతులు పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితోనే కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఆయకట్టు ప్రాంతానికి సాగునీరందించేందకు రాయపేట రిజర్వాయర్‌కు రూపకల్పన చేసినట్టు ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి చెప్పారు.





నందిమేడారం పంప్‌హౌస్‌లోని ఐదో మోటర్ ఆన్ చేయడంతో డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకుతున్న నీరు.. రిజర్వాయర్ వద్ద పూజలు చేస్తున్న ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తదితరులు

# నందిమేడారంలో ఎత్తిపోత

- హెడ్ రెగ్యులేటర్ నాలుగు గేట్లు ఎత్తి 500 క్యూసెక్కుల విడుదల
- లక్ష్మీపూర్ సర్జ్‌పూల్‌కు నీటి విడుదల.. రాత్రి 9 గంటలకు చేరిన నీరు
- ఎత్తిపోతకు సిద్ధమవుతున్న బాహుబలి మోటర్లు.. లింక్-2లో కీలకఘట్టం

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, ధర్మారం, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలక ఘట్టం ప్రారంభమైంది. రెండో లింకులో భాగంగా ఆరోప్యాకేజీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం రిజార్వాయర్ నుంచి ఎనిమిదో ప్యాకేజీ కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసే ప్రక్రియ మొదలైంది. సోమవారం సాయంత్రం ఇంజినీరింగ్ అధికారులు నందిమేడారం సర్జ్‌పూల్ వద్ద ఐదోమోటర్ వెట్‌రన్ నిర్వహించారు. నుంచి నందిమేడారం రిజర్వాయర్‌కు ఎత్తిపోసే ప్రక్రియను ఆరంభించారు. ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి ఏడో ప్యాకేజీ నందిమేడారం రిజర్వాయర్ హెడ్‌రెగ్యులేటర్ గేట్ల వద్ద పూజలుచేశారు. సోమవారం సాయంత్రం 5.45 గంటలకు నాలుగు గేట్లు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని లక్ష్మీపూర్ సర్జ్‌పూల్‌కు విడుదలచేశారు. అక్కడి నుంచి 1.95 కిలోమీటర్లు గ్రావిటీ కెనాల్ ద్వారా ఏడో ప్యాకేజీలోని రెండు జంట సొరంగాల్లోకి వెళ్లింది. 15.373 కిలోమీటర్లదూరం అండర్‌టన్నెళ్ల ద్వారా ప్రవహించి, రాత్రి 9 గంటలవరకు లక్ష్మీపూర్ భూగర్భ సర్జ్‌పూల్‌కు చేరింది. దీనికి మూడు గంటల సమయం పట్టింది.

**పరీక్షల తర్వాత బాహుబలి మోటర్ల వెట్‌రన్**

లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ వద్ద అవసరమైన మేరకు నీరు నిండిన తదుపరి నందిమేడారం హెడ్‌రెగ్యులేటర్ గేట్లను మూసివేస్తామని అధికారులు తెలిపారు. లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ వద్ద అనేక రకాల నీటిపరీక్షలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. బాహుబలి మోటర్ల నుంచి నీటిని ఎత్తిపోసేందుకు అవసరమైన అన్ని సాంకేతిక అంశాలను సరిచూసుకొని, అందుకు సంబంధించిన పరీక్షలు నిర్వహించిన తదుపరి వెట్‌రన్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలకు రెండురోజుల సమయం పట్టే అవకాశమున్నదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. అనంతరం లక్ష్మీపూర్ సర్జ్‌పూల్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి మోటర్లలో ఒక్కో మోటర్‌కు వెట్‌రన్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.



సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దుంకుతున్న నీరు





సోమవారం వరదనీటితో కళకళలాడుతున్న శ్రీశైలం ప్రాజెక్టు

# సాగర్‌కు కృష్ణమ్మ పయనం

- వడివడిగా నిండుతున్న శ్రీశైలం రిజర్వాయర్
- విద్యుత్ ఉత్పత్తితో 42వేల క్యూసెక్కులు విడుదల
- అంతేమేరలో నాగార్జునసాగర్ వద్ద ఇన్‌ఫ్లో నమోదు
- కృష్ణాబేసిన్ ప్రాజెక్టులకు పెరుగుతున్న వరద తాకిడి

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

నాగార్జునసాగర్‌వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతున్నది. ఎగువనుంచి వచ్చే భారీవరద నీటితో శ్రీశైలం వడివడిగా నిండుతుండటంతో ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ఉత్పత్తి ద్వారా కృష్ణాజలాలు దిగువకు విడుదలవుతున్నాయి. దీంతో ఈ సీజన్‌లో మొదటిసారిగా కృష్ణమ్మ.. నాగార్జునసాగర్‌ను చేరుకున్నది. తుంగభద్ర, భీమానది నుంచి చుక్కనీరు రాకపోయినా ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టుల ద్వారా వస్తున్న వరదతో జూరాల ప్రాజెక్టు నిండి, అక్కడినుంచి తరలివచ్చిన జలాలతో శ్రీశైలం జలాశయం జలకళ సంతరించుకుంటున్నది. ఈ నెల 3న ఉదయం శ్రీశైలం జలాశయంలో 67.98 టీఎంసీలు నిల్వ ఉండగా.. సోమవారం సాయంత్రం ఆరుగంటలకు 118.05 టీఎంసీలకు చేరుకున్నది. అంటే 84 గంటల్లో 50 టీఎంసీలకు పైగా నీటి నిల్వ పెరిగింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. ప్రస్తుత వరదతో ప్రాజెక్టు నిండేందుకు ఐదురోజులు పట్టే అవకాశమున్నది. భారీ వరద వస్తుండటంతో ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలోని ఆరు యూనిట్ల ద్వారా 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. 42,378 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో నాగార్జునసాగర్‌కు ఆ వరద సోమవారం సాయంత్రం చేరింది. ఆరుగంటల సమయానికి నాగార్జునసాగర్ వద్ద ఇన్‌ఫ్లో అంతే మోతాదులో నమోదవుతున్నది. జలాశయ నీటిమట్టం 506.80 అడుగులుగా ఉన్నది. శ్రీశై లం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వా రా 2400 క్యూసెక్కులు, మల్యాల-హంద్రీనీ వా ద్వారా మరో 675 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి అవుట్‌ఫ్లో 45,453 క్యూసెక్కులుగా నమోదవుతున్నది.

**ఎగువన కొనసాగుతున్న భారీ వరద**

బేసిన్‌లోని ఎగువ ప్రాజెక్టులకు వరద తాకిడి పెరుగుతూనే ఉన్నది. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు నారాయణపుర రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో మూడులక్షలకు చేరుకోవడం విశేషం. సోమవారం సాయంత్రం ఆరుగంటలకు ఆల్మట్టి జలాశయానికి 2.59 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. నారాయణపురకు కూడా ఇన్‌ఫ్లో పెరుగుతున్నది. ఆల్మట్టి నుంచి అవుట్‌ఫ్లోను 2.9 లక్షలకు పెంచగా, సాయంత్రం ఆరుగంటలకు నారాయణపుర ఇన్‌ఫ్లో మూడులక్షలకు పెరిగింది. జలాశయాలకు వరద పెరుగుతున్నందున డ్యాంభద్రతలో భాగంగా అధికారులు నీటినిల్వను తగ్గిస్తున్నారు. మొన్నటివరకు 106 టీఎంసీలకుపైగా నిల్వను నిర్వహించి.. సోమవారం 99.83 టీఎంసీలకు తగ్గించారు. నారాయణపురలో మొన్నటిదాకా 31-32 టీఎంసీల నిల్వను కొనసాగించగా, సోమవారం 27.60 టీఎంసీలకు తగ్గించారు. సోమవారం ఉజ్జయిని జలాశయానికి 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా.. 117.24 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికిగాను జలాశయంలో నిల్వ 96.67 టీఎంసీలకు చేరుకున్నది. దిగువకు జలాల్ని వదలడంతో భీమాద్వారా ప్రధాన కృష్ణాలో వరద మోతాదు మరింత పెరిగే సూచనలున్నాయి. మరోవైపు తుంగభద్రకు 16-17 వేల క్యూసెక్కుల వరద స్థిరంగా కొనసాగుతుండగా.. కేంద్రజల సంఘం తాజా సమాచారంలో టీబీడ్యాంకు మంగళవారం ఇన్‌ఫ్లో 23 వేలక్యూసెక్కులు ఉంటుందని పేర్కొన్నది.

**జూరాలలో అదే జల సవ్వడి...**

నారాయణపుర నుంచి వస్తున్న భారీవరదతో జూరాలవద్ద కృష్ణాజలాల సవ్వడి అంతకంతకు పెరుగుతున్నది. సోమవారం సాయంత్రం ఆరుగంటల సమయానికి ఇన్‌ఫ్లో 2.62 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. మంగళవారం వరద మోతాదు పెరుగనుండటంతో జూరాల నుంచి అవుట్‌ఫ్లోను 2.64 లక్షల క్యూసెక్కులకు పెంచారు. సాగునీటి విడుదల కొనసాగుతున్నది.

**వివిధ ప్రాజెక్టులలో సోమవారం నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1698.82 | 129.72 | 99.83 | 2,59,000 | 2,90,117 |
| నారాయణపుర | 1615.00 | 1607.22 | 37.64 | 27.60 | 3,00,000 | 2,90,975 |
| జూరాల | 1045.00 | 1043.57 | 9.66 | 8.77 | 2,62,000 | 2,64,012 |
| తుంగభద్ర | 1633.00 | 1610.13 | 100.86 | 35.49 | 20105 | 1203 |
| శ్రీశైలం | 885.00 | 864.70 | 215.81 | 121.25 | 2,38,900 | 45,453 |
| నాగార్జునసాగర్ | 590.00 | 506.80 | 312.05 | 126.30 | 42378 | 400 |
| సింగూరు | 1717.93 | 1670.52 | 29.91 | 0.47 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.28 | 17.80 | 0.13 | 41 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1053.80 | 90.31 | 8.41 | 9815 | 258 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.55 | 24.07 | 3.44 | - | 204 |
| మిడ్ మానేరు | 1043.31 | 993.08 | 25.873 | 3.44 | 39 | 83 |
| కడెం | 700.00 | 695.55 | 7.60 | 6.49 | 5225 | 408 |
| ఎల్లంపల్లి | 485.56 | 485.01 | 20.18 | 19.67 | 39,204 | 54,620 |

# ఉగ్ర గంగమ్మ!


మొదటిపేజీ తరువాయి...


బరాజ్‌కు 45,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. అన్నారం బరాజ్‌లో సోమవారం వరకు 7.20 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లో 28 రోజులు ఆరు మోటర్ల ద్వారా 12.1 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అన్నారం బరాజ్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా పంపారు. అన్నారం బరాజ్‌లోని అన్నారం పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటర్ల ద్వారా ఏడు రోజులు 5 టీఎంసీల నీటిని సుందిల్ల బరాజ్‌కు తరలించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్‌కు చేరిన 7.20 టీఎంసీల నీరు అలాగే ఉన్నది. బరాజ్‌లకు గత పదిరోజుల నుంచి మానేరు, చిన్న చిన్న ఒర్రెలు, సోమవారం నుంచి సుందిల్ల బరాజ్ నుంచి వస్తున్న నీటిని అలాగే ఇంజినీర్లు దిగువకు వదిలిపెడుతున్నారు.

**మేడిగడ్డ వద్ద 8 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో**

కాళేశ్వరం వద్ద గోదావరి ఉగ్రరూపాన్ని కొనసాగిస్తున్నది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు కాళేశ్వరం వద్ద సోమవారం 7,97,000 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. గోదావరి ఒక్కసారిగా పెరుగడంతో పోలీసులు, గజఈతగాళ్లు నదివద్ద భక్తుల సౌకర్యార్థం ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో మేడిగడ్డ బరాజ్ జలశోభితమైంది. రికార్డుస్థాయిలో ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది. సోమవారం ఉదయం 81 గేట్ల నుంచి 9.16 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం సాయంత్రానికి సుమారు 7.97 లక్షలు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బరాజ్‌లోకి భారీస్థాయిలో జలాలు చేరితే మరిన్ని గేట్లను ఎత్తివేసే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం మేడిగడ్డ బరాజ్‌లో 95.60 మీటర్ల ఎత్తులో 5.485 టీఎంసీల నీటి నిల్వ ఉందని ఇంజినీర్లు తెలిపారు.

**దేవాదుల వద్ద పెరిగిన గోదావరి**

కన్నాయిగూడెం మండలం దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రం 85 మీటర్లకు చేరుకున్నది. తుపాకులగూడెం బరాజ్ వద్ద సోమవారం సాయంత్రం 8.64 మీటర్లతో ప్రవహిస్తున్నది. మొదటి ప్రమాద హెచ్చరికస్థాయిదాటి ప్రవాహం కొనసాగుతున్నది. ముల్లకట్ట పుష్కరఘా ట్ వద్ద కూడా గోదావరి ఉధృతంగానే ఉన్నది.

**భద్రాద్రి వద్ద మళ్లీ మొదటి హెచ్చరిక**

భద్రాచలం ఏజెన్సీలో గోదావరి తిరిగి పెరుగుతున్నది. రెండురోజుల క్రితం వరద ఉధృతి 43 అడుగులు దాటగా మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన సంగతి తెలిసిందే. తర్వాత వరద తగ్గుముఖం పట్టినా.. ఎగువ కొనసాగుతున్న వర్షాలతో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు 42.3 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటలకు 43.1 అడుగులకు నీటిమట్టం చేరగా కలెక్టర్ రజత్‌కుమార్ సైనీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. కాగా దిగువన ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి కొనసాగుతూనే ఉన్నది. బరాజ్‌కు 12.97 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో అధికారులు 12.90 లక్షల క్యూసెక్కుల గోదావరిజలాల్ని సముద్రంలోకి వదులుతున్నారు. సాయంత్రం ఆరుగంటల సమయానికి ధవళేశ్వరం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 11.07 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. ఈ నీటిసంవత్సరంలో ఇప్పటివరకు సముద్రంలోకి 455.503 టీఎంసీల గోదావరిజలాలు కలిశాయి.



నిండుకుండను తలపిస్తున్న ఎల్లంపల్లి ప్రాజెక్టు



నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో 2015 జూలై 5న మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్ (ఫైల్)



మామడ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో 2015 జూలై 5న సీఎం కేసీఆర్ నాటిన మొక్క ప్రస్తుతం ఏపుగా ఇలా..

## సీఎం కేసీఆర్ నాటిన మొక్క ఏపుగా..

**మామడ :** 'వానలు వాపస్ రావాలి.. కోతులు వాపస్ పోవాలి' అంటూ సీఎం కేసీఆర్ చెప్పిన మాట అక్షరాలా వాస్తవరూపం దాల్చుతున్నది. 2015లో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే ఏడాది జూలై 5న నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ట్రీ గార్డులను ఏర్పాటుచేసి నిత్యం నీటిని అందించడంతో ప్రస్తుతం సీఎం కేసీఆర్ నాటిన ఆ మొక్కగా ఏపుగా పెరిగింది.





# సిరిసిల్ల.. హరితఖిల్లా

- మూడేండ్లలో నాటిన మొక్కలు 2.76 కోట్లు
- హరితహారం వందశాతం సక్సెస్
- ఈ ఏడాది లక్ష్యం 1.4 కోట్ల మొక్కలు
- వన సంరక్షణ సమితులతో ఉత్తమ ఫలితాలు



హరితహారంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట గ్రామంలోని ఊరగుట్టపై రెండేండ్ల కిందట నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా ఇలా..

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. ప్రతి పల్లెలో పచ్చదనం పరచుకుంటున్నది. యేటా పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నది. లక్ష్యానికి మించి మొక్కలను నాటడమే కాదు.. వాటన్నింటిని సంరక్షిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. రెండేండ్లలోనే 2.76 కోట్ల మొక్కలు నాటి వందశాతం సంరక్షించింది. ఈ ఏడాది 1.4 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నది.

**అగ్రభాగాన నిలిపేందుకు ప్రణాళిక**

హరితహారంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాటిన మొక్కలను సంరక్షించి జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నది. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు మార్గదర్శనంలో మొక్కల సంరక్షణ కోసం ప్రతి గ్రామంలో వనసంరక్షణ సమితులను ఏర్పాటుచేసింది. ప్రతి మొక్కనూ సంరక్షించే బాధ్యత ఆ గ్రామ పంచాయతీకే అప్పగించింది. జిల్లాలోని 13 మండలాల్లో 2016లో 80 లక్షలు, 2017లో 96 లక్షలు, 2018లో కోటి మొక్కలు నాటారు. ఐదోవిడుత హరితహారంలో భాగంగా ఈ ఏడాది 1.4 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా ప్రజలు మొక్కలు నాటుతూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. మొక్కల సంరక్షణలో ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామం గత ఏడాది ఆదర్శ గ్రామంగా ఎంపికై అవార్డును అందుకున్నది. గంభీరావుపేట మండలంలోని భీముని మల్లారెడ్డిపేట ఊరగుట్టపై నాటిన ప్రతి మొక్క బతికి పచ్చదనంతో కళకళలాడుతున్నది. 2017, 2018లో 40 వేల మొక్కలచొప్పున మొత్తం 80 వేల మొక్కలు నాటారు. ఆ మొక్కలన్నీ పెరిగి గుట్ట చుట్టూ చెట్లే కనిపిస్తున్నాయి. ఇలా ఎన్నో ప్రాంతాలు హరితమయంగా మారాయి.

## ఏసీబీకి చిక్కిన ఎంఈవో



ఎంఈవో ముత్తయ్య

**బచ్చన్నపేట:** ప్రధానోపాధ్యాయుడి నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ జనగామ జిల్లా బచ్చన్నపేట ఎంఈవో టీ ముత్తయ్య సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి అనారోగ్యంతో జూలై 18 నుంచి మూడ్రోజులు సెలవు పెట్టారు. ఈ సమయంలో డీఈవో తనిఖీచేసి హాజరు రిజిస్టర్‌లో రిమార్కులు రాశారు. పాఠశాలకు సరిగారావడం లేదని డీఈవోకు ఫిర్యాదు చేస్తానని కృష్ణారెడ్డిని ముత్తయ్య బ్లాక్ మెయిల్ చేస్తూ రూ.10 వేలు డిమాండ్‌చేశాడు. కృష్ణారెడ్డి ఏసీబీని ఆశ్రయించారు.


**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**

ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, దొడ్డవరప్పాడు గ్రామం, మెషినరితో స్పిన్నింగ్ మిల్ మరియు నేషనల్ హైవే సమీపాన 28 ఎకరాల భూమి. దర్శించండి.
**http://syndicatebank.auctiontiger.net**
వేలం ID నెం: 171211, 171212 అక్షాంశం & రేఖాంశం: 15°35'38.1"N 80°02'11.7"E

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**

హైదరాబాద్, జూబ్లీహిల్స్, నవనిర్మాణ్ కాలనీ వద్ద ప్లాట్ నం. 58, 200 చ.గజాల విస్తీర్ణపు ఖాళీ ప్లాట్ అమ్మకమునకు కలదు.
**http://syndicatebank.auctiontiger.net** దర్శించండి.
వేలం ID నెం: 170535
అక్షాంశం & రేఖాంశం: 17°25'14.2"N 78°24'32.0"E
(17.420613, 78.408891)

**సిండికేట్ బ్యాంక్ వేలం అమ్మకం**
**SARFAESI చట్టం క్రింద**

హైదరాబాద్, కావూరిహిల్స్-5 అంతస్తులలో కమర్షియల్ స్పేస్, కొండాపూర్-కమర్షియల్ స్పేస్, అమీర్‌పేట్- 2 అంతస్తుల భవనం
**http://syndicatebank.auctiontiger.net** దర్శించండి.
వేలం ID నెం: 168256, 168257, 168258
అక్షాంశం & రేఖాంశం: 17°26'26.7"N 78°23'54.2"E
అక్షాంశం & రేఖాంశం: 17°27'51.0"N 78°20'40.3"E
అక్షాంశం & రేఖాంశం: 17°26'23.2"N 78°27'18.3"E
(17.439782, 78.455083)

**TS Ed.CET-2019 ADMISSIONS**
**TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION, HYDERABAD**
**NOTIFICATION**
**Certificate Verification & Option Exercising for Web Based Counseling**
The qualified candidates of **TS Ed.CET-2019** are hereby informed that certificate verification for admission into two year **B.Ed course** for the academic year **2019-20** following **G.O.Ms.No 24**, dt: **24-08-2017** will commence from **16.08.2019** and online option entry from **17.08.2019.** For detailed notification please visit the website http://edcet.tsche.ac.in, **http://edcetadm.tsche.ac.in**
Date: 06-08-2019
Place: HYDERABAD
Sd/- Convener
TS Ed.CET-2019 Admn.

# క్యాబినెట్ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 5: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణం రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించడానికి ముందు సోమవారం ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశమైంది. ఇందు కోసం కేంద్రమంత్రులు అమిత్‌షా, రవిశంకర్ ప్రసాద్ తొలుత ప్రధాని నివాసానికి చేరుకున్నారు. సాధారణంగా కేంద్ర క్యాబినెట్ ప్రతి బుధవారం సమావేశమవుతుంది. సోమవారం సమావేశానికి కారణాలను ప్రభుత్వం వెల్లడించలేదు. వారం రోజులుగా కశ్మీర్ లోయలో భారీస్థాయిలో అదనపు బలగాలను మోహరించిన నేపథ్యంలో ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే 35ఏ రాజ్యాంగ అధికరణాలను రద్దుచేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోనున్నదని వార్తలొచ్చాయి. అందుకు తగినట్లుగానే క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. క్యాబినెట్ భేటీ కన్నా ముందు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా సమావేశమైనట్లు తెలుస్తున్నది.



'హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో పేర్కొన్న విషయాలు విస్తృతమైనవి, వాస్తవమైనవి. జమ్ముకశ్మీర్‌పై గతం నుంచి ఉన్న చారిత్రక అన్యాయాలను చక్కగా ప్రస్తావించారు. జమ్ముకశ్మీర్ సోదరి,సోదరుల పట్ల ప్రభుత్వ దృక్పథాన్ని తేటతెల్లం చేశారు'

**- ప్రధాని మోదీ**

## జమ్ముకశ్మీర్ ప్రజలకు నమ్మక ద్రోహం



1947లో భారత్‌లో జమ్ముకశ్మీర్ విలీన సమయంలో రాష్ట్ర ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నేటి భారత ప్రభుత్వ ఏకపక్ష, దిగ్భ్రాంతికర నిర్ణయాలు పూర్తిగా వమ్ము చేశాయి. ఇవి పెను విపత్కర పరిణామాలకు దారితీస్తాయి. ఈ దారుణ నిర్ణయాల అమలుకు కొన్ని వారాలుగా భారత ప్రభుత్వం మోసం, వంచనకు పాల్పడింది. లక్షల మంది సాయుధ భద్రతా బలగాలను మోహరించి, జమ్ము కశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక గొంతుకగా నిలుస్తున్న మాలాంటి వాళ్లను నిర్బంధించారు. 370, 35ఏ అధికరణల అధికరణల ప్రాతిపదికపైనే విలీనం జరిగింది. ఈ నిర్ణయాలను నేషనల్ కాన్ఫరెన్స్ సవాల్ చేస్తున్నది. కఠిన, సుదీర్ఘ పోరాటం ముందున్నది. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

**-ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు**



జమ్ముకశ్మీర్, లడఖ్‌లో శాంతికి, అభివృద్ధికి దోహదపడే చారిత్రక నిర్ణయం తీసుకున్న మోదీ, షాకు నా అభినందనలు. జాతీయ సమైక్యతను బలోపేతం చేసే సాహసోపేత అడుగు ఇది.

**- ఎల్‌కే అద్వానీ, బీజేపీ సీనియర్ నేత**

సాహసోపేత, చారిత్రక నిర్ణయం. గ్రేట్ ఇండియా – ఏక్ భారత్‌కు మనం సెల్యూట్ చేద్దాం.

**- సుష్మా స్వరాజ్, కేంద్ర మాజీ మంత్రి**




# ఆర్టికల్ 370 రద్దు

### కేంద్ర ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం

- ఆమోదిస్తూ గెజిట్ విడుదల చేసిన రాష్ట్రపతి
- రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టిన హోంమంత్రి అమిత్‌షా
- స్వయంప్రతిపత్తి కోల్పోయిన కశ్మీర్.. కాలగర్భంలోకి ఆర్టికల్ 35-ఏ
- కేంద్ర పాలిత ప్రాంతాలుగా జమ్ముకశ్మీర్, లడఖ్
- రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తూ మరో బిల్లు.. రాజ్యసభ ఆమోదం
- 72 ఏండ్ల సమస్యకు ఇది పరిష్కారం: అమిత్ షా
- బిల్లులకు టీఆర్‌ఎస్ సహా పలు పార్టీల మద్దతు
- తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, పీడీపీ, ఎన్సీ తదితర పార్టీలు
- కశ్మీర్‌ను హత్యచేశారు: గులాంనబీ ఆజాద్




ఆర్టికల్ 370 తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రసంగిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా. చిత్రంలో ప్రధాని మోదీ తదితరులు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:**

కేంద్రం చారిత్రాత్మక, సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే అధికరణం 370ని అనూహ్యంగా కేంద్రం రద్దుచేసింది. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గెజిట్ విడుదల చేశారు. ఈ తీర్మానాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీంతో ఆర్టికల్ 370, దానిలో అవిభాజ్యంగా ఉన్న ఆర్టికల్ 35–ఏ కాలగర్భంలో కలిసిపోయాయి. జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కోల్పోయింది. దీంతో 72 ఏండ్ల సమస్యకు ఓ పరిష్కారం చూపినట్టయిందని కేంద్రం పేర్కొన్నది. ఇకపై జమ్ముకశ్మీర్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఉగ్రవాదాన్ని నిర్మూలించవచ్చని విశ్వాసం వ్యక్తం చేసింది. దీంతోపాటు కేంద్రం జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. జమ్ముకశ్మీర్‌ను చట్టసభలు గల కేంద్రపాలిత ప్రాంతంగా, లడఖ్ ప్రాంతాన్ని చట్టసభలు లేని కేంద్రపాలిత ప్రాంతంగా విభజించింది. ఆర్టికల్ 370 రద్దు తీర్మానంతోపాటు విభజన బిల్లును రాజ్యసభ ఆమోదించింది. కేంద్రం నిర్ణయంపై పార్లమెంట్‌లో, బయట ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. కేంద్రం జమ్ముకశ్మీర్‌ను హత్య చేసిందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని విపక్షాలు మండిపడ్డాయి. పీడీపీ ఎంపీలు రాజ్యసభలో చొక్కాలు చించుకొని, రాజ్యాంగ ప్రతులను చింపి నిరసన తెలిపారు.

**అంతా క్షణాల్లోనే..**

జమ్ముకశ్మీర్‌లో కొన్నాళ్లుగా జరుగుతున్న పరిణామాలతో ఆర్టికల్స్ 370, 35–ఏలను రద్దు చేస్తారని వార్తలు వస్తున్నాయి. ఇదంతా 'భద్రత' కోసమేనని కేంద్రం చెప్తున్నా.. కీలక నిర్ణయం తీసుకోనున్నదని, ముందస్తు చర్యల్లో భాగంగానే అదనపు బలగాలను మోహరిస్తున్నారని అంతా భావించారు. అనుకున్నట్టుగానే సోమవారం పరిణామాలు వేగంగా మారిపోయాయి. ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజనపై మొదటి నుంచీ గోప్యత పాటించిన కేంద్ర ప్రభుత్వం.. బిల్లులను రాజ్యసభలో ప్రవేశపెట్టేవరకు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నది. ముందుగా సోమవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టికల్ 370 రద్దుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇతర మంత్రులు పార్లమెంట్‌కు బయలుదేరి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యులంతా లేచి నిలబడి స్వాగతం పలికారు. ఆయన సభలో ఇతర బిల్లులతోపాటు ఆర్టికల్ 370 రద్దు తీర్మానాన్ని ప్రవేశపెట్టి అందరినీ షాక్‌కు గురిచేశారు. అంతకుముందే ఆర్టికల్ 370 రద్దుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ నిర్ణయం సోమవారం నుంచే అమల్లోకి వస్తుందంటూ గెజిట్ జారీ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన గెజిట్ పత్రాలను అమిత్‌షా సభ్యులందరికీ అందించారు. దీంతో జమ్ముకశ్మీర్ స్వయంప్రతిపత్తిని కోల్పోయింది. ఈ బిల్లులను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించినా.. నిరసనలు తెలిపినా ఫలితం లేకపోయింది. అనంతరం రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లుకు ఆమోదముద్ర పడింది. దీంతో జమ్ముకశ్మీర్ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది.

## బిల్లులను ఆమోదించిన రాజ్యసభ

అమిత్‌షా ప్రవేశపెట్టిన బిల్లులపై రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లులను రాజ్యసభ ఆమోదించింది. ఆర్టికల్ 370 రద్దు, రిజర్వేషన్ల బిల్లులను మూజువాణీ ఓటుతో ఆమోదించగా.. 'జమ్ముకశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ బిల్లు–2019'పై ఓటింగ్ నిర్వహించారు. చర్చ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ వాకౌట్ చేసింది. బిల్లుకు అనుకూలంగా 125 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 61 ఓట్లు వచ్చాయి. దీంతో బిల్లు ఆమోదం పొందినట్టు చైర్మన్ వెంకయ్యానాయుడు ప్రకటించారు. సభను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు. మరోవైపు హోంమంత్రి అమిత్‌షా జమ్ముకశ్మీర్ పునర్విభజన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరారు. అయితే బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. బిల్లుపై బుధవారం చర్చిద్దామని, కేవలం అనుమతి మాత్రమే కోరుతున్నామని అమిత్‌షా ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతిప్రశ్నకు సమాధానం ఇస్తామన్నారు.

**సభలో ఏం జరిగిందంటే..**

సోమవారం ఉదయం రాజ్యసభ ప్రారంభం కాగానే జమ్ముకశ్మీర్‌లో పరిస్థితిపై చర్చించాలని ప్రతిపక్షాలు చైర్మన్ వెంకయ్యానాయుడును కోరాయి. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ రాష్ట్రమంతటా కర్ఫ్యూ విధించారని, ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులు, ఇతర ముఖ్యనేతలు గృహ నిర్బంధంలో ఉన్నారని చెప్పారు. దీనిపై చర్చ జరుగాలని చైర్మన్‌ను కోరారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు తన విచక్షణ అధికారాలను ఉపయోగించి బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వానికి అనుమతించారు. 'జాతీయ అత్యవసరత'ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందస్తు నోటీసులు ఇవ్వకున్నా బిల్లులను ప్రవేశపెట్టేందుకు సమ్మతించారు. ఈ సందర్భంగా అమిత్ షా ఆర్టికల్ 370 రద్దు తీర్మానంతోపాటు జమ్ముకశ్మీర్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, రాష్ట్రంలోని ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రవేశపెట్టారు. ఆర్టికల్ 370 రద్దును రాష్ట్రపతి ఆమోదించారంటూ సభ్యులకు తెలిపారు. గెజిట్ కాపీలను సభ్యులందరికీ పంచారు. ఈ మేరకు జమ్ముకశ్మీర్ స్వయంప్రతిపత్తిని కోల్పోయిందని హోంమంత్రి ప్రకటించారు. అమిత్‌షా బిల్లులను ప్రవేశపెడుతున్నంతసేపు సభలో ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. పలువురు సభ్యులు పెద్దపెట్టున అరిచారు. నినాదాలు హోరెత్తాయి. రాజ్యసభలో ప్రతిపక్షనేత గులాంనబీ ఆజాద్, ఉపనేత ఆనంద్ శర్మ, టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ తదితరులు వెల్‌లోకి దూసుకొచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

- టీఆర్‌ఎస్‌తోపాటు వైసీపీ, బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకే, ఆమ్‌ఆద్మీ తదితర పార్టీలు ఈ బిల్లులకు మద్దతు తెలిపాయి. ఎన్డీయే భాగస్వామి జేడీయూ బిల్లులను వ్యతిరేకిస్తూ వాకౌట్ చేసింది. కాంగ్రెస్, తృణమూల్, పీడీపీ, ఎన్సీ, వామపక్షాలు రెండు బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించాయి.
- జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ల బిల్లుతో రాష్ట్రంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ దక్కుతుందని అమిత్‌షా పేర్కొన్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు ఇది అదనమన్నారు.
- పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రకారం జమ్ముకశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోతుందని హోంమంత్రి చెప్పారు. జమ్ముకశ్మీర్ ప్రాంతం ఢిల్లీ మాదిరిగా చట్టసభలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగా, లడఖ్ ప్రాంతం ఛండీగఢ్ మాదిరిగా చట్టసభలు లేని కేంద్రపాలిత ప్రాంతంగా మారుతుందని వివరించారు.

## పీడీపీ ఎంపీల గెంటివేత

ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్‌కు చెందిన పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ (పీడీపీ) ఎంపీలు నజీర్ అహ్మద్ లావై, మిర్ మొహమ్మద్ ఫయాజ్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాజ్యాంగ ప్రతులను చించేశారు. ఎంపీ నజీర్ అహ్మద్ లావై తన కుర్తాను చింపుకున్నారు. బీజేపీ నేత విజయ్ గోయెల్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారు ఆయన్ను తోసేశారు. రాజ్యాంగ ప్రతులను చింపడంపై చైర్మన్ వెంకయ్యానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రాజ్యాంగం అత్యున్నతమైనది. దానిని ఎవరూ అవమానించరాదు' అని పేర్కొన్నారు. వెంకయ్యానాయుడు ఆదేశం మేరకు మార్షల్స్ ఇద్దరు పీడీపీ ఎంపీలను సభ నుంచి బయటకు ఈడ్చుకెళ్లారు. అనంతరం వారు పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహంముందు చిరిగిన దుస్తులతో నిరసన తెలిపారు.



పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు చిరిగిన దుస్తులతో నిరసన తెలుపుతున్న పీడీపీ ఎంపీలు నజీర్ అహ్మద్ లావై, మీర్ మొహమ్మద్ (ఇన్‌సెట్) వారు చింపిన రాజ్యాంగ ప్రతులు

## అభివృద్ధికి అధికరణే అడ్డంకి

బిల్లులు ప్రవేశపెట్టడం, బిల్లులపై చర్చ సందర్భంగా హోంమంత్రి అమిత్‌షా మాట్లాడుతూ ఇదో చారిత్రాత్మక సందర్భంగా పేర్కొన్నారు. తమ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చుతున్నామని తెలిపారు. జమ్ముకశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కాకుండా ఆర్టికల్–370 అడ్డుపడుతున్నదని చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులతో ఆ ఆర్టికల్ రద్దయిందని స్పష్టం చేశారు. రాష్ట్రపతి విడుదల చేసిన గెజిట్‌ను చదువుతూ 'పార్లమెంట్ సూచన మేరకు 2019 ఆగస్ట్ 5న రాష్ట్రపతి విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం క్లాజ్–1 మినహా ఆర్టికల్ 370 మొత్తం రద్దవుతుంది. ఇకపై రాజ్యాంగంలోని అన్ని నిబంధనలు ఎలాంటి మార్పులు లేకుండా జమ్ముకశ్మీర్‌కు కూడా వర్తిస్తాయి' అని స్పష్టం చేశారు.




**దారిద్ర్యం, అవినీతి**

రాజకీయ ప్రయోజనాలకే విపక్షాలు సభలో గందరగోళం సృష్టిస్తూ, పసలేని విమర్శలు చేస్తున్నాయని అమిత్‌షా మండిపడ్డారు. కశ్మీర్ విభజనతో అల్లకల్లోలం జరుగుతుందని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏం జరుగదు. భూమిపై ఉన్న స్వర్గం.. కశ్మీర్. అది అలాగే ఉంటుంది' అని పేర్కొన్నారు. విపక్షాల ప్రతి ప్రశ్నకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కేవలం 3 కుటుంబాలు జమ్ముకశ్మీర్‌ను దశాబ్దాలుగా దోచుకుంటూ, అవినీతిని పెంచి పోషిస్తున్నాయని మండిపడ్డారు. 370 అధికరణతోనే జమ్ముకశ్మీర్ భారత్‌లో విలీనమైందనే వాదనను కొట్టిపారేశారు. భవిష్యత్‌లో జమ్ముకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా వస్తుందని.. సరైన సమయంలో, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినప్పుడు ఇది సాధ్యమన్నారు.

**గతంలో కాంగ్రెస్ చేసిందే..**

రాజ్యాంగ సవరణ చేయకుండా ఆర్టికల్స్‌ను ఎలా రద్దు చేస్తారన్న సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్ ప్రశ్నకు అమిత్‌షా జవాబిస్తూ.. ఆర్టికల్ 370 లోని మూడో నిబంధన చదివి వినిపించారు. దీని ప్రకారం ఆర్టికల్‌లో మార్పులు చేసే అధికారం రాష్ట్రపతికి ఉన్నదని, నోటిఫికేషన్/ గెజిట్ విడుదలతో నిబంధనల మార్పులు చేర్పులు/ రద్దు చేయవచ్చన్నారు. 'రాష్ట్ర అసెంబ్లీ సూచన మేరకే రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని నిబంధనలో ఉన్నది. అసెంబ్లీ రద్దయినప్పుడు బాధ్యతలు, హక్కులన్నీ పార్లమెంట్ ఉభయ సభలకు బదిలీ అవుతాయి' అని చెప్పారు. ప్రస్తుతం జమ్ముకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నందున అసెంబ్లీ తీర్మానం అవసరం లేదని, పార్లమెంట్ ఉభయ సభలకే అధికారాలు ఉన్నాయన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించి ఆమోదింపజేస్తామన్నారు. 'కాంగ్రెస్ పార్టీ 1952, 1962లో రాష్ట్రపతి ఉత్తర్వులతో ఆర్టికల్ 370లో మార్పులు చేసింది. ఇప్పుడు మేం కూడా వారి మార్గాన్నే అనుసరిస్తున్నాం' అని అన్నారు.

**ఆర్టికల్ 370 ద్వారానే జమ్ముకశ్మీర్ భారత్‌లో విలీనమైందనేది అబద్ధం. కశ్మీర్ 1947 అక్టోబర్ 27న భారత్‌లో విలీనమైంది. 370 అధికరణ 1949లో వచ్చింది. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం గత ప్రభుత్వాలు దానిని తొలిగించడానికి సాహసించలేదు.**

## దారిద్ర్యంలో లక్షల కుటుంబాలు

జమ్ముకశ్మీర్‌లో అభివృద్ధికి 370, 35–ఏ అధికరణాలు పెద్ద అడ్డంకి అని అమిత్‌షా అన్నారు. ఆర్టికల్ 370తో జమ్ముకశ్మీర్‌లోని లక్షల కుటుంబాలు దారిద్ర్యంలో బతుకుతున్నాయని, అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. వీటిని రద్దు చేసే వరకు రాష్ట్రంలో ఉగ్రవాద నిర్మూలన అసాధ్యమన్నారు. ఉగ్రదాడులతో రాష్ట్రంలో ఇప్పటివరకు 41,400 మంది మరణించారని, వారి మరణాలకు ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. రాష్ట్రేతరులు భూముల కొనుగోలును ఆర్టికల్ 370 అడ్డుకుంటుండటంతో రాష్ట్రంలో భూముల ధరలు ఏమాత్రం పెరుగడం లేదని, పర్యాటక రంగం కుంటుపడిందని, పరిశ్రమల స్థాపన కష్టంగా మారిందన్నారు. సిమెంట్ ధరలు మిగతా ప్రాంతాల కన్నా రూ.100 ఎక్కువ అని ఉదహరించారు. కనీసం ప్రైవేట్ దవాఖానలు స్థాపించాలన్నా, విద్యాసంస్థలు నెలకొల్పాలన్నా ఈ నిబంధనలే అడ్డు అని చెప్పారు. ఫలితంగా మెరుగైన వైద్యం అందడం లేదని, విద్యాహక్కు చట్టం సరిగా అమలు కావడం లేదన్నారు. 'లోయలోని పిల్లలు మెరుగైన విద్యను అందిపుచ్చుకోవద్దా?' అని విపక్షాలను నిలదీశారు. ఆర్టికల్ 370, 35–ఏ 'తాత్కాలిక అధికరణలు' అని, వాటిని ఎన్నాళ్లపాటు కొనసాగిద్దామని ప్రశ్నించారు. రెండు అధికరణల రద్దుతో జమ్ముకశ్మీర్ నిజంగా భారత్‌లో అంతర్భాగమవుతుందన్నారు. జమ్ముకశ్మీర్‌ను అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదన్నారు. దేశవ్యాప్తంగా సగటున ఒక పౌరుడికి రూ.3,681 వ్యయం చేస్తుండగా, జమ్ముకశ్మీర్ ప్రజల కోసం తలా రూ.14,255 ఖర్చుపెడుతున్నట్టు చెప్పారు.



## పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నా

- రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ కాలిటా వెల్లడి.. పార్టీకి రాజీనామా

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370 అధికరణం రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాజ్యసభలో పార్టీ వాణిని గట్టిగా వినిపిస్తున్న భువనేశ్వర్ కాలిటా.. 370 అధికరణంపై కాంగ్రెస్ పార్టీ వైఖరితో విభేదించారు. అసోం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాలిటా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. జాతి భావోద్వేగాలు, మానసిక స్థితికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. 'కశ్మీర్‌పై విప్ జారీ చేయాలని కాంగ్రెస్ కోరింది. కానీ నిజంగా జాతి మానసిక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఈ విప్ యావత్ దేశానికి వ్యతిరేకం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానం ఆత్మహత్యాసాదృశ్యం. అందులో నేను భాగస్వామిని కాలేను. పార్టీని కాంగ్రెస్ నాయకత్వం ధ్వంసం చేస్తున్నది. కాంగ్రెస్ పతనాన్ని ఎవరూ నిలువరించలేరు' అని చెప్పారు.

# జమ్ముకశ్మీర్‌ను హత్యచేశారు

- కాంగ్రెస్ నేత ఆజాద్ ధ్వజం
- చీకటిదినంగా అభివర్ణించిన ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5:** ఆర్టికల్ 370, 35–ఏ రద్దు, రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌ను హత్యచేసిందని రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ గులాంనబీ ఆజాద్ విమర్శించారు. హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టిన బిల్లులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. హోం మంత్రి రావడంతోనే రాజ్యసభలో అణుబాంబు పేల్చారని మండిపడ్డారు. 'జమ్ముకశ్మీర్‌ను భారతదేశ కిరీటంగా అభివర్ణిస్తుంటారు. అలాంటి రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడం ద్వారా తల నరికేశారు. నా రాజకీయ జీవితంలో ఇలాంటి ఒక రోజు చూడాల్సి వస్తుందని ఊహించలేదు' అని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ పాలన పరిధిలోకి తేవడం సిగ్గుపడాల్సిన విషయమని విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని విభజించడంతోపాటు కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం ద్వారా భారతదేశ పటం నుంచి జమ్ముకశ్మీర్‌ను తొలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడాన్ని భారతదేశ చరిత్రలోనే మాయని మచ్చగా అభివర్ణించారు. నవభారత్‌ను సృష్టించడమంటే ప్రాచీన భారత్‌ను నాశనం చేయడమేనా? అని కేంద్రాన్ని నిలదీశారు. ఓట్ల కోసం దేశ చరిత్ర, సంస్కృతి, సమైక్యతతో ఆడుకోవద్దని కోరారు. జమ్ము ప్రజలు మన భద్రతా బలగాలకే అండగా నిలిచారని, ఒకే మతమైనా ఏనాడూ పాకిస్థాన్‌కు మద్దతు తెలుపలేదన్నారు. 'రాష్ట్ర ప్రజలు భారతదేశ లౌకికవాదాన్ని గౌరవించారు. ఇప్పుడు మీరు (కేంద్రం) విభజన మొదలుపెట్టారు. చట్టాల ద్వారా ప్రజలను కలిపి ఉంచడం సాధ్యం కాదు. మనసులు కలిసినప్పుడే అది సాకారమవుతుంది' అని పేర్కొన్నారు. దమ్ముంటే గుజరాత్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తూ బిల్లు తీసుకురావాలని సవాల్ విసిరారు. చివరగా జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ బిల్లుకు తాను మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. కులమతాలకు అతీతంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**రాజ్యాంగానికి చీకటిరోజు**

ప్రభుత్వ నిర్ణయాలను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేశాయని మండిపడ్డాయి. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ సోమవారాన్ని దేశ చరిత్రలో 'బ్లాక్ మండే'గా అభివర్ణించారు. ఆర్జేడీ నేత మనోజ్‌కుమార్ ఝా మాట్లాడుతూ.. ఆర్టికల్ 370 రద్దును అమలు చేయడానికి జీవితకాలం సరిపోదన్నారు. కశ్మీర్‌ను వచ్చే ఐదేండ్లలో పాలస్తీనాగా మార్చేందుకు నేడు మనం తలుపులు తెరిచామని చెప్పారు. డీఎంకే ఎంపీ తిరుచి శివ మాట్లాడుతూ.. కేంద్రం నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. జమ్ము కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును ప్రవేశపెట్టినందుకు ప్రభుత్వానికి శుభాకాంక్షలు అని తెలిపారు. సీపీఎం సభ్యుడు టీకే రంగరాజన్ మాట్లాడుతూ.. ఆరెస్సెస్, బీజేపీలు భారత రాజ్యాంగాన్ని, దేశ సమైక్యతను ధ్వంసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎండీఎంకే సభ్యుడు వైకో మాట్లాడుతూ.. ఆర్టికల్ 370ని రద్దు చేయడం వల్ల భవిష్యత్తులో జమ్ముకశ్మీర్.. కొసోవో, దక్షిణ సూడాన్, తూర్పు తైమూర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగం చేసేందుకు నాడు అంగీకారం తెలిపారని కాంగ్రెస్ ఎంపీ కపిల్ సిబల్ ఆరోపించారు. అయితే, జవహర్‌లాల్ నెహ్రూ కారణంగానే కశ్మీర్ భారత్‌లో భాగమైందని అన్నారు.

## ఘోర తప్పిదం



ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఘోర తప్పిదానికి పాల్పడిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం విమర్శించారు. ఇది అతి పెద్ద చట్టపరమైన పొరపాటు అని వ్యాఖ్యానించారు. జమ్ముకశ్మీర్‌ను ముక్కముక్కలుగా చేయడం ద్వారా బీజేపీ వేలాది మంది యువతను హింసవైపు నెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని భారతదేశ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. 'ప్రస్తుతానికి మీరు గొప్ప విజయం సాధించామని అనుకోవచ్చు. అయితే మీరెంటో చరిత్ర రుజువు చేస్తుంది. ఈ రోజు ఈ సభ ఎంత ఘోర తప్పిదం చేస్తున్నదో భవిష్యత్తు తరాలకు తెలిసొస్తుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. 'మీరు ఈ రోజు చేస్తున్నది దేశంలోని ప్రతి రాష్ట్రానికి చెడు సంకేతాలను పంపుతున్నది' అని ఆయన పేర్కొన్నారు. 'ఆర్టికల్ 370ని ఉపయోగించి ఆర్టికల్ 370ని ఎలా మార్పు చేస్తారు? ఇది మీ మేనిఫెస్టో హామీ అని నాకు తెలుసు. అయితే 370 రద్దు విషయంలో మీ నియంత్రణలో లేని అధికారాలను మీరు ఉపయోగిస్తున్నారు' అని విమర్శించారు.

## అక్రమం, రాజ్యాంగ విరుద్ధం



భారత ప్రజాస్వామ్య చరిత్రలో నేడు అత్యంత చీకటిదినం. 1947 లో ద్విజాతి సిద్ధాంతాన్ని తిరస్కరించి, భారత్‌లో విలీనమవుతూ జమ్ముకశ్మీర్ నాయకత్వం తీసుకున్న నిర్ణయం బెడిసికొట్టింది. 370 అధికరణను రద్దు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయం అక్రమం, రాజ్యాంగ విరుద్ధం. విపత్కర పరిణామాలకు ఇది దారితీస్తుంది. భారత ప్రభుత్వ ఉద్దేశమేంటో స్పష్టమైంది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి జమ్ము కశ్మీర్ భూభాగాన్ని లాక్కోవాలని చూస్తున్నారు. కశ్మీర్‌కిచ్చిన హామీలు నిలుపుకోవడంలో భారత్ విఫలమైంది. కశ్మీర్‌లో పరిణామాలపై మీడియా, పౌరసమాజం సంబరాలు జుగుప్సాకరం. భారత ప్రభుత్వ కపట వైఖరి స్పష్టమైంది. దేశంలోని ఏకైక ముస్లిం మెజార్టీ రాష్ట్రంలో జనాభా నిష్పత్తిని మార్పు చేయాలని వారు కోరుకుంటున్నారు. తమ సొంత రాష్ట్రంలోనే ముస్లింలను రెండో తరగతి ప్రజలుగా చేయాలనుకుంటున్నారు. నన్ను గృహ నిర్బంధంలో ఉంచారు. సందర్శకులనూ అనుమతించడం లేదు. ఈ భారత్‌లోనా మనం విలీనం కావాలనుకున్నది?

**-మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధినేత్రి**

## న్యాయ నిపుణుల భిన్న స్పందనలు

**న్యూఢిల్లీ:** కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై న్యాయ నిపుణులు భిన్నంగా స్పందించారు. కొందరు ప్రశంసించగా, మరికొందరు తప్పుబట్టారు. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం చట్టబద్ధమేనని, దీనికి వ్యతిరేకంగా ఏ పిటిషన్ కూడా నిలువజాలదని సీనియర్ న్యాయవాది, రాజ్యాంగనిపుణుడు రాకేశ్ ద్వివేది అన్నారు. మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే స్పందిస్తూ.. 'ఇది అత్యంత క్లిష్టమైన చట్టపరమైన అంశం. దీన్ని పూర్తిగా నేనింకా విశ్లేషించలేదు' అని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం విప్లవాత్మకమేమీ కాదని మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ అన్నారు. 'కేంద్రం విప్లవాత్మకమైన చర్యలేమీ చేపట్టలేదు. ఇప్పటి వరకు రాష్ట్రానికి(జమ్ముకశ్మీర్) అమలు కాని చట్టాలు, ఇకపై అమలవుతాయి' అని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో కేంద్ర చట్టాల అమలు విషయమై నిర్ణయం తీసుకునే ఆర్టికల్ 370 గత నిబంధనలను ఉటంకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత అశ్విని కుమార్ తప్పు బట్టారు. దీని వల్ల తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. విపక్షాలను సంప్రదించకుండా నిర్ణయించడాన్ని ఆక్షేపించారు.



ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా నరేంద్ర మోదీ గతంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నప్పటి దృశ్యం. ఈ ఫొటోని రామ్‌మాధవ్ ట్వీట్ చేశారు.

**• ఎజెండా పత్రం**



అమిత్‌షా పార్లమెంట్‌లోకి ప్రవేశించే ముందు ఆయన చేతిలోని ఓ పత్రం జమ్ముకశ్మీర్‌పై ప్రభుత్వ ఎజెండాను స్పష్టంచేసింది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతికి సమాచారం ఎప్పుడు తెలిపింది, క్యాబినెట్ సమావేశం, రాష్ట్రపతి నోటిఫికేషన్,రాజ్యసభలో బిల్లువంటి రాజ్యాంగ పరమైన విధానాలతోపాటు అఖిల పక్ష భేటీ, ఎన్డీయే ఎంపీలకు వివరణ, అన్ని రాష్ట్రాల సీఎంలకు ప్రధాని ఫోన్, జాతినుద్దేశించి మోదీ ప్రసంగం, శాంతి భద్రతలకు చెందిన పలు అంశాలపై కార్యాచరణ ఇందులో ఉన్నది.



**ఎంతో** అద్భుతమైన రోజు. భారత్‌లో జమ్ముకశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం ప్రాణత్యాగం చేసిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వంటి వేలాది అమరులకు గౌరవం దక్కింది. ఏడు దశాబ్దాల భారతీయుల కల మన కళ్లెదుట వాస్తవరూపంగా దర్శనమిచ్చింది. మన జీవిత కాలంలో ఇది జరుగుతుందని ఎప్పుడైనా ఊహించామా?'

**– రామ్ మాధవ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి**



ఆర్టికల్ 370 రద్దుపై సోమవారం హైదరాబాద్‌లోని హైకోర్టు ఆవరణలో సంబురాలు చేసుకుంటున్న న్యాయవాదులు



ఆర్టికల్ 370 రద్దుతో మధ్యప్రదేశ్‌లో టపాసులు కాల్చి, మువ్వన్నెల జెండాతో సంబురాలు చేసుకుంటున యువకులు

ప్రజాస్వామ్యం హత్యకు గురైంది. జమ్ముకశ్మీర్ విభజన ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం. రాష్ట్రాలకు మరిన్ని అధికారాల కోసం దేశవ్యాప్తంగా గళమెత్తుతుంటే, ఓ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం ప్రధాని మోదీ అప్రజాస్వామిక విధానానికి నిదర్శనం.

**- స్టాలిన్, డీఎంకే అధ్యక్షుడు**



‘ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాన్ని మేము హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాం. జమ్ముకశ్మీర్‌తోపాటు దేశ ప్రయోజనాల దృష్ట్యా ఇది చాలా అవసరం’

**- మోహన్ భగవత్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్**






## ఆర్టికల్ 370 రద్దు గెజిట్




**జీఎస్ఆర్.551(ఈ):** రాష్ట్రపతి జారీ చేసిన ఈ ఉత్తర్వు సాధారణ సమాచారం కోసం ప్రచురించడమైనది.

రాజ్యాంగ (జమ్ముకశ్మీర్‌కు అనువర్తనం) ఆదేశం, 2019. సీ.ఓ.272

రాజ్యాంగంలోని ఆర్టికల్ 370లో పొందుపరిచిన అధికారాలను అనుసరించి రాష్ట్రపతి ఈ ఉత్తర్వు జారీ చేయడమైనది.

**1.**(1) ఈ ఆదేశాన్ని రాజ్యాంగ (జమ్ముకశ్మీర్‌కు అనువర్తనం) ఆదేశం-2019గా పిలువొచ్చు.

(2) పలుసార్లు సవరణలు జరిపిన రాజ్యాంగ (జమ్ముకశ్మీర్‌కు అనువర్తనం) ఆదేశం 1954 స్థానంలో ఇది వెంటనే అమలులోకి వస్తుంది.

**2.** జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి సంబంధించి రాజ్యాంగంలో పొందుపరిచి పలుమార్లు సవరించిన నిబంధనలు, మినహాయింపులు, మార్పులు చేర్పులు వంటివి ఈ విధంగా వర్తిస్తాయి:- 367 ఆర్టికల్‌కు ఈ నిబంధనలు అదనంగా చేరుతాయి. అవి:-

‘‘(4) జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి సంబంధించి రాజ్యాంగం యొక్క ప్రయోజనాల కోసం ఇది వర్తిస్తుంది.

(ఎ) ఈ రాజ్యాంగ సూచనలు లేదా నిబంధనలు పేర్కొన్న రాష్ట్రానికి సంబంధించి వర్తించే రాజ్యాంగ సూచనలు లేదా నిబంధనలకు పరిగణించబడుతుంది.

(బి) జమ్ముకశ్మీర్ యొక్క సర్దార్-రి-రియాసత్ ప్రకారం రాష్ట్ర శాసనసభ సిఫార్సుపై ప్రస్తుతం రాష్ట్రపతి గుర్తించిన వ్యక్తి సూచనలు, ప్రస్తుత రాష్ట్ర మంత్రిమండలి సలహామేరకు పని చేస్తున్న కార్యాలయం, జమ్ముకశ్మీర్ గవర్నర్‌కు సూచనలుగా పరిగణించబడుతుంది.

(సి) జమ్ముకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన సూచనలు, జమ్ముకశ్మీర్ గవర్నర్ తన మంత్రిమండలి సలహామేరకు పనిచేస్తున్నట్లుగా పరిగణించబడుతుంది.

(డి) రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 క్లాజ్(3) నిబంధన ప్రకారం క్లాజ్ (2)లో పేర్కొన్న ‘రాజ్యాంగ అసెంబ్లీ’ని ‘రాష్ట్ర శాసనసభ’గా చదువుకోవాలి.

**- రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్రపతి, న్యూఢిల్లీ**

# ఆంక్షల చట్రంలో కశ్మీరం!

- మాజీ సీఎంలు ముఫ్తీ, ఒమర్ అరెస్ట్
- మరో 8వేల అదనపు బలగాల మోహరింపు
- అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

**శ్రీనగర్, ఆగస్టు 5:**

స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జమ్ముకశ్మీర్‌లో సోమవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రముఖ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా రాష్ట్రానికి మరో 8వేల అదనపు బలగాలను మోహరించారు. మరోవైపు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర హోంశాఖ సూచించింది. జమ్ముకశ్మీర్ మాజీ సీఎంలు మెహబూబా ముఫ్తీని, ఒమర్ అబ్దుల్లాను అరెస్ట్ చేసినట్లు పోలీసు అధికారులు సోమవారం రాత్రి తెలిపారు. ముఫ్తీని ఆమె ఇంటి నుంచి శ్రీనగర్‌లోని ప్రభుత్వ అతిథి గృహానికి తరలించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ముఫ్తీ, ఒమర్‌లను గృహ నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. జమ్ముకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ నేతలు సజ్జాద్ లోన్, ఇమ్రాన్ అన్సారీలతోపాటు మరికొందరు నేతలనూ అరెస్ట్ చేశామని పోలీసులు చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణాన్ని రద్దుచేయడంతోపాటు రాష్ట్రాన్ని విభజిస్తూ కేంద్రం ప్రకటించిన కొన్ని గంటలలోపే ముఫ్తీ, ఒమర్ తదితరులను అరెస్ట్ చేయడం గమనార్హం. మరోవైపు, కశ్మీర్ లోయలో సోమవారం ఎటువంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోలేదని, పరిస్థితి అదుపులోనే ఉన్నదని అధికారులు తెలిపారు. లోయలో ప్రధాన పార్టీల నేతలతోపాటు ప్రజల కదలికలపై ఆంక్షలు విధించారు. శ్రీనగర్ జిల్లా పరిధిలో భారీస్థాయిలో ఆంక్షలు అమలులో ఉన్నాయని శ్రీనగర్ డిప్యూటీ కమిషనర్ షాహీద్ ఇక్బాల్ చౌదరి చెప్పారు. కిష్టావర్, రాజౌరీ జిల్లాలతోపాటు రాంబన్ జిల్లాలోని బనిహాల్ ప్రాంతంలో కర్ఫ్యూ విధించారు. జమ్ము, శ్రీనగర్ డివిజన్ల పరిధిలోని పలు జిల్లాల్లో ఆంక్షలు విధించారు. శ్రీనగర్ జిల్లా పరిధిలో ముందు జాగ్రత్త చర్యగా 144 సెక్షన్ విధించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే భద్రతా బలగాల వలయంలో ఉన్న జమ్ముకశ్మీర్‌కు మరిన్ని అదనపు బలగాలను సోమవారం కేంద్రం తరలించింది. ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, అసోంతో సహ దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి తరలించిన ఈ అదనపు బలగాలను అధికారులు కశ్మీర్ లోయలో మోహరించారు. భారత వాయుసేనకు చెందిన సీ-17 రవాణా విమానాల ద్వారా ఎనిమిది వేల అదనపు బలగాలను తరలించినట్టు.. ఇప్పటికే కశ్మీర్‌లో మోహరించిన 30వేల బలగాలకు ప్రస్తుత అదనపు బలగాలు తోడయినట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జమ్ముకశ్మీర్ వ్యాప్తంగా అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఇంకోవైపు, భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర హోంశాఖ కోరింది. శాంతిభద్రతలు, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే, మత విభేదాలు రెచ్చగొట్టి హింసను ప్రేరేపించే తప్పుడు వార్తలు, సందేశాలు, వదంతులు సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు వంటి మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించింది. అలాగే ఇతర రాష్ట్రాల్లో నివసించే జమ్ముకశ్మీర్ ప్రజలు, విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అందులో పేర్కొంది.



భద్రతా బలగాల పహారాలో శ్రీనగర్

### జమ్ములో ఆనందం.. కశ్మీర్‌లో ఆగ్రహం

జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంపై ఆ రాష్ట్ర ప్రజల నుంచి భిన్నమైన స్పందన లభిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని జమ్ము ప్రజలు స్వాగతిస్తుండగా.. కశ్మీర్ ప్రజలు తమ ఆగ్రహాన్ని, అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర సర్కారు నిర్ణయాన్ని జమ్ముకశ్మీర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది అభినవ్ శర్మ స్వాగతించారు. ‘ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం పార్లమెంటులో ఆమోదం పొందాలి. అయితే దేశం, రాష్ట్రాభివృద్ధికి నిస్సందేహంగా ఇది సానుకూల నిర్ణయమే’ అని అన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై జమ్ములో నివసిస్తున్న వాల్మీకి వర్గ ప్రజానీకం హర్షం వ్యక్తం చేసింది. ‘ప్రభుత్వ నిర్ణయంతో మేము మిఠాయిలు పంచుకున్నాం. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు ఉన్నప్పటికీ మేము పారిశుద్ధ్య పనులే చేసేవాళ్లం. తాజా నిర్ణయంతో గౌరవప్రదమైన జీవితంతో పాటు చదువుకుదగ్గ ఉద్యోగాలు లభిస్తాయి’ అని వాల్మీకి సామాజిక వర్గ నాయకుడు గారుబట్టీ తెలిపారు. పశ్చిమ పాక్ శరణార్థుల కమిటీ సభ్యులు కూడా 370వ అధికరణ రద్దును స్వాగతించారు. మరోవైపు, ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గులామ్ అహ్మద్ మీర్ విరుచుకుపడ్డారు. ‘జమ్ముకశ్మీర్ ప్రజల గొంతులు నులిమి, ప్రజల గళాన్ని అణిచివేశారు’ అని అన్నారు. జమ్మును రాష్ట్ర హోదా నుంచి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడంపై పాంథర్స్ పార్టీ చైర్మన్, మాజీ విద్యా శాఖ మంత్రి హర్షదేవ్ సింగ్ అసహనం వ్యక్తం చేశారు. ‘రాష్ట్రానికి గల ప్రత్యేక గుర్తింపును తొలగించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈ చర్యకు బీజేపీ సర్కారు పాల్పడింది’ అని న్యాయవాది షేక్ షకీల్ అన్నారు. 1947లో పాక్ మూకల దాడి తర్వాత 70 ఏండ్లకు ఇప్పుడు తమపై మళ్లీ దాడి జరిగిందని పీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఫిరదౌస్ తక్ అన్నారు.

## కశ్మీరీ పండిట్ల హర్షం

- ఇక హుందాగా, గౌరవంగా కశ్మీర్‌కెళ్లొచ్చు
- ఎంతోమంది మహా నేతల త్యాగాలకు ప్రతిబింబం కేంద్ర నిర్ణయం
- భారత్‌తో కశ్మీర్ అనుబంధం ఇక శాశ్వతమని వెల్లడి

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దుచేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కశ్మీరీ పండిట్లు స్వాగతించారు. తమ ప్రాంతంలో శాంతి నెలకొంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 1990వ దశకంలో కశ్మీర్ లోయ నుంచి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్లిన పండిట్లు.. తాము హుందాగా, గౌరవంగా తమ మాతృభూమికి తిరిగి వెళ్లేందుకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు. భారత్‌తో జమ్ముకశ్మీర్ ప్రాదేశిక, రాజకీయ, సాంస్కృతిక ఐక్యతను కేంద్రం నిర్ణయం పటిష్ఠం చేస్తుందని అంతర్జాతీయ కశ్మీరీ పండిట్ల సంఘం (జీకేపీడీ) తెలిపింది. ‘370 అధికరణను రద్దుచేస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టిన బిల్లు.. భారత్ సార్వభౌమత్వం, సమగ్రత కోసం ప్రాణ త్యాగం/ జీవితాన్ని అంకితంచేసిన శ్యామప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపేయి వంటి మా గొప్ప నేతల ఆలోచనలకు ప్రతిరూపం’ అని వివరించింది. జమ్ముకశ్మీర్ విచార్‌మంచ్ అధ్యక్షుడు మనోజ్ భాన్ స్పందిస్తూ ‘370వ అధికరణాన్ని రద్దు చేయడం ద్వారా కేంద్రం.. మిగతా భారతదేశానికి జమ్ముకశ్మీర్‌ను మరింత చేరువయ్యేలా చేసింది’ అని చెప్పారు. తాము తిరిగి లోయలోకి వెళ్లేందుకు మోదీ సర్కార్ కార్యాచరణ రూపొందిస్తుందని కశ్మీరీ పండిట్లు ఆశాభావంతో ఉన్నారన్నారు. బలవంతపు వలసలకు గురైన తాము కలిసి జీవించేందుకు పరిష్కారం కనుగొనాలని కేంద్రాన్ని కోరారు.

**స్వర్గంలాంటి కశ్మీర్‌లో నరకం చూశాం**

కేంద్రం తీసుకొన్న నిర్ణయంతో మాకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని, మా సొంతూరుకు వెళ్లే అవకాశం కలుగుతుందని హైదరాబాద్‌లో కశ్మీర్ పండిట్‌ల సంఘం అధ్యక్షుడు భరత్‌భూషణ్ హర్షం వ్యక్తంచేశారు. అనేక ఏండ్లుగా కొనసాగిన దాష్టీకం వల్ల తాము స్వర్గంలాంటి కశ్మీర్‌లో నరకాన్ని అనుభవించాల్సి వచ్చిందని చెప్పారు. కశ్మీర్ విభజన, 370 అధికరణం రద్దు వల్ల తాము తిరిగి స్వస్థలాలకు వెళ్లి ప్రశాంతజీవనం కొనసాగించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు.



లక్నోలో ఆనందంతో స్వీట్లు పంచుకుంటున్న కశ్మీరీ పండిట్లు

### కేంద్రం నిర్ణయం దీపావళి వంటిది

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి

శ్యామాప్రసాద్ కన్న కలలు నెరవేరాయి: బండి సంజయ్





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్రం నిర్ణయం ప్రతి భారతీయుడికి దీపావళి వంటిదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎప్పటినుంచో కలలు కన్నటువంటి ఒకే దేశం, ఒకే జెండా, ఒకే విధానం సోమవారం నుంచి అమలులోకి రానుండటం హర్షణీయమన్నారు. బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రక నిర్ణయం తీసుకొన్న ప్రభుత్వానికి, మద్దతిచ్చిన పార్టీలకు, ప్రజాప్రతినిధులకు, అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ శ్యామాప్రసాద్‌ముఖర్జీ కలలు కన్న ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం నెరవేరాయని బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో అమిత్‌షా.. ఆర్టికల్ 370ని రద్దుచేసి చరిత్రాత్మక నిర్ణయం తీసుకొన్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు కొనియాడారు. ఇది ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం విజయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ ప్రశంసించారు. 370 ఆర్టికల్‌ను రద్దుచేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకొన్న ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.

### చారిత్రక మార్పులు వస్తాయి: మాజీ ఎంపీ కవిత



కశ్మీర్ పునర్విభజన, ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం వల్ల చారిత్రక, కీలకమైన మార్పులు వస్తాయని మాజీ ఎంపీ, టీఆర్‌ఎస్ నేత కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లో త్వరలోనే పూర్తి శాంతి నెలకొంటుందని, ప్రజలు సామరస్యపూర్వక వాతావరణంలో జీవనం కొనసాగిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.

### సాహసోపేత నిర్ణయం: విజయసాయిరెడ్డి



ఒకే దేశం, ఒకే జాతి, ఒకే చట్టం అన్నది తమ పార్టీ అభిమతమని, అందుకు అనుగుణంగా ఉన్న కశ్మీర్ పునర్విభజన బిల్లుకు పూర్తి మద్దతు పలుకుతున్నట్టు రాజ్యసభలో వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ పక్షనేత విజయసాయిరెడ్డి స్పష్టంచేశారు. జాతి సమగ్రతను కాపాడేదిశలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా సాహసోపేత నిర్ణయం తీసుకొన్నారని కితాబిచ్చారు. కాంగ్రెస్ ద్వంద్వవైఖరి కారణంగానే కశ్మీర్ ఇంతకాలం కల్లోలంగా ఉన్నదని విమర్శించారు.

### దేశ సమగ్రతకు దోహదం: స్వరూపానందేంద్ర సరస్వతి



ఆర్టికల్ 370 రద్దు చారిత్రక నిర్ణయమని, దీన్ని సాధ్యంచేసిన ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా అభినందనీయులని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందసరస్వతి వ్యాఖ్యానించారు. దేశ సమగ్రత, జాతి ఐక్యతలో భాగంగా తీసుకొన్న నిర్ణయమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అభివర్ణించారు. ఈ నిర్ణయంతో కశ్మీర్‌లోని సరస్వతి శక్తిపీఠం పునరుద్ధరణకు వీలవుతుందని, భారత సర్కారు పునరుద్ధరణకు పూనుకొంటే శారదా పీఠం సహకరిస్తుందని చెప్పారు.

### బిల్లు రద్దును స్వాగతించిన టీడీపీ

జమ్ముకశ్మీర్ పునర్విభజన, 370 ఆర్టికల్ రద్దుకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును టీడీపీ సమర్థించింది. కశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఆహ్వానించదగిన పరిణామమని టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. బిల్లును సమర్థిస్తూ టీడీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు ట్వీట్ చేశారు.

## ఆనందడోలికల్లో లడఖ్

- కశ్మీర్ వివక్షకు చెల్లుచీటి
- మోదీ చారిత్రక నిర్ణయం శ్లాఘనీయం
- కేంద్రం నిర్ణయాలపై లడఖ్‌వాసుల హర్షాతిరేకం

**జమ్ము/ న్యూఢిల్లీ, ఆగస్టు 5:** జమ్ముకశ్మీర్‌కు 370వ అధికరణం రద్దుతోపాటు జమ్ముకశ్మీర్, లడఖ్‌లను కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని లడఖ్ వాసులు స్వాగతించారు. లడఖ్ బౌద్ధ సంఘం అధ్యక్షుడు పీటీ కుంజాంగ్ స్పందిస్తూ.. ‘కేంద్రం నిర్ణయంతో సుదీర్ఘ కాలంగా మేం కన్న కల నిజమైంది. జమ్ముకశ్మీర్ నుంచి విడదీసి లడఖ్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా కల్పించాలని 1949 నుంచి మేం పోరాడుతున్నాం. మా డిమాండ్ల సాధనకు 70 ఏండ్లకు పైగా పలు పోరాటాల్లో పాల్గొన్నాం’ అని తెలిపారు. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని కుంజాంగ్ స్వాగతించారు. ‘లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చిన ఘనత బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వానిదే. 70 ఏండ్లుగా అధికారంలోకి వచ్చిన పలు ప్రభుత్వాలు హామీలు మాత్రమే ఇచ్చాయి. ఈ అంశంపై మతపరమైన రాజకీయాలు చేశారు. కానీ మాకు శుష్క హస్తమే మిగిలింది. ఈనాడు ప్రధాని మోదీ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. మోదీ నిర్ణయం శ్లాఘనీయం. సాహసోపేత నిర్ణయం తీసుకున్నందుకు బీజేపీ ప్రభుత్వానికి మేం ధన్యవాదాలు తెలుపుతున్నాం’ అని కుంజాంగ్ తెలిపారు. లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎల్‌ఏహెచ్‌డీసీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ గ్యాల్ పీ వాంగ్యాల్ స్పందిస్తూ కేంద్ర పాలిత ప్రాంత హోదా లడఖ్ వాసులకు ఒక బహుమతి వంటిదన్నారు. ‘లడఖ్ చరిత్రలో ఈరోజు సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సుదినం. భవిష్యత్ తరాల కోసం కేంద్ర పాలిత ప్రాంతంగా లడఖ్‌ను ప్రకటించాలని పోరాడిన మా పూర్వీకులు, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా నుంచి వచ్చిన బహుమతి కేంద్ర పాలిత ప్రాంతం. మా సంతోషం మాటల్లో చెప్పలేం. కశ్మీర్ నుంచి స్వేచ్ఛ కల్పించాలని డిమాండ్ చేస్తూ మేం పోరాడుతున్నాం’ అని చెప్పారు. టేగార్ కౌన్సిలర్ రిగ్జిన్ లండప్ స్పందిస్తూ.. ‘కేంద్రం నుంచి వచ్చే నిధులన్నీ కశ్మీర్‌కే ఖర్చు చేశారు. ఈ ప్రాంతంలో 70 శాతం విస్తీర్ణంలో లడఖ్ ఉన్నా.. నిధుల్లో సింహభాగం కశ్మీర్‌కే తరలిపోయేవి. 2014లో మోదీ సర్కార్ వచ్చిన తర్వాత జమ్ముకశ్మీర్ అభివృద్ధికి రూ.80 వేల కోట్లు విడుదల చేస్తే లడఖ్‌కు వచ్చిన నిధులు చాలా స్వల్పం. జమ్ముకశ్మీర్‌లో జమ్ము, కశ్మీర్, లడఖ్ వేర్వేరు ప్రాంతాలు. కానీ గత 70 ఏండ్లలో కశ్మీర్ మాత్రమే ఆధిపత్యం ప్రదర్శించింది’ అని చెప్పారు. కొర్జోక్ కౌన్సిలర్ గుర్మెత్ దొర్జాయి స్పందిస్తూ.. గత 70 ఏండ్లు ప్రభుత్వ ఖజానాను మూడు, నాలుగు కుటుంబాలు దోపిడీ చేశాయి. ఇప్పుడు కశ్మీర్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధి నుంచి విముక్తి పొందామని తెలిపారు.

**సరిహద్దు భద్రత బలోపేతం: లడక్ ఎంపీ**

ఇప్పటివరకు జమ్ముకశ్మీర్‌లో ఆధిపత్యం వహించిన రెండు కుటుంబాల (ఫరూఖ్ అబ్దుల్లా, ముఫ్తీ) నుంచి విముక్తి లభించిందని లడఖ్ ఎంపీ ట్సెరింగ్ నామ్‌గ్యాల్ చెప్పారు. 370వ అధికరణం రద్దు, జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాల ఏర్పాటుతో యావత్ కశ్మీర్ అభివృద్ధితోపాటు సరిహద్దు భద్రత పటిష్ఠానికి వీలవుతుందని మీడియాతో అన్నారు.

## సంబంధాలు క్షీణిస్తాయి!

- 370 అధికరణ రద్దుపై పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ధ్వజం
- ఐక్యరాజ్యసమితి, మిత్ర దేశాలు స్పందించాల్సిందిగా పాక్ విజ్ఞప్తి



**ఇస్లామాబాద్, ఆగస్టు 5:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణను రద్దు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం పాకిస్థాన్ ఖండించింది. జమ్ముకశ్మీర్ విషయంలో భారత్ నిర్ణయాన్ని తిరస్కరిస్తున్నట్టు పేర్కొంది. భారత్ తీసుకున్న ఈ నిర్ణయంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణిస్తాయని ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. కశ్మీర్ అంశంపై భారత్ తాజాగా తీసుకున్న నిర్ణయంపై మలేషియా ప్రధాని మహతీర్ మహమ్మద్‌తో ఇమ్రాన్ చర్చించినట్టు పాక్ విదేశాంగ శాఖ పేర్కొన్నది. ‘కశ్మీర్ హోదాను మార్చడం చట్టవిరుద్ధం. ఐక్యరాజ్యసమితి తీర్మానానికి ఇది విరుద్ధం. భారత్ చర్యలు ఇరు దేశాల(భారత్-పాక్) మధ్య ఉన్న సంబంధాలను మరింత క్షీణింపజేస్తాయి’ అని మలేషియా ప్రధానితో ఇమ్రాన్ పేర్కొన్నారు. తాము కూడా కశ్మీర్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్టు ఈ సందర్భంగా మహతీర్ మహమ్మద్ అన్నట్టు పాక్ విదేశాంగ శాఖ వెల్లడించింది. కశ్మీర్ అంశంపై భారత్ తీసుకున్న నిర్ణయంపై మంగళవారం పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించనున్నట్టు పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వి పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ అంశంలో భారత్ నిర్ణయాన్ని పాక్ విదేశాంగ మంత్రి షా మహమ్మద్ ఖురేషి ఆక్షేపించారు. ‘ఆర్టికల్ 370ని రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధం. ఈ నిర్ణయంతో భారత్ కశ్మీరీ ప్రజల అభిప్రాయాన్ని మార్చలేదు’ అని ఖురేషి అన్నారు. కశ్మీర్ ప్రజలకు పాక్ అండగా ఉంటుందన్నారు. భారత్ ఏకపక్ష నిర్ణయంపై స్పందించాల్సిందిగా ఐక్యరాజ్యసమితి, పాక్ మిత్ర దేశాలు, మానవ హక్కుల సంఘాలను కోరుతామని ఆయన వెల్లడించారు.

### కశ్మీర్‌లోనూ భారత రాజ్యాంగం

మొదటిపేజీ తరువాయి...

తరహాలో శాంతి భద్రతల అధికారాలను పునర్‌వ్యవస్థీకరించనున్నారు. ఢిల్లీలో శాంతి భద్రతలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండగా, పుదుచ్చేరిలో రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయి.

**4. కేంద్ర చట్టాలు**

ఇప్పటివరకూ, చట్టాల రూపకల్పన, అమలుకు కేంద్ర ప్రభుత్వం జమ్ము కశ్మీర్ అసెంబ్లీ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇకపై కేంద్ర చట్టాలు ఆటోమేటిక్‌గా ఆ రాష్ట్రంలోనూ అమలవుతాయి.

**5. ప్రత్యేక జెండా**

జాతీయ జెండాతో పాటు సొంత జెండాను కలిగి ఉండడానికి జమ్ము కశ్మీర్‌కు ఆర్టికల్ 370 అవకాశం కల్పించింది. ఇకపై దేశవ్యాప్తంగా త్రివర్ణ పతాకం ఒక్కటే ఉండనుంది.

**6. ప్రత్యేక అధికారాలు**

రక్షణ, విదేశాంగ, సమాచార వ్యవహారాలు మినహా మిగిలిన అన్ని అంశాల్లో స్వయం నిర్ణయాలు తీసుకునేందుకు జమ్ముకశ్మీర్‌కు ఇంతకుముందు ప్రత్యేక అధికారాలు ఉండేవి. ఇకపై ఆ అధికారాలు రద్దు కానున్నాయి.

**7.ద్విపౌరసత్వం**

ఇప్పటివరకు జమ్ము కశ్మీర్ ప్రజలకు ద్విపౌరసత్వం ఉండేది. ఇకపై ఏకపౌరసత్వం మాత్రమే ఉంటుంది.

**8. ఆర్థికపరమైన అత్యవసర పరిస్థితి**

ఆర్టికల్ 360 ప్రకారం ఇకపై జమ్ము కశ్మీర్‌లోనూ కేంద్రం ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించేందుకు వీలుంటుంది. ఇంతకుముందు, ‘యుద్ధం, దురాక్రమణ’ పరిస్థితుల్లో మాత్రమే విధించేందుకు వీలుండేది.

**9. అసెంబ్లీ గడువు**

ఇప్పటివరకు జమ్ము కశ్మీర్ అసెంబ్లీ గడువు ఆరేండ్లు కాగా, ఇకపై అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఐదేండ్లు ఉండనుంది.

**10. ఆర్టీఐ**

ఇంతకుముందు జమ్ము కశ్మీర్‌కు సమాచార హక్కు చట్టం వర్తించేది కాదు. ఇకపై కొత్తగా ఏర్పాటు కాబోయే రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఈ చట్టం వర్తిస్తుంది.

**11. మైనార్టీలకు రిజర్వేషన్లు**

ఇంతకుముందు జమ్ము కశ్మీర్‌లో మైనార్టీలకు రిజర్వేషన్లు ఉండేవి కావు. ఇకపై వారికీ రిజర్వేషన్లు వర్తిస్తాయి.

## అతిపెద్ద కేంద్రపాలిత ప్రాంతంగా..

జమ్ము కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా (జమ్ము కశ్మీర్, లడఖ్) విభజించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో కొత్తగా ఏర్పడబోయే జమ్ముకశ్మీర్ విస్తీర్ణ పరంగా దేశంలోనే అతిపెద్ద కేంద్ర పాలిత ప్రాంతంగా (యూటీగా) నిలువనుంది. లడఖ్ ఆ తర్వాతి స్థానంలో ఉండనుంది. జమ్ముకశ్మీర్, లడఖ్‌లను కలిపితే దేశంలో కేంద్రపాలిత ప్రాంతాల సంఖ్య తొమ్మిదికి చేరనుంది. ఇప్పటికే ఢిల్లీ, పుదుచ్చేరి, డయ్యూ అండ్ డామన్, దాద్రా నగర్ హవేలీ, ఛండీగఢ్, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు కేంద్ర పాలితప్రాంతాలుగా ఉన్నాయి. వీటిల్లో ఢిల్లీ, పుదుచ్చేరి మాత్రమే అసెంబ్లీలను కలిగి ఉన్నాయి. జమ్ముకశ్మీర్ చేరికతో ఇప్పుడు ఆ సంఖ్య మూడుకు పెరుగనుంది. అత్యధికంగా ఢిల్లీ నుంచి ఏడుగురు పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. జమ్ము కశ్మీర్ యూటీగా మారడంతో రాష్ట్రాల సంఖ్య 28కి తగ్గింది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలుగా ఉన్నాయి.

## పునర్విభజన తర్వాత మరో ఏడు సీట్లు

కొత్తగా ఏర్పడబోయే జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీలో 107 సీట్లు ఉండనున్నాయి. అయితే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మరో ఏడు సీట్లు పెంచనున్నట్లు బిల్లులో పేర్కొన్నారు. ప్రస్తుతం జమ్ము కశ్మీర్ అసెంబ్లీ స్థానాల సంఖ్య 111. 24 అసెంబ్లీ స్థానాలను పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు కేటాయించిన నేపథ్యంలో వాటిని ఖాళీలుగానే పరిగణిస్తారు. దీంతో ఆ స్థానాలను తీసేస్తే వాస్తవానికి 87 స్థానాలే ఉంటాయి. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ మొత్తం సభ్యుల సంఖ్యలో 10 శాతానికి మించకుండా మంత్రి వర్గం ఉండొచ్చని బిల్లులో పేర్కొన్నారు. అసెంబ్లీ స్థానాలకు రాజ్యాంగ నిబంధనలను అనుసరించి ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించనున్నట్లు బిల్లులో పేర్కొన్నారు.అసెంబ్లీలో మహిళలకు తగినంత ప్రాతినిధ్యం లేదని లెఫ్టినెంట్ గవర్నర్ భావించినట్లయితే ఇద్దరు మహిళలను ఆయన నామినేట్ చేయొచ్చని వివరించారు. మరోవైపు జమ్ము కశ్మీర్ యూటీకి ఐదు, లడఖ్‌కు ఒక పార్లమెంట్ స్థానాన్ని కేటాయించారు.



భారత్‌కు అభినందనలు. ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్న నేను కశ్మీర్ గురించి నా జీవితంలో శుభ వార్త విన్నాను.

**- అనుపమ్‌ఖేర్, సీనియర్ నటుడు**



నా మాతృభూమికి నిజమైన, సంపూర్ణ స్వాతంత్ర్యం ఈ రోజే లభించింది. భారత దేశం ఒక్కటే అన్న పదానికి ఈనాడు నిజమైన అర్థం లభించింది! జై హింద్!.

**- పరేశ్ రావల్, మాజీ ఎంపీ**



ఆర్టికల్ 370 రద్దు ప్రజాస్వామ్యంపై దాడి లాంటిది. ఇది నిరంకుశ, తీవ్రమైన తిరోగమన చర్య. ఆర్టికల్ 370, 35కు ప్రత్యేక గుర్తింపు, పుట్టుక ఉన్నాయి. వీటిపై నిర్ణయం తీసుకునే ముందు సంప్రదింపులు జరుపాల్సింది.

**- మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్**

జమ్ముకశ్మీర్ ప్రజలు సుస్థిర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నాను.

**-దియా మీర్జా, బాలీవుడ్ కథా నాయిక**



ఆర్టికల్ 370, 35ఏ లను రద్దుచేయటం ద్వారా 65 ఏండ్ల కింద జరిగిన తప్పును ఇప్పుడు సరి చేయటం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు అభినందనలు. దీంతో కశ్మీర్ ప్రజలకు స్వేచ్ఛ, గుర్తింపు లభిస్తుంది.

**వసుంధర రాజే, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత**

భారత ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజు. జమ్మూకశ్మీర్ ప్రజలు, నాయకత్వం ద్విజాతి సిద్ధాంతాన్ని తిరస్కరించి 1947లో భారత్‌తో ఉన్నారు. కేంద్రం ఏకపక్ష నిర్ణయంతో ఆర్టికల్ 370ని వెనక్కితీసుకోవటం చట్ట వ్యతిరేకం. ఆక్రమణ తీరుగా బలగాలను దింపటం రాజ్యాంగ విరుద్ధం.

**మెహబూబా ముఫ్తీ, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి**



**చరిత్రలో నేడు**



1945

జపాన్‌లోని హిరోషిమాపై అణుబాంబు వేసిన అమెరికా.

1965



కశ్మీర్ ప్రాంతంలో 'లైన్ ఆఫ్ కంట్రోల్' దాటి భారత్ భూభాగంలోకి చొచ్చుకొచ్చిన పాకిస్థాన్ సేనలు.




1966

వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా అమెరికాలో ప్రదర్శనలు.

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే నిర్ణయం మేలైనది, మంచిది. న్యాయమూర్తుల సంఖ్య తక్కువ ఉండటం మూలం గా ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయి. ఇప్పటికే 59,331 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలన్న కోరికను కేంద్ర ఆమోదించింది. న్యాయమూర్తుల సంఖ్యను 31 నుంచి 34కు పెంచింది. పని భారం తగ్గించటం కోసం గతంలో 2009లో 26 నుంచి 31కి పెంచారు. ఈ నేపథ్యంలో కేంద్రం నిర్ణయం ఆహ్వానించదగినది.

**ది హిందూ**

ఆహారపదార్థాల ఉత్పత్తి విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కోళ్ల పరిశ్రమలో యాంటి బయోటిక్ మందు కోలిస్టిన్‌ను వినియోగించటాన్ని నిషేధించింది. కోళ్ల ఎదుగుదలకు గాను దీన్ని వినియోగించటం మూలంగా అనేక అనర్థాలున్నాయి. బ్యాక్టీరియాను ఎదుర్కోవటం కోసం చివరి అస్త్రంగా వినియోగించేదాన్ని కోళ్ల పెరుగుదలకు వినియోగించటం మూలంగా కోడి మాంసాన్ని తిన్న వారిలో రోగనిరోధక శక్తి గణనీయంగా తగ్గిపోతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవటం ముదావహం.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# కశ్మీర్‌పై కఠినవిధానం

రెండవసారి కూడా భారీ మెజారిటీతో అధికారానికి వచ్చిన బీజేపీ తాము కోరుకుంటున్న రీతిలో రాజ్యాంగంలోని జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న 370 అధికరణాన్ని రద్దుచేసింది. భారత రాజ్యాంగం జమ్మూకశ్మీర్‌కు వర్తించేవిధంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వు జారీచేయడంతో ఈ అధికరణం రద్దయింది. రాష్ట్రాన్ని విభజించి జమ్మూకశ్మీర్‌ను, లడాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చే బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం- జమ్మూకశ్మీర్‌కు శాసనసభ ఉంటుంది కానీ, స్వభావరీత్యా కేంద్ర పాలిత ప్రాంతమైనందువల్ల పరిమిత అధికారాలు మాత్రమే ఉంటాయి. బీజేపీ ఈ బిల్లును రాజ్యసభలో ఆమోదించుకున్న నేపథ్యంలో తమకు మెజారిటీ ఉన్న లోక్‌సభలో నెగ్గుకురావడం కష్టమేమీ కాదు. బీజేపీ ఎంతోకాలంగా కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణాన్ని రద్దుచేయాలనే వాదనను వినిపిస్తున్నది. కానీ జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని విభజించడంతో పాటు రాష్ట్ర హోదాను కూడా రద్దుచేయ నిర్ణయించడం అనూహ్య పరిణామం.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి ఐదువందలకు పైగా సంస్థానాలున్నాయి. ప్రపంచయుద్ధాల మూలంగా రూపుదిద్దుకున్న ప్రజాస్వామిక భావజాలం, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు బలపడి ఉన్న నేపథ్యంలో చిన్నదేశాలను విలీ నం చేసుకోవడానికి కూడా భారత్ ఆచితూచి వ్యవహరించవలసి వచ్చింది. దేశం అనేక సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యల తో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నది. అయినా ఎంతో చతురతతో హైదరాబాద్ స్టేట్‌తో పాటు వందలాది సంస్థానాలను భారత్‌లో విలీనం చేయించడంలో నెహ్రూ ప్రభుత్వం సఫలమైంది. జమ్మూకశ్మీర్‌ను ఆక్రమించుకోవాలని పాకిస్థాన్ సైన్యాలు చొచ్చుకురావడంతో భారత్ కూడా రంగంలోకి దిగింది. జమ్మూకశ్మీర్ పాలకుడు రాజా హరిసింగ్‌తో విలీన ఒప్పందం మీద సంతకం చేయించుకోగలిగింది. కానీ ప్రత్యేక పరిస్థితుల్లో కొన్ని నిబంధనలు తప్పలే దు. 370 అధికరణం ఆ విధంగా వచ్చిందే. షేక్ అబ్దుల్లాతో ఒప్పందంతో పాటు పలు సందర్భాల్లో చర్చలు అంగీకారాలు కూడా జరిగాయి. అయితే ఈ మధ్య కాలంలో రెండు ముఖ్యమైన పరిణామాలు సంభవించాయి. ఒకటి జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి ఆచరణలో బలహీనపడుతూవచ్చింది. జమ్మూకశ్మీర్‌లోని రాజకీయ నాయకత్వం భారత రాజకీయ వ్యవస్థతో కలిసిపోయింది. కశ్మీర్ సమాజం కూడా గతంతో పోలిస్తే భారత ప్రజాస్వామిక వ్యవస్థకు అలవాటు పడినప్పటికీ, అడపాదడపా సంక్షోభాలు వచ్చి రాజకీయ ప్రక్రియ దెబ్బతిన్నది. ఇందుకు కేంద్రంలోని నాయకులు చేసిన తప్పిదాలు కూడా కొంత కారణం. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అనేక సందర్భాల్లో కశ్మీర్‌లో ప్రశాంతతను నెలకొల్పి మళ్ళా రాజకీయ ప్రక్రియ సాగేలా చేయడంలో విజయవంతమైంది. కానీ ఒక దశలో కశ్మీర్ ప్రాతినిధ్య శక్తులు దెబ్బతినడంతో, పాకిస్థాన్ ప్రేరేపిత వేర్పాటువాదశక్తుల ప్రాబల్యం పెరిగిపోయింది. కశ్మీర్‌ను భారత ప్రధాన స్రవంతిలో భాగం చేసుకోవడం కేంద్ర నాయకుల పాలనాదక్షతకు సవాలుగానే మిగిలింది.

**జమ్మూకశ్మీర్ విషయంలో మోదీ ప్రభుత్వ కఠినవైఖరిని బీజేపీ నాయకులు చరిత్రాత్మకమైనదిగా, సాహసోపేతమైనదిగా అభివర్ణిస్తున్నారు. అయితే దీనిపై విమర్శలు కూడా ఉన్నాయి. భిన్న రాజకీయపక్షాలతో సంప్రదింపులు జరుపకుండా ఏకపక్షంగా వ్యవహరించిందనేది ఒక విమర్శ. రాష్ట్రంలో బలగాలను భారీగా మోహరించి, రాష్ట్రంలోని రాజకీయపక్షాల నాయకులను గృహ నిర్బంధంలో పెట్టి కీలక నిర్ణయాలను అమలుచేయడం వల్ల అంతర్జాతీయ సమాజానికి ఎటువంటి సంకేతాలు పోతాయనేది కూడా గమనార్హమే.**

జమ్మూకశ్మీర్ విషయంలో మోదీ ప్రభుత్వ కఠినవైఖరిని బీజేపీ నాయకులు చరిత్రాత్మకమైనదిగా, సాహసోపేతమైనదిగా అభివర్ణిస్తున్నారు. అయితే దీనిపై విమర్శలు కూడా ఉన్నాయి. భిన్న రాజకీయపక్షాలతో సంప్రదింపులు జరుపకుండా ఏకపక్షంగా వ్యవహరించిందనేది ఒక విమర్శ. రాష్ట్రంలో బలగాలను భారీగా మోహరించి, రాష్ట్రంలోని రాజకీయ పక్షాల నాయకులను గృహ నిర్బంధంలో పెట్టి కీలక నిర్ణయాలను అమలుచేయడం వల్ల అంతర్జాతీయ సమాజానికి ఎటువంటి సంకేతాలు పోతాయనేది కూడా గమనార్హమే. వాజపేయి ప్రభుత్వంతో సహా ఇప్పటివరకు ఎవరు అధికారంలో ఉన్నా సాంత్వన ద్వారానే ప్రశాంత పరిస్థితులను నెలకొల్పారు. ఇప్పుడు మోదీ- అమిత్ షా కఠిన విధానం చేపట్టగానే సరిపోదు. తద్వారా జమ్మూకశ్మీర్ సమస్యను పరిష్కరించి చూపాలె. పక్కనే పాకిస్థాన్ వేర్పాటువాదులను ఉసిగొలుపుతూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో తలదూర్చిన అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తానంటున్నది. కశ్మీర్ ప్రజల మెప్పు పొందడం ద్వారానే విదేశీ శక్తులను దూరంగా పెట్టగలం. ప్రపంచంలో రగులుతున్న అంతర్జాతీయ సమస్యలలో కశ్మీర్ ఒకటిగా మారకూడదు. పేదరికం, ఉగ్రవాదం వంటి అనేక సమస్యలకు ప్రత్యేక ప్రతిపత్తి కారణమని అమిత్ షా రాజ్యసభలో అన్నారు. కశ్మీర్ భారత దేశానికి మకుటంలోని మణి వంటిదని, ఐదేండ్లలో మొత్తం పరివర్తన తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అక్కడి పిల్లలను హత్తుకోవాలనుకుంటున్నామనీ, విద్యను, పరిశ్రమలు, పర్యాటకాన్ని వృద్ధిచేయడం ద్వారా ఉపాధిని కల్పించదలుచుకున్నామనీ అమిత్ వివరించారు. సాధారణ పరిస్థితులు నెలకొనగానే తగు సమయంలో రాష్ట్ర హోదా కల్పిస్తామని కూడా అన్నారు. దశాబ్దాలుగా సంక్షోభంలో మగ్గిపోతున్న కశ్మీర్ సమాజం ప్రశాంత పరిస్థితులను పొందాలనేదే అందరూ కోరుకుంటున్నది.

కాళేశ్వరం



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

# కరంటు ఖర్చుపై వాస్తవాలు

ఈఆర్‌సీ విద్యుత్ ఛార్జీలను నిర్ధారించేటప్పుడు విద్యుదుత్పత్తి ఖర్చులు, విద్యుత్ కొనుగోలు ఖర్చులు, విద్యుత్ ప్రసార ఖర్చులు, డిస్కంల విద్యుత్ పంపిణీ ఖర్చులు, ప్రభుత్వాలు వివిధ వర్గాలకు ఇచ్చే సబ్సిడీలు.. మొదలైనవాటిని పరిగణనలోనికి తీసుకుంటాయి. తెలంగాణ ఈఆర్‌సీ కూడా ఇవే ప్రమాణా లతో వివిధ క్యాటగిరీలకు విద్యుత్ ఛార్జీలను నిర్ధారించింది.

కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోయడం మొదలై ప్రాణహిత నీరు గోదావరిలో ఇప్పటికే 115 కి.మీ. ఎదురెక్కి ఎల్లంపల్లి డ్యాంను ముద్దాడింది. ఒక్కొక్క మైలురాయి దాటుతుంటే ప్రజల ఆనందానికి హద్దులు లేవు. వానలు లేనికాలంలో గోదావరి ఇట్లా ఎదురెక్కిరావడం కొత్త అనుభవం. ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకం రీ ఇంజినీరింగ్‌లో మేడిగడ్డ-ఎల్లంపల్లి లింక్ ఎంత కీలకమైనదో, ఎంతటి ప్రయోజనాన్ని చేకూర్చేదో ప్రజల అనుభవంలోకి వచ్చింది. అయితే ఈ విజయాన్ని జీర్ణించుకోలేని దుష్టశక్తులు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ పంప్‌లు పనిచేయడం ప్రారంభించిన నెల లోపునే తమ అజీర్తిని వాంతి చేసుకోవడం మొదలుపెట్టాయి. 'కాళేశ్వరం మొదటి బిల్లుతో ప్రభుత్వానికి షాక్' అంటూ అసత్యవార్తలను వండి వారుస్తున్నారు. తమ కల్పనాచాతుర్యంతో కరంటు బిల్లులతో కాళేశ్వరం భవిష్యత్‌లో తెలంగాణ ప్రజలకు భారం కాబోతున్నదంటూ వార్తలు సోషల్ మీడియాలోకి వదులుతున్నారు. ప్రజలేమో తమ దగ్గరికే వస్తున్న గోదావరి తల్లిని హత్తుకోవడానికి సన్నాహాల్లో మునిగి ఉన్నారు. జల జాతరలు, జల భోజనాలు నిర్వహిస్తున్నారు. అటూ ఇటూ కాని మేధావివర్గం.. ఈ విశ్లేషణలను నమ్మాలో లేదో తేల్చుకోలేక పోతున్నారు.

ప్రాజెక్టులపై విమర్శకులు గతంలో కూడా ఇటువంటి విమర్శలు చేసి భంగపడినారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ఆయకట్టులో రైతుల వ్యవసాయం బహుశా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వ్యవసాయమని, ఈ ప్రాజెక్టులో కరంటు ఖర్చే ఎకరానికి లక్ష రూపాయల వరకు ఉంటుందని, ఇవి ఎత్తిపోతలు కావు తిప్పిపోతలని విమర్శించారు. ఈ విమర్శలన్నింటికీ గతంలోనే సమాధానాలు ఇచ్చి ఉన్నాం. అయినా కువిమర్శలు చేస్తుండటంతో మళ్ళీ ఒకసారి పునశ్చరణ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సీడబ్ల్యూసీ 80,190 కోట్లుగా నిర్ధారించింది. ఈ అంచనా వ్యయంతో ఎకరానికి అయ్యే వ్యయం: 80190/(18.25+4.70 స్థిరీకరణ ఆయకట్టులో 25%)= 3,49,412 రూపాయలు. ఇది ఒకసారి చేసే క్యాపిటల్ కాస్ట్. బరాజ్‌లు, పంప్‌హౌజ్‌లు,కాలువలు మొదలైనవాటి నిర్మాణానికి అయ్యే ఖర్చు ఇది. ఇక గతంలో ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టులో కూడా ఎల్లంపల్లి నుంచి లిఫ్టులు నేటి కాళేశ్వరం ప్రాజెక్టులో లాగానే ఉన్నాయి. నేడు తేడా కొత్తగా ప్రతిపాదించి కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల వద్ద ఎల్లంపల్లికి ఎత్తిపోతలకు అయ్యే ఖర్చు మాత్రమే అదనంగా అవసరం అవుతుంది. దాంట్లో, ఇంతకుముందు తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో లిఫ్ట్ చేయాల్సిన ఎత్తు 40 మీ. ఇప్పుడు ఉండదు. అయితే అదనంగా నేడు కొత్తగా కట్టిన మూడు బ్యారేజీల నుంచి చేయాల్సిన లిఫ్ట్ ఎత్తు 58 మీ., అంటే అప్పటికి ఇప్పటికి తేడా కేవలం 18 మీ. మాత్రమే. కానీ దాదాపు నీటి లభ్యత 200 టీఎంసీలు పెరిగింది. 38 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యం కొత్తగా ఏర్పడింది. గోదావరి నది దాదాపు 150 కిలోమీటర్లు సజీవంగా తయారైంది.

విద్యుత్ వ్యయం సంగతి చూస్తే.. మొత్తం ప్రాజెక్టుకు అవరమయ్యే విద్యుత్తు 13,558 మిలియన్ యూనిట్లు. అయితే ఇందులో 75 శాతం విద్యుత్తు మాత్రమే వాస్తవంగా వినియోగమవుతుంది.అంటే వాస్తవ వినియోగం 10,168.50 మిలియన్ యూనిట్లు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ పంపు హౌజుల్లో 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పంపులు ఉన్నప్పటికీ వాస్తవ విద్యుత్ వినియోగం 27 మెగావాట్లే అన్నది గమనార్హం. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో విద్యుత్ వినియోగం మొదలయ్యే నాటికి ఉత్తర భారతదేశంలో ఉత్పత్తయ్యే జలవిద్యుత్ రూ.1.25 నుంచి రూ3.00లకే అందుబాటులోకి వస్తుంది. అప్పుడు విద్యుత్ వినియోగ వ్యయం ఇంకా తగ్గుతుంది. ప్రస్తుతం యూనిట్‌కు 3 రూ. చొప్పున లెక్కిస్తే మొత్తం విద్యుత్ వ్యయం 3051 కోట్లు. ఎకరానికి అయ్యే విద్యుత్ వ్యయం రూ.13,051 మాత్రమే. (ఇది ప్రాజెక్టులోని అన్ని పంపులు వాడినప్పుడు మాత్రమే. చిట్టచివరి ఆయకట్టు కోసం లిఫ్ట్ చేసినప్పుడు మాత్రమే ఈ ఖర్చవుతుంది. మిగిలిన చోట్ల తక్కువగా ఉంటుంది). లింకుల వారీగా ఎక్కువ తక్కువలు ఉండవచ్చు. పైగా ఇప్పుడు ప్రపంచంలో తయారవుతున్న పంపులు 89-91 శాతం ఎఫిషియన్సీ కలిగినవి. వాటి పవర్ ఫ్యాక్టర్ 0.95గా ఉంటుంది. కనుక 10 శాతం వరకు ప్రత్యక్షంగా విద్యుత్ వినియోగంలో సేవింగ్స్ ఉంటాయని విద్యుత్‌రంగ నిపుణులు చెబుతున్నారు. గతంలో కొంతమంది విమర్శకులు దాన్ని తమ ఊహాగానాల లెక్కలతో ఎకరానికి అయ్యే విద్యుత్ వ్యయాన్ని ఒక లక్ష నుంచి లక్షా ఎనభై వేలకు తప్పుడు లెక్క గట్టినారు. ప్రాజెక్టు దేశంలోనే అత్యంత ఖరీదైన నీటిని సరఫరా చేస్తుందని అన్యాయపు నిర్ధారణకు వచ్చారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ కింద ఆయకట్టు రైతులు చేసేది ప్రపంచంలోనే ఖరీదైన వ్యవసాయమని అన్యాయమైన వ్యాఖ్య చేశారు. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికి, ఒక ఎకరం భూమి సాగు కోసం అయ్యే ఖర్చును ప్రాజెక్టు ఇంజినీర్లు వాస్తవికంగా అంచనా కట్టారు. అది ఈ విధంగా ఉంటుంది.

**మేడి గడ్డ - ఎల్లంపల్లి లింక్-1 లో కరంటు ఖర్చులు**

| వివరాలు | కన్నేపల్లి | అన్నారం | సుందిళ్ళ |
|---|---|---|---|
| పంపులు | 11 | 8 | 9 |
| సామర్థ్యం | 40 మె.వా. | 40 మె.వా. | 40 మె.వా. |
| కరంటు లోడ్ | 440 మె.వా. | 320 మె.వా. | 360 మె.వా. |
| మోటార్ తీసుకునే లోడ్ | 27 మె.వా. | 27 మె.వా. | 27 మె.వా. |
| వాస్తవ లోడ్ | 297 మె.వా. | 200 మె.వా. | 234 మె.వా. |
| పంపులు నడిచే కాలం | 5 నెలలు | 5 నెలలు | 5 నెలలు |
| కరంటు వినియోగం | 1125.47 మి.యూ. | 757.89 మి.యూ. | 886.73 మి.యూ. |
| ఈఆర్సీ నిర్ధారించిన కరంటు ఛార్జీలు/యూనిట్ | రూ 5.80 | రూ.5.80 | రూ5.80 |
| కరంటు ఛార్జీలు | 65277.47 లక్షలు | 43957.89 లక్షలు | 51430.73 లక్షలు |
| ఫిక్స్‌డ్ ఛార్జీలు | 4126.73 లక్షలు | 3001.26 లక్షలు | 3376.42 లక్షలు |
| ఎత్తిపోసే నీరు | 300 టీఎంసీ | 300 టీఎంసీ | 300 టీఎంసీ |
| ఒక టీఎంసీకి కరంటు ఖర్చు | 231.34 లక్షలు | 156.53 లక్షలు | 182.69 లక్షలు |
| ఒక ఎకరం సాగు ఖర్చు (ఒక టీఎంసీకి 10 వేల ఎకరాలు) | రూ.2313.47 | రూ .1565.31 | రూ 1826.91 |

**లింక్1**లో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికి అయ్యే కరంటు ఖర్చు (ఫిక్స్‌డ్ చార్జీలు కలుపుకొని) 2313.47+1565.31+1826.91= 5705.68 లక్షలు (5.70 కోట్లు). లింక్ 1లో ఒక ఎకరం సాగుకు అయ్యే ఖర్చు (టీఎంసీకి 10 వేల ఎకరాల చొప్పున): రూ.5705.68. ఇదేవిధంగా **లింక్2**లో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికయ్యే కరంటు ఖర్చు 1207.43 లక్షలు. లింక్ 2లో ఎకరం సాగుకు అయ్యే ఖర్చు రూ. 17,780 మాత్రమే.

**లింక్3**లో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికయ్యే కరంటు ఖర్చు 15582.38లక్షలు. **లింక్3**లో ఎకరం సాగుకు అయ్యే ఖర్చు రూ.33, 362.41లు. అలాగే **లింక్4**లో ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోయడానికి అయ్యే కరంటు ఖర్చు 4519.14 లక్షలు. **లింక్4**లో ఒక ఎకరం సాగుకు అయ్యే ఖర్చు రూ.37,881.55 మాత్రమే. వాస్తవాలు ఈ విధంగా ఉండగా ప్రాజెక్టు విమర్శకులు మాత్రం ఎకరా సాగుకు లక్ష నుంచి లక్షా 80 వేలు అని తప్పుడు లెక్కలు కట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ఇక్కడ మరొక విషయం కూడా చెప్పాలి. టీఎస్ ఈఆర్‌సీ ఎత్తిపోతల పథకాలకు యూనిట్ విద్యుత్ ఛార్జి రూ.5.80 నిర్ధారించారు. అయితే ప్రభుత్వం యూనిట్ ఛార్జిని రూ.3గా పరిగణించి ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని లెక్కగట్టారని విమర్శకులు పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. ఈఆర్‌సీ విద్యుత్ ఛార్జీలను నిర్ధారించేటప్పుడు విద్యుదుత్పత్తి ఖర్చులు, విద్యుత్ కొనుగోలు ఖర్చులు, విద్యుత్ ప్రసార ఖర్చులు, డిస్కంల విద్యుత్ పంపిణీ ఖర్చులు, ప్రభుత్వాలు వివిధ వర్గాలకు ఇచ్చే సబ్సిడీలు.. మొదలైనవాటిని పరిగణనలోనికి తీసుకుంటాయి. తెలంగాణ ఈఆర్‌సీ కూడా ఇవే ప్రమాణాలతో వివిధ క్యాటగిరీలకు విద్యుత్ ఛార్జీలను నిర్ధారించింది.

ఈఆర్‌సీ నిబంధనల ప్రకారం రాష్ట్రంలో 2018-19లో లభ్యమయ్యే విద్యుత్ 65595.49 మిలియన్ యూనిట్లు. ఈ విద్యుత్ కొనుగోలు కోసం అయ్యే ఖర్చు 25,243.97 కోట్లు. టీఎస్ఈఆర్‌సీ వారి రిటైల్ పవర్ టారిఫ్ బుక్ ప్రకారం యూనిట్ విద్యుత్ కొనుగోలు కోసం అయ్యే సగటు ఖర్చు రూ.3.85. ఇకపోతే 2018-19లో భారీగా విద్యుత్‌ను వినియోగించే వివిధ కేటగిరిల్లో మొత్తం విద్యుత్ వినియోగం 46444.87 మిలియన్ యూనిట్లు. మిగతావి నష్టాలు, చిన్న వినియోగదారుల క్యాటగిరీల ఖాతాలోకి వెళ్తాయి. సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా వచ్చే విద్యుత్తులో 90 శాతం భాగం సౌర విద్యుత్తుదే. ప్రస్తుతం సోలార్ ప్లాంట్ల ద్వారా సరఫరా అవుతున్న విద్యుత్తు 4615.91 మిలియన్ యూనిట్లు. ఇది భవిష్యత్తులో మూడింతలు పెరిగే అవకాశం ఉన్నది. దీనితో విద్యుత్ కొనుగోలు ఖర్చు సగటున యూనిట్‌కు రూ.3.46కు పడిపోతుంది.

ఎత్తిపోతల పథకాలకు సరఫరా అయ్యే విద్యుత్‌కు ఈఆర్‌సీ యూనిట్‌కు రూ.5.80 ఛార్జీలు నిర్ధారించింది. ఎత్తిపోతల పంపులు వానకాలంలోనే నడుస్తాయి. ఈ కాలంలో వ్యవసాయం, గృహ వినియోగం, ఇతర వ్యాపార పరమైన వినియోగాలు గణనీయంగా పడిపోతాయి. వాన కాలంలో చౌక అయిన జలవిద్యుత్ విస్తారంగా అందుబాటులో ఉంటుంది. కాబట్టి విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతుంది. జల విద్యుత్ కోసం స్వల్పకాలిక ఒప్పందాల ద్వారా చౌకైన విద్యుత్‌ను ఎత్తిపోతల పథకాలకు అందుబాటు లోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నది. దీనికితోడు రాష్ట్రంలో, దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తి రోజు రోజుకు పెరుగుతున్నది. సౌర విద్యుత్ ఉత్పత్తి ఖర్చులు తగ్గుతున్నవి. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ తదితర ఎత్తిపోతల పథకాలు పూర్తయ్యేనాటికి సౌర విద్యుత్ ఉత్పత్తి 300 శాతం పెరిగే అవకాశం ఉన్నది. భవిష్యత్‌లో సోలార్ ప్లాంట్ల ద్వారా లభ్యమయ్యే సౌరవిద్యుత్తు సుమారు 13847.73 మిలియన్ యూనిట్లు. పగలు పంపులు నడుపడానికి సౌర విద్యుత్తును వినియోగించవచ్చు. ఇక రాత్రి వేళల్లో, వర్షం పడుతున్న రోజుల్లో తగ్గిన విద్యుత్ డిమాండ్‌ను ఎత్తిపోతల పథకాలకు మళ్లించవచ్చు. సౌర విద్యుత్తు యూనిట్ రూ 2.31లకే లభిస్తుంది. కాళేశ్వరం సహా పాలమూరు రంగారెడ్డి, దేవాదుల, సీతారామ, డిండి తదితర ఎత్తిపోతల పథకాలు పూర్తయితే రాష్ట్రంలోని మొత్తం విద్యుత్ వినియోగంలో 35 శాతం వినియోగం ఈ పంపింగ్ కేంద్రాల నుంచే ఉంటుంది. ఆదే సమయంలో వ్యవసాయంలో వినియోగం 50 శాతానికి పడిపోతుంది. ఎందుకంటే ఈ పథకాల ద్వారా రైతాంగానికి సాగు నీరు సరఫరా అవుతుంది. కాబట్టి వారు బోరుబావులపై ఆధారపడే అవసరం రాదు. భవిష్యత్తులో వ్యవసాయ విద్యుత్ వినియోగం 50 శాతానికి పడిపోతుంది. వ్యవసాయ విద్యుత్తుకు ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న క్రాస్ సబ్సిడీలో మిగులు ఏర్పడుతుంది. అవసరమైతే ప్రభుత్వం ఈ మిగులును ఎత్తిపోతల పథకాలకు మళ్ళించవచ్చు. ఆ రకంగా ఎత్తిపోతల పథకాల విద్యుత్ ఛార్జీలు కనిష్ఠానికి తగ్గిపోతాయి.

భవిష్యత్తులో సంప్రదాయేతర వనరుల నుంచి సరఫరా గణనీయంగా పెరుగనున్నందున యూనిట్ విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ 3.46కు పడిపోతుంది. టీఎస్ఈఆర్‌సీ బుక్ ప్రకారం అదనపు విద్యుత్తును రూ 3.10లకు అమ్మవచ్చు. కాబట్టి డిస్కంలు రూ. 3.10లకు యూనిట్ విద్యుత్‌ను కొనుగోలుచేసి ఎత్తిపోతల పథకాలకు సరఫరా చేసే అవకాశం ఉన్నది. కాబట్టి ప్రాజెక్టు వ్యయాన్ని అంచనా వేసేటప్పుడు యూనిట్ విద్యుత్ ఛార్జీని రూ.3గా పరిగణించడం సరైనదే.

**(ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు సౌజన్యంతో..) ఇంకా ఉంది...**

# సారు బాటలో రాష్ట్రాభివృద్ధి

స్మరణ

**ఆసరి రాజు**



తన గురించి కాకుండా సమాజం గురించి ఆలోచించడం కొందరికే సాధ్యం. ముఖ్యంగా జీవితకాలమంతా తెలంగాణ ఆకాంక్ష కోసం పోరాడటం, ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను లెక్కలతో సహా వెల్లడించడం, లక్ష్యసాధన కోసం ప్రతి ఒక్కరితో కలిసి సాగ డం అందరితో అయ్యే పనికాదు. కానీ ప్రొఫెసర్ జయశంకర్ సార్ మాత్రం దాని ఆచరణలో చూపెట్టారు. ఫజల్ అలీ నేతృత్వంలోని రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌తో పాటు తెలంగాణపై వేసిన అన్ని కమిటీల ముందు తెలంగాణ రాష్ట్ర అనివార్యతను నొక్కిచెప్పిన ఏకైక మేధావి. అందుకే రాష్ట్ర సాధన ఉద్యమానికి ముందు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సారు చేసిన సేవలను స్మరించుకోవాలి. తెలంగాణపై ఆయన రాసిన వ్యాసాలు, చేసిన పరిశోధనలు రాష్ట్ర పునర్నిర్మాణానికి కరదీపికలుగా పనిచేస్తున్నాయి.

తెలంగాణ సాధించుకోవడంతోనే అంతా అయిపోదు. అసలు పని ఆ తర్వాతే మొదలవుతుంది. అభివృద్ధి ఫలాలు అందరికీ అందించాలి. ఇవ్వాళ తెలంగాణ ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తూ సంక్షేమరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. వలస పాలనలో కుదేలైన వ్యవసాయరంగానికి పూర్వవైభవం తేవడానికి తీసుకుంటున్న చర్యలు మన కండ్లముందే ఉన్నాయి. ఇవన్నీ ఉద్యమ సమయంలో సారే కాదు సగటు తెలంగాణ వాది కోరుకున్నవే. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏర్పడిన టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చాలా నిర్ణయాలు అందరి ప్రశంసలను అందుకుంటున్నాయి. తెలంగాణ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' ద్వారా చెరువులకు జీవం పోసింది. ఈసారి పడిన వానలకు దాదాపు అనేక చెరువులు నిండిపోయాయి. తెల్లారగానే ఆడబిడ్డలు మంచి నీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచే బాధ లేకుండా 'మిషన్‌భగీరథ' ద్వారా గ్రామాలకు నీళ్లను అందిస్తున్నది.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులన్నీ కాగితాలు, శిలాఫలాలకే పరిమితమయ్యాయి. అందుకే తెలంగాణ ప్రాజెక్టులు అనగానే అంతర్రాష్ట్ర వివాదాలు, అటవీ చట్టాల దగ్గరే ఆగిపోతాయి. దీనర్థం తెలంగాణ ప్రాజెక్టులు ఎన్నటికీ పూర్తికావు. ఫలితంగా వందలాది టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రం పాలయ్యేవి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యలను అధిగమించే ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వ సంబంధాలు నెలకొల్పుతూ సాగునీటి ఒప్పందాల విషయంలోనూ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచింది. ఏటా బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం సింహభాగం నిధులు కేటాయిస్తూ యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు ఫలితం ఇప్పుడు కండ్లముందు కనిపిస్తున్నది. తెలంగాణ సోయి ఉన్నది కాబట్టే ఇవాళ వ్యవసాయానికి నాణ్యమైన కరంటు అందుతున్నది. పెట్టుబడి కోసం రైతుబంధు ద్వారా పెట్టుబడి సహాయం అందుతున్నది. రైతు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి రైతుబీమా పథకం ద్వారా పరిహారం అందిస్తున్నది. వ్యవసాయరంగానికే కాదు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందిస్తున్నది. అట్లనే పేద విద్యార్థులకు మంచి విద్యను అందించడానికి వందలాది గురుకులాలను ఏర్పాటుచేసింది. ఇవ్వాళ ఆ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను అధిగమించడానికి ప్రాజెక్టుల రీ డిజైనింగ్ చేపట్టింది. పక్కరాష్ట్రాలతో సంప్రదింపులు చేపట్టి వారి అంగీకారంతో ఒప్పందాలు కూడా చేసుకున్నది. ఇదే కొంతమందికి గిట్టలేదు. ప్రాజెక్టుల నిర్మాణాలకు కేసుల పేరుతో అడ్డంకులు సృష్టించడం అనేది వాళ్లకు పరిపాటి అయింది. కానీ జయశంకర్ సార్ వీళ్లలా చేయలేదు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ప్రత్యర్థులకు కూడా అర్థమయ్యేలా అంకెలతో సహా వివరించారు. ఇదెలా సాధ్యమయిందంటే నిత్య అధ్యయనం. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం సారు చూపిన మార్గమే మన కు ఆదర్శం కావాలి. కొట్లాడి, త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి. అదే మనం జయశంకర్ సారుకు ఇచ్చే ఘన నివాళి.

**(నేడు ఆచార్య జయశంకర్ సారు జయంతి)**

**స్మరణ**

## మీరే మాకు స్ఫూర్తి

నీళ్లు నిధులు దోచుకుంటూ
కలిసి ఉంటే కలదు సుఖమంటూ
కల్లబొల్లి మాటలతో మభ్యపెడుతుంటే
ఆంధ్ర పెత్తనాన్ని అంతం చేసేందుకు
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యమంటూ
బాట చూపిండు ప్రొఫెసర్ జయశంకరుండు
విడిపోతే కష్టాలు తప్పవంటూ
చెప్పిన వాళ్లకు లెక్కలెన్నో చూపి
వాళ్ల నోళ్లు మూయించిండు
ప్రత్యేక రాష్ట్రంతో తెలంగాణ మాగాణము
అభివృద్ధి దిశగా అగ్రగామిగా నిలుస్తుందని
తుదిశ్వాస విడిచే వరకు ఉపన్యసించిండు
జయశంకర్ సారు కల సాకారమైంది
ప్రాజెక్టుల సొబగులతో



మాగాణం కళకళలాడుతున్నది
మిగులు బడ్జెట్‌తో ధనిక రాష్ట్రంగా నిలిచింది
కష్టమైనా సుఖమైనా కలిసి బతుకుతున్నం
ఉద్యమబాట చూపిన మీ దారిలోనే పయనిస్తం
మీ స్ఫూర్తిగానే నడక సాగిస్తం...

**- ఉండ్రాల రాజేశం, 99669 46084**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



## ఎములాడకు శ్రావణ శోభ

వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం శ్రావణ శోభను సంతరించుకున్నది. సోమవారం రాజన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. దాదాపు 15 వేల మంది స్వామివారిని దర్శించుకు కోగా, వివిధ ఆర్జితసేవల ద్వారా రూ.14 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

-వేములవాడ కల్చరల్



నాగుల పంచమి సందర్భంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు. -ఇంద్రవెల్లి



# వచ్చే 48 గంటల్లో వర్షాలు

- బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం
- అనుబంధంగా ఉపరితల ఆవర్తనం
- పలు జిల్లాల్లో కురిసిన ఓ మోస్తరు వాన



సోమవారం వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో పొంగిపొర్లుతున్న నస్కల్ వాగు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్:** పశ్చిమ బెంగాల్, ఒడిశా తీర ప్రాంతాలను ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. రాగల 48 గంటల్లో అల్పపీడనం తీవ్రమయ్యే పరిస్థితి ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాగల 48గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయన్నారు. కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని పేర్కొన్నారు.

### పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు

నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో సోమవారం ఖమ్మంలో భారీగా, గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు వికారాబాద్, కరీంనగర్, సూర్యాపేట జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా నిజామాబాద్ జిల్లాలో జల్లులు పడ్డాయి. ఖమ్మం నగరంతోపాటు శివారు మండలాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఖమ్మం నగరం జలమయమైంది. ముఖ్యంగా బస్టాండ్ ఏరియా, కమాన్ బజార్, మయూరిసెంటర్, త్రీటౌన్ ప్రాంతంలోని పీఎస్‌ఆర్ రోడ్, గాంధీచౌక్‌తోపాటు శివారు కాలనీల్లోని రోడ్లపైకి వరదనీరు చేరుకోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఖమ్మం రూరల్, చింతకాని, రఘునాథపాలెం, నేలకొండపల్లి, కామేపల్లి మండలాలతోపాటు, వైరా, మధిర నియోజక వర్గాల్లోని పలు గ్రామాల్లో జల్లులతో మొదలై ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సోమవారం సాయంత్రం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నాలుగు నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. సూర్యాపేటతో పాటు పలుచోట్ల రోడ్లపై వరద నీరు ప్రవహించింది. వికారాబాద్ జిల్లా పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఎడతెరిపి లేకుండా ముసురు పడింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు పెద్దేముల్ మండలంలో 28.0 మి.మీ., బంట్వారం 22.4 మి.మీ., పూడూరులో 18.2 మి.మీ., వికారాబాద్‌లో 16.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లాలో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. కరీంనగర్, మానకొండూర్, తిమ్మాపూర్, చిగురుమామిడి, గన్నేరువరం, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట తదిత మండలాల్లో అక్కడక్కడా వర్షం పడింది. మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. నిజామాబాద్ నగరంలో విడతల వారీగా చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. డిచ్‌పల్లి, ఇందల్వాయి, ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం పడింది.

### ముంబైలో వర్షాలతో పలు రైళ్లు రద్దు

ముంబైలో కురుస్తున్న వర్షాల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సోమవారం ప్రకటించింది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే హతియా-యశ్వంతపూర్, ముంబై సీఎస్‌టీ- హైదరాబాద్, ముంబై-అజ్ని, చెన్నై సెంట్రల్-ముంబై సీఎస్‌టీ, ముంబై-బీదర్ రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్టు పేర్కొంది.



నల్లగొండలోని పానగల్ ఉదయ సముద్రం ప్రాజెక్టు సమీపంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఈ ప్రాంతమంతా వరినాట్లతో పచ్చగా కన్పించింది.



మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పలువురు మహిళలతో కలిసి వరి నాట్లు వేశారు.

- మెదక్, నమస్తే తెలంగాణ

### గ్రేటర్ హైదరాబాద్‌కూ వర్ష సూచన..

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలుచోట్ల సోమవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ముషీరాబాద్, బంజారాహిల్స్, కాప్రా, మౌలాలి, నేరేడ్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. రాగల 48 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఒకటిరెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

## ఐదేండ్ల చిన్నారిపై లైంగిక దాడి

**చిలుపూర్ :** ఐదేండ్ల చిన్నారిపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన జనగామ జిల్లా చిలుపూర్ మండల పరిధిలోని ఓ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక ఇంటి పరిసరాల్లో నివసించే ఎడ్ల శ్రీనివాస్(19) ఆదివారం సాయంత్రం బాలికను కాలనీకి దూరంగా తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి చేరుకుంది. గమనించిన తల్లిదండ్రులు ఏం జరిగిందని ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు సోమవారం మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఏసీపీ వెంకటేశ్వరబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజిరెడ్డి, మహిళా సీఐ సువర్ణ తెలిపారు.

# ఘొల్లుమన్న కొత్తపల్లి

- ఆటో ప్రమాద మృతులకు అంత్యక్రియలు పూర్తి
- బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు.. బాధితులను ఓదారుస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**మహబూబ్‌నగర్ ప్రధానప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఒక్క ప్రమాదం 13 మంది బడుగుల జీవితాలను ఛిద్రం చేసింది. వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులను దిక్కులేని వారిని చేసింది. తమ గ్రామస్థుల అకాల మృత్యువాతతో కొత్తపల్లి కన్నీటిసంద్రంలా మారింది. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కొత్తపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలది ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ. కొడుకులను కోల్పోయిన వృద్ధ తల్లిదండ్రులు, తల్లులను కోల్పోయిన పిల్లలు కన్నీరుమున్నీరవుతున్న తీరు వర్ణనాతీతం. ఇక తమవారు లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామంలో ఏ ఇంటా చూసిన ఆప్తులను కోల్పోయి రోదిస్తున్న వారే కనిపిస్తున్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కొత్తపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. మృతిచెందిన 13 కుటుంబాలకు రూ.6 లక్షల మేర ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా అందిస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కొత్తపల్లి చేరుకుని బాధితులను పరామర్శించారు. క్షతగాత్రులకు దవాఖానలో మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. సోమవారం పోస్ట్‌మార్టం నుంచి అంత్యక్రియల వరకు వారు దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రభుత్వం తరపున తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ. 50 వేల చొప్పున చెక్కులు అందచేశారు.



బాధితులకు ఆపద్బంధు చెక్కు అందిస్తున్న మంత్రిశ్రీనివాస్‌గౌడ్, ఎంపీ, ఎమ్మెల్యే

రూ. 6 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా ఇస్తామని తెలిపారు. కొత్తపల్లిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మృతి చెందిన వారి కుటుంబాలకు తొలి ప్రాధాన్యంగా ఇళ్లను కేటాయిస్తామన్నారు. చదువుకునే విద్యార్థులకు గురుకులాల్లో ఉచిత విద్య అందిస్తామని తెలిపారు. అర్హులైన వారికి ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో 7 మంది రైతు బీమా ఉన్న వారు చనిపోయారు. వారి కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున ప్రమాద బీమా అందనుంది. బాధితులకు తామంతా అండగా ఉన్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. వెంటనే స్పందించి సాయమందించిన సర్కారుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



భార్య చాందిని, పిల్లలతో ప్రవీణ్ ( ఫైల్ )

# కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్య, ఇద్దరు పిల్లల హత్య

**వికారాబాద్ టౌన్:** తాగొద్దన్నందుకు భార్య, ఇద్దరు పిల్లల్ని ఓ వ్యక్తి కిరాతకంగా హత్య చేసిన ఘటన వికారాబా ద్ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. తాండూర్‌కు చెందిన గురు ప్రవీణ్ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటున్నది. ఇంటికి సమీపంలో ఉండే చాందిని(35)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. విషయం చాందిని ఇంట్లో తెలియడంతో ఆమె కుటుంబ సభ్యులు వేరే వ్యక్తికిచ్చి వివాహం చేశారు. వీరికి ఆయన్ (10) కొడుకు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో చాందిని విడాకులు తీసుకున్నది. అనంతరం 2014లో గురు ప్రవీణ్‌ను చాందిని రెండోవివాహం చేసుకుంది. అప్పటి నుంచి వికారాబాద్‌లో అద్దెకు ఉంటున్నారు. వీరికి కూతురు క్రిస్ ఏంజల్ (5) జన్మించింది. ప్రవీణ్ ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, చాందిని ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నది. మూడు రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ప్రవీణ్ తల్లి హేమలత, తమ్ముడు ప్రదీప్, ప్రవీణ్ మద్యం తాగి ఇంటికి వచ్చారు. ఎందుకు తాగి వచ్చారని భర్త ప్రవీణ్‌ను చాందిని నిలదీయడంతో గొడవ జరిగింది. అక్కడే ఉన్న ప్రవీణ్ తల్లి గొడవ కారణంగా ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో క్షణికావేశంలో చాందినితోపాటు పిల్లలు ఆయన్, క్రిస్ ఏంజల్‌ను ప్రవీణ్ ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేశాడు. అనంతరం వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

# పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు

- విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో పుస్తకప్రదర్శనను ప్రారంభించిన అనంతరం పుస్తకాన్ని తిలకిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జూలూరు గౌరీశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక తదితరులు

**సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలనీ, మరణించే వరకు నిత్య విద్యార్థులుగా ఉంటారని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారంసూర్యాపేటలోని జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి పుస్తక ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలను తలపించే రీతిలో విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో తొలిసారిగా వినూత్న రీతిలో ఒకే రోజు 100 ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తక ప్రదర్శనలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కొంతమంది విద్యార్థులను వేదికపైకి పిలిచి మాట్లాడించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్వయంగా చేతిరాతతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ అమయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు పాల్గొన్నారు. అనంతరం జమ్మిగడ్డలో ఏర్పాటు చేసిన సఖీ హెల్ప్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. సాయంత్రం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భువనగిరిలో జిల్లా పరిషత్ భవన ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

# టీఆర్‌ఎస్‌కు ఎదురులేదు

- మాజీ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండలో మాట్లాడుతున్న గుత్తా

**నల్లగొండ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంటూ బీరాలు పలుకుతున్న కాంగ్రెస్, బీజేపీలు అన్ని ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యాయనీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ విజయదుందుభి మోగిస్తుందని మాజీ ఎంపీ, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నల్లగొండలో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలికి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనను ప్రకటించిన సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్ రావు, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నన్ను స్వదేశానికి రప్పించండి

- ఏజెంట్ చేతిలో మోసపోయిన దేవయ్య
- ఆదుకోవాలని సోషల్ మీడియా ద్వారా కేటీఆర్‌ను కోరిన గల్ఫ్ బాధితుడు



**వీర్నపల్లి:** మస్కట్ వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయిన ఓ వ్యక్తి తనను స్వదేశానికి రప్పించాలని సోషల్ మీడియా ద్వారా టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను వేడుకున్నాడు. బాధితుడు, అతని కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బంజేరు గ్రామానికి చెందిన తుడుం దేవయ్యను 9 నెలల క్రితం కంపెనీ వీసా అని చెప్పి ఓ ఏజెంట్ మస్కట్ పంపించాడు. అక్కడికి చేరుకున్నాక ఓ షేక్ ఇంట్లో పనికి కుదిర్చాడు. తొమ్మిది నెలల తర్వాత ఒక నెల జీతమిచ్చి, మిగితాది అడిగితే చిత్ర హింసలకు గురిచేశారు. న్యాయం చేయాలని లేబర్ కోర్టు, ఎంబసీ కార్యాలయాలకు వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో దేవయ్య తన పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా కేటీఆర్‌కు తెలిపారు. స్పందించిన కేటీఆర్ కార్యాలయ సిబ్బంది స్థానిక జడ్పీటీసీ కళావతి ద్వారా బాధితుడి కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరించారు. దేవయ్యను త్వరలోనే రప్పించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు.

'పచ్చదనం-పరిశుభ్రత'లో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక సర్కారు దవాఖానలో విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మొక్కలు నాటారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సోలిపేట స్వయంగా దవాఖానలోని టాయిలెట్లను శుభ్రం చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు.

-దుబ్బాక టౌన్





కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

# వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 952 గురుకులాలు
- సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ముకరంపుర:** అన్ని గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. సోమవారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, రీజనల్ కోఆర్డినేటర్లు, ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వం 952 గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా మౌలిక వసతులు, విద్య అందిస్తూ ఒక్కో విద్యార్థిపై ఏటా రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. గత మూడేండ్లు జగిత్యాల 'పది 'ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ని లిచిందని అభినందించారు. సమావేశంలో సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జేసీలు యాస్మిన్‌భాషా, రాజేశం, వనజాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో తెలంగాణే నంబర్‌వన్



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**స్టేషన్‌ఘన్‌పూర్, నమస్తే తెలంగాణ:** అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రైతులను ఆదుకోవడానికి 24 గంటల ఉచిత కరంటు, సాగు నీరు, ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జెడ్పీచైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# ప్రాజెక్టుల నిర్మాణంతో కొత్త చరిత్రకు శ్రీకారం

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:** రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, సాగునీటిని అందించేందుకు నిర్మిస్తున్న ప్రాజెక్టులతో ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యేలు అజయ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి, రాములునాయక్, ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ప్రేమ జంటలే టార్గెట్

- పోలీసునని బెదిరిస్తూ యువతులపై లైంగికదాడి
- వెలుగులోకి ఆర్‌ఎంపీ అరాచకాలు
- వలపన్ని పట్టుకున్న పోలీసులు

**సంగారెడ్డి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** నిర్జన ప్రదేశాల్లో కనిపించే యువ ప్రేమజంటలను టార్గెట్ చేసి పోలీసుల పేరుతో యువతులపై లైంగిక దాడికి పాల్పడుతున్న ఓ ఆర్‌ఎంపీని సంగారెడ్డి పోలీసులు సోమవారం అరెస్టుచేశారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పీఎస్‌లో ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. కంది మండలం కలివేముల గ్రామానికి చెందిన గొల్ల శంకరయ్య (42) ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. అతడికి భార్య, 12 ఏండ్ల కూతురు ఉన్నారు. అమ్మాయిలపై మోజుతో కళాశాలలకు చెందిన యువ ప్రేమ జంటలను టార్గెట్ చేస్తుంటాడు. నిర్జన ప్రదేశాల్లో గడిపే ప్రేమికులను పోలీసునని బెదిరిస్తాడు. గత నెల 26న ఉదయం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న ఓ ప్రేమ జంట వద్దకు వెళ్లి హంగామా చేశాడు. పోలీసుస్టేషన్ తీసుకువెళ్తానంటూ యువకుడిని కొట్టి సెల్‌ఫోన్ లాక్కుని అక్కడి నుంచి పంపించాడు. వీడియోలు తీశానని బెదిరించి యువతిని తన వాహనంపై ఎక్కించుకుని మధ్యాహ్నం నుంచి రాత్రి 9 గంటల వరకు పటాన్‌చెరు మండలం రుద్రారం, గణేష్‌గడ్డా, సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట, హత్నూర, వట్‌పల్లి మీదుగా సదాశివపేట వరకు తీసుకువెళ్లాడు. అక్కడ నిజాంపూర్ శివారులో యువతిపై లైంగికదాడి చేశాడు. అనంతరం యువతికి ఫోన్లు ఇచ్చి ఎవరికైనా చెబితే బాగుండదని హెచ్చరించి వెళ్లిపోయాడు. బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నారు. యువతి చెప్పిన ఆనవాళ్ల ప్రకారం ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. నిందితుడు ఆర్‌ఎంపీ వైద్యుడు శంకరయ్యగా గుర్తించి అరెస్టు చేశారు.

# కౌలు భూమి కబ్జా

## కబ్జాదారుల పేరిట రికార్డుల్లోకి 2.28 ఎకరాలు

- నల్లగొండ జిల్లా అధికారుల మాయ
- బెదిరిస్తున్న కబ్జాదారులు.. అండనివ్వని పోలీసులు
- బిజీగా ఉన్నానంటున్న మునుగోడు తాసిల్దార్
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు మౌలాబీ


బాధితురాలు సయ్యద్ మౌలాబీ పాస్‌బుక్


ఈ ఏడాది మీ- సేవలో తీసిన 1-బీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిత్రవిచిత్రాలు చేసే రెవెన్యూ అధికారుల చేతివాటానికి మరో నిదర్శనంగా నిలుస్తున్నది ఈ ఉదంతం. కౌలు చేస్తారని తన భూమిని అప్పగిస్తే.. కబ్జాచేసిన కౌలుదారులు.. ఆ భూమిని వారిపేరిట రికార్డుల్లోకి ఎక్కించుకొన్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు.. కబ్జాదారులకు వంతపలికారు. భూమిమీదకు వెళ్తే.. కబ్జాదారులు రానీయడం లేదు. అటు పోలీసులు కూడా పట్టనట్టు వ్యవహరించడంతో తన గోడును 'ధర్మగంట' ఎదుట వెళ్లబోసుకొన్నారు నల్లగొండ జిల్లా మామిళ్లగూడేనికి చెందిన బాధితురాలు సయ్యద్ మౌలాబీ. వారి ఆవేదన.. ఆమె మాటల్లోనే.. 'నా పేరు సయ్యద్ మౌలాబీ. నా భర్త ఇమామ్ నాలుగో తరగతి ఉద్యోగి కావడంతో ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో నివాసం ఉన్నాం. నా భర్త ఉద్యోగ విరమణ తర్వాత నల్లగొండ మండలంలోని మామిళ్లగూడెంలో ఉంటున్నాం. నాకు తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన 2.28 ఎకరాల భూమి నల్లగొండ జిల్లా మునుగోడు మండలం దుబ్బకాల్వ గ్రామంలోని సర్వే నంబర్లు 732/అ, 724/ఆలలో ఉన్నది. 1972లో నాకు పెండ్లి అయ్యింది. ఆ సమయంలోనే నాకు ఈ భూమిని రాసిచ్చారు. మా నలుగురు చిన్నాన్నల ముందే ఈ పత్రం రాసిచ్చారు. నా తండ్రి చనిపోయే వరకు ఈ భూమి ఆయన పేరిటే ఉన్నది. నా తండ్రి చనిపోయిన తర్వాత రెవెన్యూ అధికారులు విచారణ చేసి, నా పేరిట రికార్డుల్లోకి ఎక్కించారు. నాకు 1-బీ పట్టాతోపాటు, పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చారు. ఆనాటి నుంచి 2008 వరకు పట్టాదారు కాలంలో, అనుభవదారు కాలంలో నా పేరు ఉన్నది. అకస్మాత్తుగా 2008-09 పహాణీలో పట్టాదారు కాలంలో నా పేరు ఉంచి, అనుభవదారు కాలంలో భూమిని కౌలుకు చేస్తున్న బెల్లి స్వామి, బెల్లి దానయ్య పేర్లు ఎక్కించారు. నాకు ఇచ్చిన భూమిని నా తండ్రి, నా చిన్నాన్నలు అమ్మినట్టు ఫోర్జరీ సంతకాలతో కాగితాలు సృష్టించుకొన్నారు. ఈ భూమిని 1986లో ఖరీదు చేసినట్టు చూపిస్తున్నారు. ఈ భూమిని నా తండ్రి ఎవ్వరికీ అమ్మలేదు. కేవలం ఈ భూమిని కౌలుకు తీసుకొన్న స్వామి కుటుంబసభ్యులు మేం నల్లగొండ నుంచి ఇక్కడికి తిరిగిరామని భావించి, వచ్చినా ఏమీ చేయలేరన్న ధీమాతో కబ్జాచేశారు. నేను భూమి వద్దకు వెళ్తే రానివ్వడం లేదు. బెదిరిస్తున్నారు. భూమిని కబ్జాచేసినవారిని తొలగించి, పట్టాదారురాలైన నాకు అప్పగించాల్సిన పోలీసులు ఏ మాత్రం సహకరించడం లేదు. రెవెన్యూ అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారు కానీ, అక్రమంగా నా భూమి రికార్డుల్లోకి ఎక్కినవాళ్ల పేర్లు తొలగించడం లేదు. భూరికార్డుల ప్రక్షాళనలో నాకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇచ్చారు. ఇప్పటికీ 1-బీ ఆన్‌లైన్‌లో నా పేరిటే వస్తున్నది. సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో కూడా నా పేరే ఉన్నది. రైతుబంధు సాయం కూడా అందుతున్నది. కానీ భూమి మీదకు నన్ను పోనివ్వడంలేదు. పహాణీలో అనుభవదారు కాలంలో వారి పేరు వస్తున్నది. దీనిని తొలగించాలని కోరితే.. రెవెన్యూ అధికారులు పూటకోమాట చెప్తున్నారు. అనుభవదారు కాలంకు రైట్ లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్తున్నారు.. నీకెందుకు భయం? అంటున్నారు. భూమి మీదకు పోతే నన్ను రానివ్వడం లేదు. పోలీసులను అడిగితే రికార్డుల్లో వారి పేరు లేదని రాయించుకు రమ్మంటున్నారు. హేళనగా మాట్లాడుతున్నారు. మరోసారి కబ్జాలో ఎవరున్నారో చూడాలంటారు. కౌలుకు భూమి ఇస్తే కబ్జా చేశారు. కబ్జా ఎవరుచేస్తే వాళ్లకే రెవెన్యూ అధికారులు భూములు రాసిస్తారట! ఇదేమి న్యాయమో అర్థంకావడం లేదు. ఎలాగైనా కబ్జాదారుల చేతుల్లో ఉన్న నా భూమిని ఇప్పించండి. పహాణీలో అనుభవదారుల కాలంలో వస్తున్న వాళ్ల పేర్లను తొలగించండి.

### ఇప్పుడు బిజీ.. తర్వాత పరిశీలిస్తాం

ఇప్పుడు బిజీగా ఉన్నాం. రెండోవిడుత రికార్డుల పరిశీలన జరుగుతున్నది. ఈ పని అయిన తర్వాత చూస్తాం. పేరు మార్పిడి ఎలా జరిగిందో రికార్డులు పరిశీలించాలి. రికార్డులు పరిశీలించి నివేదిక తయారుచేయాలి. డిప్యూటీ తాసిల్దార్, సీనియర్ అసిస్టెంట్లను నివేదిక తయారు చేయాలని ఆదేశించాను. నివేదిక ఇచ్చిన తర్వాత పరిశీలిస్తాం.

**- జ్ఞానేశ్వర్ దేవ్, మునుగోడు తాసిల్దార్**


రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం అగర్‌మియాగూడకు చెందిన రైతులు ఈర్లపల్లి జంగారెడ్డి, వెంకట్‌రెడ్డికి పాస్‌పుస్తకాల ప్రతులను అందజేస్తున్న తాసిల్దార్ యశ్వంత్

## రైతులకు అందిన పాస్‌పుస్తకాల ప్రతులు

- 'మ్యుటేషన్ కోసం ముప్పుతిప్పలు' కథనానికి స్పందన
- సమస్యను పరిష్కరించిన రంగారెడ్డి జిల్లా కందుకూరు తాసిల్దార్

**కందుకూరు:** 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన 'మ్యుటేషన్ కోసం ముప్పుతిప్పలు' కథనానికి అధికారులు స్పందించారు. బాధిత రైతుల సమస్యను పరిష్కరించి పాస్‌పుస్తకాల ప్రతులను అందజేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం అగర్‌మియాగూడకు చెందిన రైతులు ఈర్లపల్లి జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి పరస్పరం భూములను బదలాయించుకొని మ్యుటేషన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో తాసిల్దార్ ఊటు యశ్వంత్ స్పందించారు. బాధిత రైతులను తాసిల్ కార్యాలయానికి పిలిపించుకొని సమస్యను తెలుసుకొన్నారు. వెంటనే రికార్డులను సరిచేసి వారి పేరిట మ్యుటేషన్‌చేసి పట్టాదారు పాస్‌పుస్తకాల ప్రతులను అందజేశారు. దీంతో బాధిత రైతులు సంతోషం వ్యక్తంచేస్తూ 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా 'రికార్డుల్లో ఎనిమిది గుంటలు మాయం' కథనానికి కూడా స్పందించిన తాసిల్దార్.. బాధితురాలు సునీతారెడ్డిని కార్యాలయానికి పిలిపించి రికార్డులను సరిచేశారు. ఆ రికార్డులను జాయింట్ కలెక్టర్ వద్దకు పంపించారు. సమస్యను వారంలోగా పరిష్కరిస్తామని బాధితురాలికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## మా మాట!

### శాశ్వత భూపరిష్కారం



ఏండ్లుగా భూసమస్యలతో సతమతమవుతున్న రైతులకు సీఎం కేసీఆర్ చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళనతో మేలు జరిగింది. శాశ్వత భూసమస్యల పరిష్కారం కోసం సీఎం చేస్తున్న కృషి అభినందనీయం. పహాణీలో తప్పొప్పులు, పాస్‌పుస్తకంలో మార్పులుచేర్పులు చేసుకోవాలంటే కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగాల్సి ఉండేది. చెప్పులరిగేలా తిరిగినా వారిని కనీసం పట్టించుకొనేటోళ్లు కాదు. ప్రతి ఊళ్లో ఈ సమస్య ఉన్నది. రెవెన్యూ అధికారులు పారదర్శకంగా పనిచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండేవికావు. ఈ సర్కారు ఒక మంచి నిర్ణయంతో ముందుకెళ్తున్నది. దీన్ని అందరూ స్వాగతించాలి. రెవెన్యూ విభాగంలో సంస్కరణలు చేయడం ఒక్క సీఎం కేసీఆర్‌కే సాధ్యమవుతుంది. ఎన్నో సమస్యలకు 'నమస్తే తెలంగాణ' ధర్మగంట ద్వారా పరిష్కారం చూపుతున్నది.

**- సత్యనారాయణ, కాగజ్‌నగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా**

### సీఎం కేసీఆర్ నిర్ణయం హర్షణీయం



'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న కథనాల ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతున్నది. రెవెన్యూ అధికారుల్లో నిర్లక్ష్యాన్ని తొలగించేందుకు సీఎం కేసీఆర్ తీసుకొన్న నిర్ణయం హర్షణీయం. ఎన్నో ఏండ్ల భూసమస్యలు 'ధర్మగంట'తో పూర్తిగా పరిష్కారమవుతున్నాయి. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గతంలో రైతులు తాసిల్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ చేస్తున్న కృషి అమోఘం. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ధన్యవాదాలు.

**- ఆంగోత్ లచ్చునాయక్, రైతు, రంగుండ్లతండా, నల్లగొండ జిల్లా**

### 'ధర్మగంట'తో సమస్యలు వెలుగులోకి..



గతంలో భూసమస్యల పరిష్కారానికి తాసిల్ కార్యాలయాలకు వెళ్తే రైతులను రెవెన్యూ అధికారులు చాలా ఇబ్బందికి గురిచేసేవారు. వారు చేసే ప్రతి పనికి డబ్బు ఆశిస్తూ లంచం ఇచ్చిన వారి పని త్వరగా చేసేవారు. ఇవ్వని వారిని ఇబ్బందులకు గురిచేసేవారు. అలా ఆగిన పనులన్నీ ఇప్పుడు 'ధర్మగంట' కథనాల ద్వారా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పుడు రైతులు నేరుగా 'నమస్తే తెలంగాణ'కు తమ గోడును చెప్పుకొంటుంటే సమస్యలు చకచకా పరిష్కారమవుతున్నాయి. ప్రభుత్వానికి, 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు.

**- బంటు సైదులు, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా**

### అవినీతిరహిత పాలనే సీఎం కేసీఆర్ లక్ష్యం



బంగారు తెలంగాణలో భాగంగా అవినీతిరహిత పాలన అందిస్తూ రైతు రాజ్యంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో భూరికార్డుల ప్రక్షాళన, 'నమస్తే తెలంగాణ'లో ధర్మగంట శీర్షికను తీసుకురావడం అభినందనీయం. రెవెన్యూశాఖ ప్రక్షాళనను రైతులే కాదు, ప్రజలందరూ హర్షిస్తున్నారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకోవడంతో దేశానికి దిక్సూచిగా నిలిచిపోయారు. రెవెన్యూశాఖలో అవినీతిని అంతమొందించడానికి 'ధర్మగంట' ప్రజలకు వరంగా మారింది.

**- సూదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రైతు, పొట్లపహాడ్, సూర్యాపేట జిల్లా**

### కొత్త చట్టాలు అవసరం



అవినీతి అధికారుల తీరుతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ప్రజలు భయపడాల్సిన దుస్థితి నెలకొన్నది. స్వరాష్ట్రంలో సుపరిపాలన అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా ఆయా శాఖల్లో అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందికర పరిణామాలు ఎదురవుతున్నాయి. అవినీతిని నిర్మూలిస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది. ఇందుకు కొత్త చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. రెవెన్యూ, మున్సిపల్‌శాఖల్లో ప్రక్షాళనకు చర్యలు చేపట్టడాన్ని ప్రజలంతా అభినందిస్తున్నారు.

**- మనోజ్, మున్యానాయక్‌తండా, సూర్యాపేట జిల్లా**

## అక్రమంగా భూమిని బదలాయించారు

- గద్వాల కలెక్టరేట్ ఎదుట యువరైతు ఆత్మహత్యాయత్నం
- ఏడాదిన్నరగా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణ
- న్యాయంచేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్


బాధిత రైతుతో మాట్లాడుతున్న జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ శశాంక

**గద్వాల, నమస్తే తెలంగాణ:** తన పట్టా భూమి రెండెకరాలను సమాచారం లేకుండా ఇతరులకు బదలాయించారని, భూమి తక్కువగా ఉన్నదని సర్వేచేసి హద్దులు చూపాలని దరఖాస్తు చేసుకొన్నా ఏడాదిన్నరగా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం మొగిలిరావుల చెరువుకు చెందిన షేక్‌అబ్దుల్‌హుస్సేన్ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. తాతల కాలం నుంచి గ్రామంలోని సర్వే నంబర్ 216లో రికార్డు ప్రకారం 4.17 ఎకరాల భూమి తమకు వారసత్వంగా వస్తున్నదని తెలిపారు. భూమికి సంబంధించి అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అయితే రెవెన్యూ అధికారుల తప్పిదంతో అదే సర్వే నంబర్‌లోని మరో వ్యక్తికి తాము కాస్తుచేసుకొంటున్న భూమిలోనుంచి రెండెకరాలను బదలాయించినట్టు చెప్పారు. దీంతో తన పేరిట ఎంత భూమి ఉందో దానిని రికార్డుల్లో సరిచేయాలని ఏడాదిన్నరగా తిరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారుల సూచన మేరకు సర్వే కోసం మండల, జిల్లా సర్వే అధికారులకు ఏడాదిన్నరగా మొరపెట్టుకొన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్టు చెప్పారు. స్పందించిన కలెక్టర్ శశాంక.. క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని ఇటిక్యాల మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆత్మహత్యకు యత్నించిన రైతు నుంచి సీఐ హనుమంతు వివరాలు సేకరించారు.

## భూమి కోసం రైతు కుటుంబం ధర్నా

- మంచిర్యాల కలెక్టరేట్‌లో బాధితుడి కొడుకు ఆత్మహత్యాయత్నం
- తమకు తెలియకుండా అధికారులు పట్టా మార్చారని ఆరోపణ

**మంచిర్యాల రూరల్:** దశాబ్దాలుగా సాగుచేసుకొంటున్న భూమిని తమకు తెలియకుండా అధికారులు రికార్డుల్లో సింగరేణి ఉద్యోగి పేరు ఎక్కించారని, పట్టా పొందిన వ్యక్తి తమను బెదిరిస్తున్నాడని, భూమి తమకు ఇప్పించాలని కోరుతూ మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఓ రైతు కుటుంబం ధర్నాకు దిగింది. ఈ సమయంలో బాధిత రైతు కుమారుడు ఒంటిపై కిరోసిన్ పోసుకోగా పోలీసులు అడ్డుకొన్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రానికి చెందిన కీసరి సుశీల, నర్సయ్య దంపతులు నెన్నెల శివారులోని సర్వే నంబర్ 70/2లోని 3.20 ఎకరాల లావుణి పట్టా భూమిలో 1970 నుంచి సాగు చేసుకొంటున్నారు. దీంతో 2006లో ప్రభుత్వం ఆర్వోఆర్ పట్టాను అందించింది. ఇదే భూమిని ఆనుకొని బెల్లంపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి బిరుదు రాములుకు ఆరెకరాల భూమి ఉన్నది. రెవెన్యూ రికార్డుల్లో దొంగతనంగా తమ భూమిని రాములు పేరిట మార్చారని ఆరోపించారు. రాములు కొద్ది రోజుల నుంచి తమ భూమి వద్దకు వచ్చి తనదేనని బెదిస్తున్నారని సుశీల, నర్సయ్య తెలిపారు. ఈ విషయమై నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినా ఎస్ఐ పట్టించుకోవడం లేదని వాపోయారు. మూడేండ్ల కింద జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు వేశామని తెలిపారు. ఈ భూమి ప్రభుత్వానిది కాదనీ, అది బిరుదు రాములుకు చెందిన పట్టా భూమి అని జాయింట్ కలెక్టర్ గత నెల 12న కేసును కొట్టివేశారని వాపోయారు. తమకు ఇదే జీవనాధారమని, భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. లేదంటే ఆత్మహత్య చేసుకొంటానని రైతు కుమారుడు సాయికుమార్ ఒంటిపై కిరోసిన్ పోసుకోగా పోలీసులు అడ్డుకొన్నారు. పోలీసులు బాధిత రైతు కుటుంబాన్ని కలెక్టరేట్ ఏవో వద్దకు తీసుకెళ్లగా, తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. అనంతరం బాధిత రైతు కుటుంబం జాయింట్ కలెక్టర్‌ను కలిసింది. ఇది ప్రభుత్వ భూమి కాదనీ, అప్పీలుకు హైకోర్టుకు వెళ్లాలని జేసీ చెప్పారని బాధిత రైతు కుటుంబం వాపోయింది.


మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకొంటున్న బాధిత రైతు కుమారుడు సాయికుమార్

**ఆత్మహత్యాయత్నంపై కేసు నమోదు: జేసీ**

నెన్నెల శివారులో కాస్రా పహాణీ 1954-55 ప్రకారం పాత సర్వే నంబర్ 591లో 6.32 ఎకరాల భూమి బిరుదు పెద్ద బక్కయ్య పేరిట ఉండగా, తర్వాత బిరుదు మల్లయ్య పేరిట మారిందని జేసీ సురేందర్‌రావు తెలిపారు. వసూల్ బాకీ ప్రకారం ఆ భూమి కొత్త సర్వే నంబర్ 70లో 5.39 ఎకరాలుగా మారిందనీ, 1973-74లో ఈ సర్వే నంబర్‌ను సబ్ డివిజన్ నంబర్లు 70/1లో 5.39 ఎకరాల భూమి బిరుదు మల్లయ్య పేరిట,70/2లో 3.20 ఎకరాలు కరీజ్ ఖాతాగా రికార్డు చేశారని అన్నారు. 2006లో భూమి కేటాయించాలని కీసరి సుశీల దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ సర్వే నంబర్ 70/2లోని భూమిని అసైన్డ్‌గా పేర్కొంటూ మంజూరు చేశారన్నారు. 2013 వరకు వారు సాగు చేసుకొన్నారని తెలిపారు. తమ భూమి ఆక్రమణకు గురైందని, దాన్ని రద్దు చేయాలని బిరుదు మల్లయ్య కుమారుడు రాములు కోర్టులో కేసు వేశారని చెప్పారు. ఈ సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి లేదనీ, 2004-2006 పహాణీ ప్రకారం సర్వే నంబర్ 70/2లోని భూమిని కరీజ్ ఖాతాగా నమోదుచేశామని తెలిపారు. కాగా కీసర సుశీల సివిల్ కోర్టులో ఇంజంక్షన్ ఆర్డర్ కోసం నమోదుచేసిన కేసును కొట్టివేయగా, తిరిగి మంచిర్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు నమోదుచేయడంతోపాటు హైకోర్టులో సైతం అప్పీలు చేశారని అన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా తమకు న్యాయంచేయాలని కలెక్టరేట్ ప్రాంగణంలో కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంపై పోలీసులు కేసు నమోదు చేశారని జేసీ తెలిపారు.

## ప్రక్షాళనతోనే భూరికార్డు భద్రం!

- అక్రమాలకు అడ్డాగా మారిన రెవెన్యూశాఖ
- అధికారం లేకున్నా రికార్డులు మారుస్తున్న సిబ్బంది.. ఆర్వోఆర్ చట్టానికి తూట్లు
- టైటిల్ గ్యారెంటీ చట్టంతోనే అవినీతికి అడ్డుకట్ట
- కఠినచర్యలు ఉండాలంటున్న నిపుణులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెవెన్యూశాఖలో అవినీతి జడలు విప్పింది. అధికారుల చేతుల్లో డబ్బు పెడితే చాలు ఎలాంటి భూమి అయినా చేతులు మారుతున్నది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన తర్వాత కూడా రికార్డులు తారుమారవుతున్నాయి. తమ భూమి రికార్డుల్లోకి ఎక్కలేదని, పాత పాస్‌పుస్తకంలో ఉన్న భూమి మాయమైందని, పట్టా భూమి మరొకరి పాస్‌బుక్‌లో నమోదైందంటూ వందల మంది తాసిల్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కష్టార్జితంతో కొన్న భూమిని పాస్‌పుస్తకంలో ఎక్కించడానికి కూడా కాసులు అడుగుతున్నారని.. ఇచ్చుకోకపోతే రికార్డులు మారుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల అవినీతి వ్యవహారం సీఎం కే చంద్రశేఖర్‌రావు వద్దకు చేరింది. దీంతో రెవెన్యూ వ్యవస్థనే పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఆయన ధృఢ నిర్ణయానికి వచ్చారు. ఇందుకు సంబంధించిన కసరత్తు మొదలుపెట్టారు. భూరికార్డులు భద్రంగా ఉండాలంటే ఈ శాఖను సంస్కరించాలని, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేని కొత్త విధానం తీసుకురావాలని భావిస్తున్నారు.

**వీఆర్వోల నుంచే అవినీతి మొదలు**

రైతుకు తాసిల్దార్‌కు మధ్య ప్రధాన సంధానకర్త వీఆర్వో. గ్రామంలో రెవెన్యూ రికార్డులు నిర్వహించడం, భూముల హద్దులను కాపాడటం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, గ్రామంలో జరుగుతున్న విషయాలు తాసిల్దార్‌కు తెలియజేయడం, తాసిల్దార్ ఉత్తర్వుల మేరకు పంచనామా నిర్వహించడం వీఆర్వో విధులు. కానీ, వారు భూసమస్యలను పరిష్కరించకపోగా ఆజ్యం పోస్తున్నారని, సహకరించాల్సిన వారే రాంబధుల్లా పట్టిపీడిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎకరానికి ఇంత అని లంచం నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు. కొంతకాలంగా 'నమస్తే తెలంగాణ' నిర్వహిస్తున్న 'ధర్మగంట'కు వీఆర్వోల అవినీతిపైనే ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. తమ భూరికార్డులు మార్చారని, పహాణీల్లో పేర్లు తొలగించారని, కొత్త పాస్‌బుక్‌లో తమ భూమిని ఎక్కించలేదని వందల ఫిర్యాదులు అందాయి. వాస్తవంగా రెవెన్యూశాఖలో కిందిస్థాయి అధికారి అయిన వీఆర్వోకు రికార్డులు మార్చి ఇతరులకు భూమిని అప్పగించే అధికారం లేదు. రికార్డ్స్ ఆఫ్ రైట్ (ఆర్వోఆర్) చట్టం సెక్షన్ 10 (ఏ) ప్రకారం తాసిల్దార్ ఉత్తర్వులు ఇవ్వకుండా భూమి రికార్డుల్లో ఎలాంటి మార్పు చేసే అధికారం వీఆర్వోతో సహా ఇతరులెవరికీ లేదు. భూమిని విక్రయించినా, వారసత్వ భూమికి విరాసత్ చేయాల్సి వచ్చినా, మ్యుటేషన్ చేసినా, వన్‌బీ పట్టా ఇవ్వాలన్నా, పహాణీలో పేరు ఎక్కించాలన్నా తాసిల్దార్ ఉత్తర్వుల ద్వారానే జరుగాలి. క్షేత్రస్థాయిలో భూమికి సంబంధించిన అతికీలకమైన మార్పులన్నింటికీ తాసిల్దార్ ఉత్తర్వులు తప్పనిసరి. వీఆర్వోపై పర్యవేక్షణకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కూడా ఉంటారు. కానీ, ఎలాంటి నిర్ణయాధికారంలేని వీఆర్వోలు మాత్రమే రికార్డులు ఎలా మారుస్తున్నారన్నది పెద్ద మిస్టరీ.

### తాసిల్దార్లూ తక్కువేమీ కాదు!

పైన చెప్పివన్నీ పార్శ్వానికి ఒకవైపు ఉంటే.. తాసిల్దార్లే వీఆర్వోలతో అక్రమాలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ వీఆర్వో రూ.4 లక్షలు లంచం తీసుకొంటూ ఏసీబీకి పట్టుబడటం, అతని సమాచారం మేరకు తాసిల్దార్ ఇంట్లో రూ.90 లక్షల నగదు దొరుకడం వంటి ఘటనలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. వీఆర్వోల అవినీతిలో పైస్థాయి అధికారులకూ భాగస్వామ్యం ఉంటుందని తెలుస్తున్నది.

**కంప్యూటర్ ఆపరేటర్ల కనుసన్నల్లో..**

రైతు పట్టాభూమి ఇతరుల చేతుల్లోకి ఎలా వెళ్తున్నది? ప్రభుత్వ భూములు పట్టాగా ఎలా మారుతున్నాయి? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో రికార్డులు కంప్యూటరీకరణ జరిగాక కొన్నిచోట్ల ఆపరేటర్లు రికార్డులు మార్చడంలో కీలకంగా మారారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నల్లగొండ జిల్లా చందపేట తాసిల్‌లో ఓ కంప్యూటర్ ఆపరేటర్ భూమికి సంబంధించిన పత్రాలను అందజేయడానికి భారీ ఎత్తున లంచం డిమాండ్ చేస్తుంటారని రైతులు 'ధర్మగంట'కు ఫిర్యాదుచేయడం గమనార్హం. డబ్బులు ఎవరిస్తే వారిపేరు రికార్డుల్లో ఎక్కిస్తారని ఆరోపణలు వచ్చాయి. వీఆర్వోలు ఆపరేటర్లతో కుమ్మక్కై తాసిల్దార్ సంతకం లేకుండానే రికార్డుల్లో మార్పులు చేస్తున్నారని అంటున్నారు.

**రికార్డుల ట్యాంపరింగ్**

భూమికి సంబంధించిన పాత రికార్డులు తాసిల్దార్ సంతకం లేకుండానే ట్యాంపరింగ్ అవుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రికార్డు రూమ్‌ల్లో ఉండే పత్రాలను తాసిల్దార్ నిత్యం పర్యవేక్షించడం సాధ్యంకాదు. దీనిని ఆసరాగా చేసుకొనే పాత రికార్డులను మారుస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీఆర్వో ఏటా మాన్యువల్ పహాణీని తయారుచేయాలి. ఇలా ఏటా జమాబందీ జరిగితే ప్రతి చిన్నమార్పు కూడా తాసిల్దార్ దృష్టికి వస్తుంది. కానీ, ఐదేండ్లకోసారి జమాబందీ జరుగడం, అదీ నామమాత్రంగా ఉండటంతో మాన్యువల్ పహాణీలో మార్పులు చేర్పులు సరిగా జరుగడం లేదు. దీంతో రికార్డుల కోసం కంప్యూటర్ పైనే ఆధారపడాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. మరోవైపు తాసిల్దార్లకు కంప్యూటర్ ఆపరేటర్లపై సరైన అజమాయిషీ లేదు. వారు బయోమెట్రిక్ సంతకాలు పెట్టాల్సి వచ్చినప్పుడు పని ఒత్తిడి కారణాల వల్ల చేతి వేలును ఒత్తిపెట్టి ఇతర పనులు చేస్తున్నారు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ ఏ మార్పులు చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఉన్నది.

**రెవెన్యూ సమూల ప్రక్షాళన చేపడితేనే..**

రైతులకు నిజాయితీగా సేవలు అందించాలన్నా, రెవెన్యూను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలన్నా సమగ్ర రెవెన్యూ చట్టం రావాలి అనే అభిప్రాయం న్యాయనిపుణుల్లో వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా టైటిల్ గ్యారెంటీ చట్టం అవసరమని చెప్తున్నారు. భూరికార్డులను నేరుగా కంప్యూటరీకరణ చేయడం కాకుండా.. సీఎం కేసీఆర్ సూచించినట్టు ముందుగా మాన్యువల్‌గా రికార్డులు రూపొందించి భద్రపర్చాలని అంటున్నారు. ఎలాంటి మార్పులు జరిగినా మాన్యువల్ రికార్డు మదర్ రికార్డుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. మాన్యువల్ రికార్డుకు భిన్నంగా, తాసిల్దార్ ఉత్తర్వులేకుండా ఏ మార్పు జరిగినా వీఆర్వో, ఆపరేటర్లను బాధ్యులను చేయాలని అంటున్నారు. తాసిల్దార్ ఉత్తర్వులు ఉంటేనే రికార్డుల్లో మార్పులు జరుగాలని.. అప్పుడే అవినీతిని అరికట్టగలుగుతామని నల్సార్ వర్సిటీ అనుబంధ ఆచార్యులు సునీల్‌కుమార్ పేర్కొంటున్నారు.

## ఈనెల 11 నుంచి తెలంగాణ అమెచ్యూర్ చెస్ టోర్నీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ఎల్బీ స్టేడియం వేదికగా ఈనెల 11 నుంచి తెలంగాణ అమెచ్యూర్ ఓపెన్ చెస్ టోర్నీ మొదలుకాబోతున్నది. రెండు రోజుల పాటు జరిగే టోర్నీలో మొత్తం ప్రైజ్‌మనీ రూ.25వేలుగా నిర్వాహకులు ప్రకటించారు. ఇందులో 2300 రేటింగ్ లోపు ఉండే పురుషులు, మహిళలు పోటీపడవచ్చు. టాప్-15 పురుషులతో పాటు టాప్-10లో నిలిచే మహిళా ఆటగాళ్లు రూ. 1000 ప్రైజ్‌మనీ పొందుతారు. అండర్ 2300, 2000, 1700 ఫిడే రేటింగ్‌లలో ఒక్కో కేటగిరీ నుంచి ఒకరు ఈనెల 20న భోపాల్‌లో మొదలయ్యే జాతీయ అమెచ్యూర్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరుపున బరిలోకి దిగేందుకు అవకాశముంటుంది. ఎంట్రీ ఫీజును రూ.600లుగా నిర్ధారించిన నిర్వాహకులు.. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9 తేది వరకు అవకాశమిచ్చారు. పూర్తి వివరాలకు 7337578899, 7337399299 లేదా www.chesstelangana.comలో సంప్రదించవచ్చని రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# స్టెయిన్ గన్ డౌన్

### టెస్టులకు గుడ్‌బై చెప్పిన సఫారీ పేసర్

**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ డెయిల్ స్టెయిన్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌పై దృష్టి పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. 2004లో ఇంగ్లండ్‌పై టెస్టు అరంగేట్రం చేసిన 36 ఏండ్ల స్టెయిన్ 93 టెస్టుల్లో 439 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఈ ఏడాది ఆరంభంలో శ్రీలంకతో సొంతగడ్డపై ఆడిన టెస్టే స్టెయిన్‌కు చివరిది. చాలా కాలం నుంచి గాయాలతో సతమతమవుతున్న స్టెయిన్ వన్డే, టీ20 క్రికెట్‌పై దృష్టి సారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాడు. 'నేనెంతగానో ఇష్టపడే టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు చెబుతున్నా. నా వరకైతే క్రికెట్‌లో టెస్టులే అత్యుత్తమం. సంప్రదాయ ఆట మనల్ని శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాల పరంగా పరీక్షిస్తుంది. ఇక మీదట టెస్టులు ఆడలేను అనే ఊహే భయంకరంగా ఉంది. కానీ అన్ని ఫార్మాట్లకు దూరమవడం కంటే ఏదో ఒకదాన్ని వదులుకోవడమే మంచిదనిపించింది. ఇక పరిమిత ఓవర్లపై దృష్టిపెడతా. ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు'అని సోమవారం డెయిల్ ప్రకటించాడు. స్టెయిన్ దక్షిణాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గానే కాకుండా.. ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో ఎనిమిదో స్థానంతో ఆటకు వీడ్కోలు పలికాడు. క్రికెట్ దక్షిణాఫ్రికా చీఫ్ థబాంగ్ మాట్లాడుతూ.. 'ప్రపంచ క్రికెట్‌లో స్టెయిన్ ఆల్‌టైమ్ గ్రేట్ అనడంలో సందేహం లేదు. నిలకడైన ఫాస్ట్ బౌలర్‌గా దక్షిణాఫ్రికా పేస్ విభాగాన్ని ముందుండి నడిపించాడు. యువ ఆటగాళ్లకు అతడు స్ఫూర్తిదాయకం'అని పేర్కొన్నాడు.

## గాయాలతో సతమతమై..

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ఒకప్పుడు వెస్టిండీస్ బౌలర్ల పేరు చెబితేనే ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ వణికిపోయేవారు. ఎంతలా అంటే పరుగులు చేయకున్నా ఫర్వాలేదు.. వారి బౌన్సర్ల నుంచి తప్పించుకుంటే చాలు అనుకునేంతలా. 21వ శతాబ్దంలో అచ్చం అలాంటి భయాన్ని కలిగించిన బౌలరే డెయిల్ విలియమ్ స్టెయిన్. ఉక్కు తీగలాంటి శరీరంతో.. నీలి కండ్లతోనే నిప్పులు చెరుగుతూ అతడు బంతిని సంధించేందుకు సిద్ధమవుతుంటే.. అదిరిపడని బ్యాట్స్‌మెన్ ఉండడంటే అతిశయోక్తి కాదు. సంప్రదాయ క్రికెట్‌లో అతడి బౌలింగ్ చూసేందుకే టీవీలకు అతుక్కుపోయే అభిమానులు కోకొల్లలు. నిలకడగా 150 కిలోమీటర్ల వేగంతో బంతులు వేయగల నైపుణ్యం ఉన్న స్టెయిన్ 2008 నుంచి 2014 మధ్య ఏకంగా 263 వారాల పాటు టెస్టు నంబర్‌వన్ బౌలర్‌గా కొనసాగాడంటే అతడి ప్రతిభ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. 2008లో ఐసీసీ టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న స్టెయిన్ తన వ్యక్తిత్వంతోనూ ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పలు జట్లకు ఆడిన స్టెయిన్.. ఈ ఏడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున బరిలో దిగాడు. ఆ సమయంలోనే భుజం గాయం తిరగబెట్టడం పరోక్షంగా అతడి టెస్టు కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టిందని చెప్పొచ్చు. 2016లో ఆస్ట్రేలియాతో సిరీస్ సందర్భంగా భుజం ఎముక విరగడంతో శస్త్రచికిత్స చేయించుకున్న స్టెయిన్ సుదీర్ఘ విరామం అనంతరం భారత్‌పై పునరాగమనం చేశాడు. 14 నెలల తర్వాత బరిలో దిగిన డెయిల్ 14 బంతుల్లోనే వికెట్ పడగొట్టి తనలో చేవ తగ్గలేదని చాటాడు. అనంతరం పాదం గాయం కారణంగా క్రికెట్‌కు దూరమైన స్టెయిన్ గతేడాది చివర్లో తిరిగి జట్టులోకి వచ్చాడు. పాకిస్థాన్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్టులో సత్తాచాటి దక్షిణాఫ్రికా తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన వీరుడిగా షాన్ పొలాక్‌ను అధిగమించాడు. రెండేండ్ల తర్వాత వన్డే జట్టులోకి వచ్చిన స్టెయిన్ గత నెలలో ముగిసిన వన్డే ప్రపంచకప్‌నకు ఎంపికైనా.. భుజం గాయం తిరగబెట్టడంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే శస్త్ర చికిత్సలతో విసిగి వేసారిన ఈ పేసర్ ఇక లాభం లేదంటూ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు.

# ప్రయోగాలకు వేళాయె

రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించే చాన్స్

నేడు వెస్టిండీస్‌తో భారత్ చివరి టీ20

రాత్రి గం.8 నుంచి సోనీ టెన్-1, 3ల్లో



**క్లీన్‌స్వీప్ చేయాలని ఒకరు.. వైట్‌వాష్ నుంచి తప్పించుకోవాలని మరొకరు.. వన్డే సిరీస్‌కు ముందు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని టీమ్‌ఇండియా.. అచ్చొచ్చిన ఫార్మాట్‌లో అవమానకర ఓటమి నుంచి తప్పించుకోవాలని వెస్టిండీస్. ఇప్పటికే సిరీస్ సొంతమైన తరుణంలో రిజర్వ్ బెంచ్‌కు చాన్స్ ఇవ్వాలని విరాట్ సేన భావిస్తుంటే.. సీనియర్లు గాడిన పడాలని విండీస్ కోరుకుంటున్నది. బౌలర్లు రాణిస్తున్నా.. మిడిలార్డర్ సమస్య తీరకపోవడంతో ఈ మ్యాచ్‌లో దానికి పరిష్కారం కనుక్కోవాలని టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ కోరుకుంటున్నది. అగ్రరాజ్యంలో సత్తాచాటలేకపోయిన కరీబియన్లు సొంతగడ్డపై ఏ మేరకు రాణిస్తారో చూడాలి.**

**గయానా:** పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ వెస్టిండీస్‌పై మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ చేజిక్కించుకున్న టీమ్‌ఇండియా.. ప్రయోగాలకు సిద్ధమవుతున్నది. వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమి అనంతరం ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన విరాట్ సేన.. రిజర్వ్ బెంచ్ బలాన్ని పరీక్షించుకోవాలని అనుకుంటున్నది. వచ్చే ఏడాది జరుగనున్న టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకునేందుకు ఇదే సరైన తరుణంగా యోచిస్తున్నది. మంగళవారం గయానా వేదికగా జరుగనున్న చివరిదైన మూడో టీ20లో భారత్ పలుమార్పులు చేయనున్నది. తొలి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న లోకేశ్ రాహుల్, శ్రేయస్ అయ్యర్‌తో పాటు.. బౌలింగ్ విభాగంలో చాహర్ బ్రదర్స్.. దీపక్ చాహర్, రాహుల్ చాహర్‌కు అవకాశం కల్పించనుంది. వీరి కోసం ఎవరిని పక్కన పెడతారనేది ఆసక్తికరంగా మారింది. తొలి టీ20లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన కోహ్లీ అండ్ కో.. రెండో మ్యాచ్‌లో సత్తాచాటింది. పరీక్ష పెడుతున్న పిచ్‌పై మంచి స్కోరు సాధించి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి గెలిచింది. మరోవైపు అమెరికా వేదికగా జరిగిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన కరీబియన్లు సొంతగడ్డపైనైనా సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. స్టార్ ప్లేయర్లు క్రిస్ గేల్, రస్సెల్ అందుబాటులో లేకపోవడంతో ఆ జట్టు ఒకింత డీలా పడితే.. ఎన్నో అంచనాలు పెట్టుకున్న లూయిస్, హెట్‌మైర్, పూరన్ వరుసగా విఫలం కావడం యాజమాన్యాన్ని బాధిస్తున్నది. కెప్టెన్ బ్రాత్‌వైట్ స్థాయికి తగ్గట్లు ఆడలేకపోవడం కూడా ఫలితంపై ప్రభావం చూపుతున్నది. వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు చివరి మ్యాచ్‌లోనైనా టీమ్‌ఇండియాకు గట్టి పోటీ ఇచ్చేందుకు విండీస్ అస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నది.

### పిచ్, వాతావరణం

మ్యాచ్ ఆరంభానికి ముందు ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశముంది. గత రెండు మ్యాచ్‌లు ఆడిన ఫ్లోరిడా పిచ్‌కు ఇక్కడి వికెట్‌కు మధ్య సారూప్యత కనిపిస్తున్నది. మందకొడి పిచ్‌పై పరుగుల ప్రవాహం కష్టమే.

### అయ్యర్ ఇన్.. మనీశ్ ఔట్..!

వన్డే ప్రపంచకప్‌లో ఐదు శతకాలు బాది జోరుమీదున్న ఓపెనర్ రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌లోనూ ఊపు కొనసాగిస్తుంటే.. గాయం కారణంగా మెగాటోర్నీకి దూరమైన శిఖర్ ధావన్ మాత్రం ఇప్పటి వరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీ గత రెండు మ్యాచ్‌ల్లో ఫర్వాలేదనిపించినా.. కీలక సమయాల్లో ఔటవడం కలవరపెడుతున్నది. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్న యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ పూర్తిగా నిరాశపరుస్తున్నాడు. తొలి మ్యాచ్‌లో క్రీజులోకి వచ్చిరాగానే భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. రెండో మ్యాచ్‌లో షార్ట్‌పిచ్ బంతికి దొరికిపోయాడు. వైఫల్యాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనుకుంటే.. పంత్ ఈ మ్యాచ్‌లో భారీ ఇన్నింగ్స్ ఆడాల్సిందే. రెండో మ్యాచ్ అనంతరం కోహ్లీ మాట్లాడుతూ.. సిరీస్ వశమైపోయింది కాబట్టి ప్రయోగాలు చేసే చాన్స్ ఉందని చెప్పాడు. దీన్ని బట్టి తుది జట్టు కూర్పులో మార్పులు ఉండే అవకాశాలెక్కువ. చాన్నాళ్ల తర్వాత జట్టులో చోటు దక్కించుకున్న మనీశ్ పాండే ఆకట్టుకోలేకపోయాడు. దీంతో గత మ్యాచ్‌ల్లో బెంచ్‌కే పరిమితమైన శ్రేయస్ అయ్యర్‌కు తుది జట్టులో చోటు ఖాయమే. బౌలింగ్, బ్యాటింగ్‌లో ఆకట్టుకుంటున్న కృనాల్ పాండ్యాను కొనసాగించి.. సీనియర్ రవీంద్ర జడేజాకు విశ్రాంతినివ్వొచ్చు. ఐపీఎల్‌తో అందరి దృష్టిలో పడ్డ యువ స్పిన్నర్ రాహుల్ చాహర్ అరంగేట్రం చేసే చాన్స్ ఉంది. సైనీకి విశ్రాంతినిచ్చి దీపక్ చాహర్‌ను ఆడించొచ్చు. భువనేశ్వర్, ఖలీల్‌లు ఆకట్టుకుంటుండటం టీమ్‌ఇండియాకు కలిసొచ్చే అంశం.

> విజయం అన్నింటికంటే ముఖ్యం. తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలువడంతో సిరీస్ సొంతమైంది. ఇక మరిన్ని ప్రయోగాలు చేసేందుకు అవకాశం ఉన్నట్లే
> **- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్**

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, ధవన్/రాహుల్, కోహ్లీ (కెప్టెన్), పంత్ (వికెట్ కీపర్), పాండే/ అయ్యర్, కృనాల్, జడేజా/సుందర్, దీపక్ చాహర్, భువనేశ్వర్, ఖలీల్, రాహుల్ చాహర్.

**వెస్టిండీస్:** క్యాంప్‌బెల్/లూయిస్, నరైన్, పూరన్/బ్రాంబ్లే (వికెట్‌కీపర్), హెట్‌మైర్, పొలార్డ్, పావెల్, బ్రాత్‌వైట్ (కెప్టెన్), పాల్, పియర్, కాట్రెల్, థామస్.

### సొంతగడ్డపై సత్తాచాటాలని..

విండీస్ గత కొంతకాలంగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నది. భారత్‌తో ఆడిన చివరి ఐదు టీ20ల్లోనూ కరీబియన్లను పరాజయమే వెక్కిరించింది. ఈ నేపథ్యంలో వన్డే, టెస్టు సిరీస్‌ల ప్రారంభానికి ముందు చివరి టీ20లో గెలిచి ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలని విండీస్ భావిస్తున్నది. ఓపెనర్ల వైఫల్యం కొనసాగడం కరీబియన్లకు ఎదురుదెబ్బ కాగా.. చక్కటి నైపుణ్యం ఉన్న హెట్‌మైర్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో కింద పంపించడం ఆ జట్టుకు ప్రతికూలంగా మారింది. ఐపీఎల్ తరహాలో గత మ్యాచ్‌లో నరైన్‌ను ఓపెనర్‌గా బరిలో దింపినా.. ఫలితం మాత్రం శూన్యం. గేల్, రస్సెల్ గైర్హాజరీలో జట్టులో పాతుకుపోయేందుకు పూరన్, పావెల్, క్యాంప్‌బెల్‌కు ఇదే చక్కటి అవకాశం. మరి వారు ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటారో చూడాలి. ముఖ్యంగా కెప్టెన్ బ్రాత్‌వైట్ గాడిన పడాల్సిన అవసరముంది. బ్యాటింగ్‌తో పోల్చుకుంటే విండీస్ బౌలింగ్ విభాగం ఫర్వాలేదనిపిస్తున్నది. కాట్రెల్, థామస్, కీమో పాల్ అంచనాలకు తగ్గట్లు రాణిస్తున్నారు.

**5-0** విండీస్‌తో ఆడిన గత ఐదు టీ20ల్లోనూ టీమ్‌ఇండియానే విజయం వరించింది.

## సైనీకి డీమెరిట్ పాయింట్



**లాడర్‌హిల్ (ఫ్లోరిడా):** విండీస్‌తో తొలి టీ20లో అరంగేట్రం చేసిన భారత యువ పేస్ బౌలర్ నవ్‌దీప్ సైనీ మూడు వికెట్లతో అద్భుత ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. అయితే అదే మ్యాచ్‌లో దురుసైన ప్రవర్తన కనబరిచాడన్న కారణంతో సైనీకి మ్యాచ్ రిఫరీ ఓ డీమెరిట్ పాయింట్‌ను విధించాడు. ఆ మ్యాచ్‌లో విండీస్ మొదటి బ్యాటింగ్ చేస్తుండగా నికోలస్ పూరన్‌ను సైనీ ఔట్ చేశాడు. పూరన్ మైదానం వీడుతున్న సమయంలో నవ్‌దీప్ ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ దురుసైన ప్రవర్తన కనబరిచాడని అంపైర్లు ఫిర్యాదు చేశారు. తన చర్యను సైనీ సైతం అంగీకరించడంతో ఎలాంటి విచారణ లేకుండానే మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో ఓ డీమెరిట్ పాయింట్ విధించాడు.

## వెటోరి జెర్సీకి రిటైర్మెంట్



**వెల్లింగ్టన్:** అంతర్జాతీయ క్రికెట్ ఆడే సమయంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ డానియల్ వెటోరి వినియోగించిన జెర్సీ నంబర్-11కు ఆ దేశ బోర్డు రిటైర్మెంట్ ప్రకటించింది. ఒక్క వెటోరి విషయంలోనే కాకుండా.. కివీస్ తరపున 200కు పైగా వన్డేలు ఆడిన ఆటగాళ్ల జెర్సీ నంబర్లను తిరిగి ఎవరికీ కేటాయించకుండా ఆ దేశ బోర్డు నిర్ణయం తీసుకుంది. 'న్యూజిలాండ్ తరపున 200 వన్డేలు ఆడిన ఆటగాళ్ల జెర్సీ నంబర్లకు రిటైర్మెంట్ ఇస్తున్నాం. వెటోరి 11వ నంబర్ జెర్సీతో దేశం తరపున 291 వన్డేలు ఆడాడు. అందుకే ఆ నంబర్‌ను ఇక మీదట ఎవరికీ ఇవ్వకూడదని నిర్ణయించాం'అని బోర్డు తెలిపింది.

## క్రికెట్‌కు మెకల్లమ్ వీడ్కోలు



**ఆక్లాండ్:** న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ అన్ని రకాల ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు సోమవారం ప్రకటించాడు. కెనడా గ్లోబల్ టీ20 టోర్నీలో ప్రస్తుతం టొరంటో నేషనల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మెకల్లమ్‌కు తనకు ఇదే ఆఖరిదని తెలిపాడు. 2016లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ 37 ఏండ్ల కివీస్ క్రికెటర్ అప్పటి నుంచి పలు టీ20 లీగ్‌లలో ఆయా జట్లకు ఆడుతూ వచ్చాడు. 'అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్ల నుంచి వైదొలుగడం గౌరవంతో పాటు సంతృప్తిగా ఉంది. యూరో టీ20 స్లామ్‌లో నేను తిరిగి ఆడను' అని మెకల్లమ్ ట్వీట్ చేశాడు.



# ఆసీస్.. అదరహో

- యాషెస్ తొలి టెస్టులో ఘన విజయం
- ఆరు వికెట్లతో లియాన్ విజృంభణ
- 146 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్

**ప్రపంచకప్ విజయం తర్వాత సొంతగడ్డపై ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ తొలి టెస్టులో చేష్టలుడిగిపోయింది. ఆసీస్ స్టార్ బ్యాట్స్‌మన్ స్మిత్ సూపర్ సెంచరీలకు తోడు రెండో ఇన్నింగ్స్‌లో కంగారూ స్పిన్నర్ లియాన్ విజృంభణతో రూట్‌సేన ఖంగుతింది. చివరి రోజు కనీస పోరాటం చేయలేక టీ విరామానికి ముందే కుప్పకూలిపోయింది. 251 పరుగుల తేడాతో భారీ పరాజయాన్ని చవిచూసింది.**

**బర్మింగ్‌హామ్:** ఇంగ్లిష్ గడ్డపై యాషెస్ సిరీస్ తొలి టెస్టులో ఆస్ట్రేలియా అదరగొట్టింది. ఆతిథ్య ఇంగ్లండ్‌ను 251 పరుగుల భారీ తేడాతో ఓడించి... ప్రపంచకప్ సెమీఫైనల్ ఓటమికి కాస్త ప్రతీకారం తీర్చుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో నిలిచి.. 14 ఏండ్ల తర్వాత ఇంగ్లండ్ గడ్డపై యాషెస్ సిరీస్‌లో ఆధిక్యం సాధించింది. 398 పరుగుల లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోర్ 13/0తో చివరి రోజైన సోమవారం బరిలోకి దిగిన ఇంగ్లిష్ జట్టు... ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియాన్(6/49), పేసర్ కమిన్స్(4/32) ధాటికి 146 పరుగులకే కుప్పకూలిపోయింది. తొమ్మిదో స్థానంలో వచ్చిన క్రిస్ వోక్స్(37; 54 బంతులు, 7ఫోర్లు) ఇంగ్లిష్ జట్టు టాప్‌స్కోరర్ కాగా... జేసన్ రాయ్(28; 58 బంతులు, 4ఫోర్లు), కెప్టెన్ జో రూట్(28; 57 బంతులు, 3ఫోర్లు) మాత్రమే కాసేపు నిలబడగలిగారు. మరోవైపు రెండు ఇన్నింగ్స్‌లో శతకాలు సాధించి ఆసీస్ విజయంలో ప్రధాన పాత్ర పోషించిన స్టీవ్ స్మిత్(144, 142)కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

### గర్జించిన లియాన్..

మ్యాచ్ చివరి రోజు.. కష్టతరంగా మారిన పిచ్... కండ్ల ముందు కొండంత లక్ష్యం.. కనీసం డ్రా కోసమైనా పోరాడదామని బరిలోకి దిగిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఏ మాత్రం నిలువలేకపోయారు. ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియాన్, పేసర్ కమిన్స్ గర్జనతో గజగజలాడిపోయారు. ఓవర్‌నైట్ స్కోరు 13/0తో ఇంగ్లండ్ ఓపెనర్లు రోరీ బర్న్స్, జేసన్ రాయ్ బరిలోకి దిగారు. తన 7పరుగుల ఓవర్‌నైట్ స్కోరుకు 4రన్స్ మాత్రమే జోడించిన బర్న్స్... కమిన్స్ బౌలింగ్‌లో కాసేపటికే ఔటయ్యాడు. ఆ తర్వాత రాయ్‌తో కలిసి కెప్టెన్ రూట్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. రెండో వికెట్‌కు 41 పరుగులు జోడించాక భారీ షాట్ ఆడేందుకు ముందుకొచ్చిన రాయ్(28).. లియాన్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. ఆ తర్వాత వచ్చిన డెన్లీ(11)ని, కుదురుగా ఆడుతున్న రూట్(28)ను లియాన్ వెనక్కి పంపాడు. అక్కడితో భోజన విరామ సమయానికి 85/4 వద్ద ఇంగ్లండ్ నిలిచింది. ఆట ప్రారంభమైన కాసేపటికే బట్లర్(1)ను కమిన్స్ బౌల్డ్ చేశాడు. ఓ దశలో 2వికెట్లకు 60 వద్ద ఉన్న ఇంగ్లిష్ జట్టు ఏకంగా 85/5కు పడిపోయింది. ఇక ఆ తర్వాత జానీ బెయిర్‌స్టో, బెన్ స్టోక్స్ కూడా చెరో ఆరుపరుగులే చేసి పెవిలియన్ చేరారు. ఆ స్థితిలో క్రిస్ వోక్స్(37).. మొయిన్ అలీ(4) సాయంతో ఇన్నింగ్స్‌ను నిలిపే ప్రయత్నం చేశాడు. అయితే కాసేపటికే అలీని వెనక్కిపంపిన లియాన్ ఐదో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాతి బంతికే బ్రాడ్‌ను ఔట్ చేయగా.. కాసేపటికే వోక్స్‌ను కమిన్స్ పెవిలియన్‌కు చేర్చడంతో 146 పరుగులకే టీ విరామం కంటే ముందే ఇంగ్లండ్ ఆలౌటైంది. ఆసీస్ 251 పరుగులతో ఘన విజయం సాధించింది.

**1** 2001 తర్వాత ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఏ ఫార్మాట్లోనైనా ఆసీస్‌కు ఇదే తొలి విజయం.

**సంక్షిప్త స్కోర్లు**

**తొలి ఇన్నింగ్స్ :** ఆస్ట్రేలియా 284 ఆలౌట్, ఇంగ్లండ్ 374 ఆలౌట్

**రెండో ఇన్నింగ్స్ :** ఆస్ట్రేలియా 487/7 డిక్లేర్డ్, ఇంగ్లండ్ 146 ఆలౌట్(వోక్స్ 37; లియాన్ 6/49, కమిన్స్ 4/32)



లియాన్ (6/49)

**8** ఈ మ్యాచ్‌లో అంపైర్ విల్సన్ ఇచ్చిన ఎనిమిది నిర్ణయాలు డీఆర్‌ఎస్‌లో తప్పుగా తేలాయి.

**350** రెండో ఇన్నింగ్స్‌లో స్టోక్స్‌ను ఔట్ చేయడం ద్వారా ఆస్ట్రేలియా బౌలర్ లియాన్ టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.



## సుధాకర్ రెడ్డి హఠాన్మరణం

**ఖమ్మం, మయూరీ సెంటర్:** సీనియర్ బ్యాడ్మింటన్ కోచ్ గుజ్జుల సుధాకర్ రెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. పోలండ్‌లో జరుగుతున్న ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరపున సుధాకర్ బరిలోకి దిగాడు. మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్ అనంతరం హోటల్ రూమ్‌కు వెళ్లిన ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సుధాకర్ మృతి పట్ల పలువురు, కోచ్‌లు,క్రీడాభిమానులు, సహచర ఆటగాళ్లు సంతాపం తెలిపారు.

## జైపూర్‌కు ఢిల్లీ షాక్

**పాట్నా:** ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ అజేయ యాత్రకు ఢిల్లీ దబంగ్ బ్రేకులు వేసింది. సోమవారమిక్కడి పాటలీపుత్ర ఇండోర్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో జైపూర్‌ను 35-24తో ఢిల్లీ మట్టికరిపించింది. దబంగ్ రైడర్లు నవీన్ కుమార్12, చంద్రన్ రంజిత్ 10పాయింట్లు సాధించారు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఢిల్లీ అగ్రస్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ 33-31 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై విజయం సాధించింది.



## కపిల్ కమిటీకి సీవోఏ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ:** కపిల్‌దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ)కి పరస్పర విరుద్ధ ప్రయోజనాల విషయంలో క్రికెట్ పరిపాలకుల కమిటీ(సీవోఏ) సోమవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో తదుపరి టీమ్‌ఇండియా చీఫ్ కోచ్‌ను ఎంపిక చేసేందుకు కపిల్ కమిటీకి మార్గం సుగమమైంది. ఈనెల ఆఖరు వరకు చీఫ్ కోచ్ ఎవరనేది తేలనుంది. ఇదిలా ఉంటే సీవోఏ తీసుకున్న నిర్ణయంపై సభ్యురాలు డయానా ఎడుల్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎథిక్స్ ఆఫీసర్ అని సీవోఏకు అలాంటి అధికారం లేదని పేర్కొంది. రాజ్యాంగంలో అడ్‌హక్ కమిటీ నియామకానికి ఎలాంటి చోటు లేదంటూ ఎడుల్జీ విమర్శలు ఎక్కుపెట్టింది. మహిళల చీఫ్ కోచ్ నియామకంలోనూ ఎడుల్జీ సీవోఏ నిర్ణయాన్ని తప్పుబట్టిన సంగతి తెలిసిందే.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 36,700 | 10,863 |
| ↘418 | ↘135 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 59.77 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 36,970 |
| 22 క్యారెట్లు | 36,800 |
| వెండి (కిలో) | 43,100 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 67.50 | 73.00 |
| యూరో | 74.50 | 81.00 |
| బహ్రెయిన్ దినార్ | 176.00 | 190.00 |
| కువైట్ దినార్ | 220.50 | 232.50 |
| సౌదీ రియాల్ | 17.50 | 19.30 |
| యూఏఈ దిర్హామ్ | 18.20 | 19.90 |

## నాట్కో కొత్తూరు ప్లాంట్ ఓకే

**హైదరాబాద్, ఆగస్టు 5:** రాష్ర్టానికి చెందిన నాట్కో ఫార్మాకు అమెరికా నియంత్రణ మండలి యూఎస్ఎఫ్‌డీఏ శుభవార్తను అందించింది. రాష్ట్రంలోని కొత్తూరు వద్ద ఉన్న ఔషధ ప్లాంట్‌కు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ ఎఫ్‌డీఏ) ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంచేయలేదు. మే 30 నుంచి జూన్ 5 వరకు ప్లాంట్‌ను తనిఖీ చేసిన యూఎస్ఎఫ్‌డీఏ అధికారులు పూర్తిస్థాయిలో సంతృప్తిచెందినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది.

# బెంబేలెత్తిన మార్కెట్లు

- భీకర అమ్మకాల ఒత్తిడిలో దేశీయ స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 418, నిఫ్టీ 135 పాయింట్లు పతనం

**వాణిజ్య యుద్ధం, ఎఫ్‌పీఐ పెట్టుబడుల ఉపసంహరణలకుతోడైన కశ్మీర్ ఉద్రిక్తతలు**

**ముంబై, ఆగస్టు 5:**

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధ భయాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) పెట్టుబడుల ఉపసంహరణలకు కశ్మీర్ ఉద్రిక్తతలు కూడా తోడవడంతో సూచీలు భీకర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 418.38 పాయింట్లు పతనమై 37 వేల మార్క్‌కు దిగువన 36,699.84 వద్ద ముగిసింది. ఒకానొక దశలోనైతే 700 పాయింట్లకుపైగా పడిపోయి 36,416.79 పాయింట్లను తాకింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం 134.75 పాయింట్లు క్షీణించి 10,862.60 వద్ద స్థిరపడింది. దీంతో సూచీలు ఐదు నెలల కనిష్ఠాన్ని తాకినట్లైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్)గాను కార్పొరేట్ సంస్థలు ప్రకటిస్తున్న ఆర్థిక ఫలితాలు ఆకట్టుకునే స్థాయిలో లేకపోవడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'మార్కెట్ ఒడిదుడుకులకు ఒక్కటే కారణం కాదు. జమ్ము కశ్మీర్‌లో రాజకీయ సంక్షోభం, ఎఫ్‌పీఐ పెట్టుబడుల ఉపసంహరణలు, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం.. మదుపరులను లాభాల స్వీకరణకు ఉసిగొల్పాయి' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

**ఐటీ మినహా అన్ని రంగాలు ఢమాల్**

ఐటీ మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు సోమవారం ట్రేడింగ్‌లో నష్టపోయాయి. ఇంధన షేర్లు అత్యధికంగా 2.7 శాతం దిగజారగా, మెటల్, బ్యాంకింగ్, ఆటో, ఎఫ్ఎంసీజీ, మౌలిక, ఔషధ రంగాల షేర్లు 2 శాతం వరకు పడిపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు 1 శాతానికిపైగా దిగజారాయి. షేర్లవారీగా చూస్తే యెస్ బ్యాంక్ అత్యధికంగా 8.15 శాతం క్షీణిస్తే.. టాటా మోటర్స్ 5.25 శాతం, పవర్‌గ్రిడ్ 4.42 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.48 శాతం, కొటక్ మహీంద్రా బ్యాంక్ 3.13 శాతం చొప్పున పతనమయ్యాయి. భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఆటో షేర్లు లాభాలను అందుకున్నా.. సూచీలను నిలబెట్టలేకపోయాయి.



## ప్రపంచ మార్కెట్లు కుదేలు

ప్రపంచ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో కదలాడాయి. చైనా కరెన్సీ యువాన్ విలువ భారీ పతనంతో ఆసియా, ఐరోపాల్లోని ప్రధాన సూచీలు క్షీణించాయి. అమెరికాలోకి దిగుమతి అవుతున్న చైనా వస్తు, ఉత్పత్తుల్లో మరో 300 బిలియన్ డాలర్ల విలువైన వాటిపై వచ్చే నెల ఆరంభం నుంచి టారీఫ్‌లు అమల్లోకి వస్తాయని అగ్ర రాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ఈ ఒక్కరోజే యువాన్ విలువను దాదాపు పన్నెండేండ్లలో ఎన్నడూ లేనంత స్థాయికి దిగజార్చింది. ఈ ప్రభావం చైనా (1.6 శాతం) స్టాక్ మార్కెట్లతోపాటు, హాంకాంగ్ (2.9 శాతం), జపాన్ (1.7 శాతం), దక్షిణ కొరియా (2.56 శాతం) దేశాల సూచీలపై పడింది. బ్రిటన్ (2 శాతం), జర్మనీ (1.6 శాతం), ఫ్రాన్స్ (2 శాతం) సూచీలు కూడా క్షీణించాయి.



# మెరిసిన పసిడి

- 37 వేలకు చేరువైన బంగారం
- ఒకేరోజు రూ.800 పెరిగిన తులం ధర
- వెయ్యి రూపాయలు ఎగబాకిన వెండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:**

పసిడి మరింత పరుగులు పెట్టింది. అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధమేఘాలు మరింత ముదురుతుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాలకు మళ్లించడంతో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర ఒకేరోజు రూ.800 ఎగిసి రూ.36,970 పలికింది. బంగారంతోపాటు వెండి మరింత పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించడంతో కిలో వెండి ధర ఏకంగా రూ.1,000 ఎగబాకి రూ.43,100కి చేరుకున్నది. మే 2013 తర్వాత పసిడి ధరలు భారీగా పెరుగడం ఇదే తొలిసారని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. అమెరికా-చైనా దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడం, ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో పసిడి మరింత మెరిసిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర జైన్ తెలిపారు. దేశ చరిత్రలో బంగారం ధర రూ.36,970కి చేరుకోవడం ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. 300 బిలియన్ డాలర్ల విలువైన చైనా ఉత్పత్తులపై సుంకాలను విధించనున్నట్లు అమెరికా గత వారం ప్రకటించడంతో మదుపరుల్లో ఆందోళన తీవ్రమైంది. దీంతో వారి పెట్టుబడులు అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1.13 శాతం బలపడి 1,457.30 డాలర్ల వద్దకు చేరుకోగా, వెండి 1.51 శాతం ఎగబాకి 16.53 డాలర్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో మే 2013 తర్వాత గరిష్ఠ స్థాయికి చేరుకోవడం ఇదే ప్రథమమని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ హరీష్ వీ తెలిపారు. ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం, వాణిజ్య యుద్ధమేఘాలు, ఆసియా స్టాక్ మార్కెట్లు భారీ పతనంతో డాలర్ విలువ మరింత బలోపేతం కావడం బంగారం ధర మరింత పెరుగడానికి ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించారు.

# రూపాయికి యువాన్ షాక్




- ఒక్కరోజే రూపాయికిపైగా విలువ ఆవిరి
- ఆరేండ్లలో ఇదే అతిపెద్ద పతనం
- 70.73 వద్దకు చేరిక

**ముంబై, ఆగస్టు 5:**

రూపాయి విలువ దారుణంగా పడిపోయింది. డాలర్‌తో పోల్చితే సోమవారం ఒక్కరోజే రూపాయికిపైగా పతనమైంది. చైనా కరెన్సీ యువాన్ విలువ భారీగా క్షీణించడంతో ఆ ప్రభావం భారతీయ కరెన్సీపైనా పడింది. దీంతో 113 పైసలు దిగజారి 70.73 వద్ద నిలిచింది. ఇది ఐదు నెలల కనిష్ఠం కావడం గమనార్హం. ఇక గడిచిన ఆరేండ్లలో కేవలం ఒక్కరోజులో ఈ స్థాయిలో రూపాయి విలువ నష్టపోవడం ఇదే ప్రథమం. కాగా, రూపాయి నష్టాలు వరుసగా ఇది మూడోరోజు. అంతకుముందు రెండు రోజుల నష్టాలనూ కలిపితే మొత్తం గత మూడు రోజుల్లో రూపాయి విలువ 194 పైసలు కరిగిపోయింది. ఇటీవలికాలంలో దేశ, విదేశీ పరిణామాలు రూపాయి ఉసురు తీస్తున్న విషయం తెలిసిందే.

**యువాన్‌కు ట్రేడ్ వార్ సెగ**

అమెరికాతో వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చుతుండటంతో చైనా కరెన్సీ యువాన్ విలువ రికార్డు స్థాయిలకు పతనమవుతున్నది. సోమవారం 7 శాతానికిపైగా యువాన్ విలువ దిగజారింది. 2008 నుంచి గమనిస్తే ఒక్కరోజే ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి. అమెరికాలోకి దిగుమతి అవుతున్న చైనా వస్తు, ఉత్పత్తుల్లో మరో 300 బిలియన్ డాలర్ల విలువైన వాటిపై సెప్టెంబర్ 1 నుంచి సుంకాలు అమల్లోకి వస్తాయని గురువారం ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. శుక్రవారం చైనా సైతం ప్రతీకార సుంకాలుంటాయని హెచ్చరించిన సంగతీ విదితమే.

**తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు**

భారతీయ మార్కెట్ నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు.. అటు స్టాక్ మార్కెట్లనేగాక, ఇటు రూపాయి విలువనూ బలి తీసుకుంటున్నాయి. బడ్జెట్‌లో సంపన్నులపై సెస్సు ప్రకటన.. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ)ను భయపెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను గత నెల 5న లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి విదితమే. ఈ క్రమంలోనే ఈ సెస్సు ప్రకటన రాగా, అప్పట్నుంచి పెట్టుబడులను ఎఫ్‌పీఐలు వెనుకకు తీసుకుంటూనే ఉన్నారు. గడిచిన నెల రోజుల్లో రూ.6 వేల కోట్లకుపైగా పెట్టుబడులు బయటకుపోగా, ఈ నెలలోని మూడు సెషన్లలోనే రూ.3 వేల కోట్లకుపైగా వెనుకకుపోవడం గమనార్హం. ఈ పరిణామం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తున్నదని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరుగుతున్నదని, దీనివల్ల కూడా రూపాయి పతనమవుతున్నదని పేర్కొన్నాయి.

## మూడేండ్లలో పది కోట్ల ప్రయాణికులు

- విస్తరణ దిశగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** జీఎంఆర్ గ్రూపు నిర్వహిస్తున్న ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ విస్తరణ పనులు చురుగ్గాసాగుతున్నాయి. 2022 నాటికి ఈ విమానాశ్రయంగుండా 10 కోట్ల మంది ప్రయాణికుల లక్ష్యంగా నిర్దేశించుకున్న సంస్థ.. ఆ దిశగా చర్యలను వేగవంతం చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్ట్ నుంచి 7.5 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. 'ఫేస్ 3ఏ' విస్తరణలోభాగంగా ఈ విమానాశ్రయంలో నాలుగో రన్‌వేను, టీ1 అప్రాన్ స్థలం, రెండు ట్యాక్సీవేలు నిర్మాణాలు 2022 నాటికి పూర్తికావచ్చునని పేర్కొంది. ఇందు కోసం సంస్థ రూ.9,800 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు జీఎంఆర్ గ్రూపు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ ప్రభాకర రావు తెలిపారు. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో జీఎంఆర్ గ్రూపునకు 54 శాతం వాటా ఉన్నది. ఈ మూడో ఫేజ్ విస్తరణ పనులను ఎల్ అండ్ టీ నిర్వహిస్తున్నది.

## ఇండియన్ బ్యాంక్ లాభం 365 కోట్లు



**చెన్నై, ఆగస్టు 5:** ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్ మధ్యకాలానికిగాను బ్యాంక్ రూ.365.37 కోట్ల లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.209.31 కోట్లతో పోలిస్తే 74.55 శాతం అధికం. మార్చి 31, 2019తో ముగిసిన ఏడాది కాలానికి నమోదైన రూ.321.95 కోట్లతో పోలిస్తే ఇది అధికమని బ్యాంక్ ఎండీ, సీఈవో పద్మజా చుండురు తెలిపారు. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.5,131.96 కోట్ల నుంచి రూ.5,832.11 కోట్లకు పెరిగినట్లు చెప్పారు. మార్చి 31 నాటికి ఇది రూ. 21,067. 70 కోట్లుగా ఉన్నది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం, బకాయిల వసూళ్లు పుంజుకోవడంతో లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని, ఎన్‌పీఏలను తగ్గించడానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నప్పటికీ గత త్రైమాసికంలో రూ.1,035 కోట్లు మొండి బకాయిల జాబితాలోకి చేరాయని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె చెప్పారు. ప్రస్తుత, వచ్చే త్రైమాసికాల్లో రూ.800 కోట్ల నుంచి రూ.900 కోట్ల వరకు రుణాలను రికవరీ చేయాలనుకుంటున్నట్లు తెలిపారు.

## ఒకినవా స్కూటర్‌పై రూ.8,600 తగ్గింపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** విద్యుత్‌తో నడిచే స్కూటర్ల తయారీ సంస్థ ఒకినవా స్కూటర్స్..సోమవారం తన స్కూటర్ల ధరలను రూ.8,600 వరకు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈవీలపై జీఎస్టీని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో కంపెనీ స్కూటర్ల ధర రూ.2,500 నుంచి రూ.4,700 వరకు తగ్గగా, లియాన్ రేంజ్ బ్యాటరీలు రూ.3,400 నుంచి రూ.8,600 వరకు తగ్గనున్నాయి. ప్రస్తుతం సంస్థ రూ.37 వేలు మొదలుకొని రూ.1.08 లక్షల లోపు ధర కలిగిన పలు మోడళ్లను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, ఎండీ జీతేందర్ శర్మ మాట్లాడుతూ..ఈవీల వాడకాన్ని పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అనుకూలంగా ఉన్నాయని, జీఎస్టీ రేటును తగ్గించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

# వడ్డీరేట్లపై సమీక్షిస్తాం..!

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశంలో బ్యాంకర్ల హామీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** రుణాల వడ్డీరేట్ల తగ్గింపుపై సమీక్షించడానికి బ్యాంకర్లు అంగీకరించారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంక్ అధిపతులతోపాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, కొటక్ మహీంద్రా, సిటీ బ్యాంక్‌ల ప్రతినిధులతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం సమావేశమయ్యారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను గత మూడు ద్రవ్యసమీక్షల్లో 75 బేసిస్ పాయింట్ల మేర తగ్గించినా.. ఆ స్థాయిలో ఖాతాదారులకు బ్యాంకులు ప్రయోజనాన్ని అందించని విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ సందర్భంగా దీనిపై బ్యాంకర్లతో మంత్రి చర్చించారు. రుణ వృద్ధితోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)లు, ఆటో పరిశ్రమకు రుణాలు, డిజిటైజేషన్, సేవా పన్ను ఆధారిత అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. 'రుణ లభ్యత, ముఖ్యంగా ఆటో రంగం, ఎంఎస్ఎంఈలకు రుణాలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, హౌసింగ్ ఫైనాన్సింగ్ సంస్థ (హెచ్ఎఫ్‌సీ)లతో కలిసి పనిచేయడం వంటి అంశాలపై చర్చ జరిగింది' అని కుమార్ చెప్పారు. వ్యవస్థలో నగదు కొరత అంశాలపైనా చర్చ జరుగగా, ఈ సమావేశానికి ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ ఎన్ఎస్ విశ్వనాథన్ కూడా హాజరైయ్యారు.

**ఎఫ్‌పీఐలతో చర్చిస్తాం: సీతారామన్**

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) ప్రతినిధులతో త్వరలోనే ప్రభుత్వం చర్చిస్తుందని సీతారామన్ తెలిపారు. కొందరు ఎఫ్‌పీఐలపై సర్‌చార్జీని విధించడంతో గత నెల రోజులుగా దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు భారీగా తరలిపోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌పీఐలతో చర్చిస్తామని మంత్రి చెప్పారు. ఇదిలావుంటే స్టాక్ మార్కెట్లలో లిస్టైన సంస్థల్లో పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను 25 శాతం నుంచి 30 శాతానికి పెంచడంపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఇప్పటికే వివిధ భాగస్వాములతో సంప్రదింపులను మొదలు పెట్టిందని తెలియజేశారు.



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్

### జీడీపీని పరిగెత్తిస్తాం

మందగించిన వృద్ధిరేటును అతి త్వరలోనే తిరిగి పరుగులు పెట్టిస్తామని, ఆ దిశగా తమ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేసుకుందని మంత్రి సీతారామన్ సమావేశం అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ తెలియజేశారు. జీడీపీ ఐదేండ్ల కనిష్ఠానికి పతనం, నిరుద్యోగం పెరిగిన వేళ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా సీతారామన్ బాధ్యతలు చేపట్టిన సంగతి విదితమే. దీంతో ఈ రెండింటిపైనా సీతారామన్ యుద్ధప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించారు. ఇందులోభాగంగానే ఈ బ్యాంకర్లతో సమావేశం. ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయని, రుణాలు కరువైపోయాయని వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఆందోళన చెందుతుండటంతో బ్యాంకర్లతో తాజా సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. వచ్చే ఐదేండ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్తామని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నదీ తెలిసిందే.

## 370 రద్దుపై పరిశ్రమ హర్షం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పిస్తూ ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ సోమవారం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భారతీయ వ్యాపార, పారిశ్రామిక రంగాలు హర్షం వ్యక్తం చేశాయి. పరిశ్రమలోని పలువురు ప్రముఖులు మోదీ సర్కార్ నిర్ణయాన్ని ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల వేదికగా స్వాగతించారు.

'నేటి నిర్ణయం చారిత్రాత్మకం. ఇది జమ్ము కశ్మీర్‌లో అభివృద్ధి, శాంతి స్థాపనలకు బాటలు వేస్తుంది. కేవలం కశ్మీరీల సాధికారతకు మాత్రమేగాక దేశ బలోపేతానికీ దోహదం చేస్తుంది'

**-గౌతమ్ అదానీ, అదానీ గ్రూప్ చైర్మన్**

'జమ్ము కశ్మీర్ భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుంది'

**-రాజీవ్ తల్వార్, పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు**

'తీవ్రవాదులు తులిప్ గార్డెన్ అందాలను పరిశ్రమకు అందకుండా చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో భూతల స్వర్గంలోకి మళ్లీ పెట్టుబడుల రాక మొదలవుతుంది'

**-హర్ష గోయెంకా, ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్**

'కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరైనది. దీన్ని నేను స్వాగతిస్తున్నాను. ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీని అమలుపరిచారు'

**-సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సీఎండీ**

'దేశానికి ఇది గుర్తుండిపోయే రోజు. జమ్ము కశ్మీర్‌లో అభివృద్ధికి పునాది పడిన రోజు, ఎంతోమంది భారతీయులకు విముక్తి లభించిన రోజు'

**-ఆశిష్‌కుమార్ చౌహాన్, బీఎస్ఈ ఎండీ, సీఈవో**



ధర రూ.4.79 లక్షలు

## బెనెల్లీ నుంచి లియాంచినో 500

**హైదరాబాద్, ఆగస్టు 5:** అంతర్జాతీయ మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన లియాంచినో 500 బైకును దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది ఇటలీకి చెందిన బెనెల్లీ. ఈ బైకు ధరను రూ.4.79 లక్షలుగా నిర్ణయించింది. ఈ సందర్భంగా బెనెల్లీ ఇండియా ఎండీ వికాస్ ఝబాక్ మాట్లాడుతూ.. దేశీయ వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని తయారు చేసిన ఈ బైకును హైదరాబాద్‌లో ఉన్న అసెంబ్లింగ్ యూనిట్‌లోనే తయారు చేసినట్లు చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఈ ఏడాది చివరినాటికి మరో రెండు నుంచి మూడు మోడళ్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. 2020 చివరినాటికి మొత్తం మోడళ్ల సంఖ్య 12 నుంచి 13కి చేరుకోనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సంస్థ ఆరు మోడళ్లను దేశీయంగా ఉన్న 19 డీలర్ల వద్ద విక్రయిస్తున్నది. ఈ బైకుపై ఐదేండ్లపాటు వ్యారెంట్ సదుపాయం కూడా కల్పించింది. హైదరాబాద్‌లోని గుండ్లపోచంపల్లి వద్ద రూ.40 కోట్లతో అసెంబ్లింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. కంపెనీ బైకులకు డిమాండ్ అధికంగా ఉంటే ఇక్కడే మరో యూనిట్‌ను నెలకొల్పే అవకాశం ఉందన్నారు. మూడేండ్ల క్రితం దేశీయ మార్కెట్లోకి అడుగు పెట్టిన సంస్థ..ఇప్పటి వరకు 6 వేల యూనిట్లకు పైగా విక్రయించింది.

## వెయ్యి కోట్ల సేకరణలో ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్..వ్యాపార విస్తరణకోసం అవసరమైన నిధుల్లో రూ.1,000 కోట్లను బాండ్లను జారీ చేయడం ద్వారా సేకరించాలనుకుంటున్నది.బ్రిటన్‌కు చెందిన సీడీసీ గ్రూపు వెనుకుండి నడిపిస్తున్న ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్..సెక్యూర్డ్, నాన్-సెక్యూర్డ్ ఎన్‌సీడీలను జారీ చేయడం ద్వారా రూ.100 కోట్ల వరకు నిధులను సేకరించాలనుకోగా, ఒవర్-సబ్‌స్క్రిప్షన్ ద్వారా మరో రూ.900 కోట్లు సమీకరించుకోవాలని చూస్తున్నది. 69 నెలల కాలపరిమితి కలిగిన ఈ ఎన్‌సీడీలపై 10.50 శాతం వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది.



## 'ఎల్ఐసీ జీవన్ అమర్'

**హైదరాబాద్, ఆగస్టు 5:** 'ఎల్ఐసీ జీవన్ అమర్' పేరుతో ప్రవేశపెట్టిన టర్మ్ పాలసీ.. నాన్-లింక్డ్, లాభాపేక్షలేనిదని, పాలసీదారులకు పూర్తిస్థాయి భద్రత లభిస్తుందని ఒక ప్రకటనలో ఎల్ఐసీ వెల్లడించింది. 18 ఏండ్లు నిండినవారి నుంచి 65 ఏండ్లలోపు వయస్సు కలిగినవారు ఈ పాలసీ తీసుకోవడానికి అర్హులు. మెచ్యూరిటీ కాలపరిమితి 80 ఏండ్లు. రెండు రకాల్లో లభించనున్న ఈ పాలసీల్లో పొగత్రాగేవారు, త్రాగనివారు ఏదో ఒకటి ఎంపిక చేసుకోవచ్చును. కోటి రూపాయల సమ్ అస్యూర్ కలిగిన ఈ పాలసీ తీసుకున్నవారు ఏడాదికి రూ.10,800 చెల్లించాలి. మహిళలు రూ.9,440 చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ అదనమని, తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ఈ పాలసీని తీసుకొచ్చినట్లు కంపెనీ సోమవారం తెలిపింది.

## అయోధ్య కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారంపై
# నిర్ణయం తీసుకుంటాం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు5:** అయోధ్య భూ వివాదం కేసు విచారణ ప్రక్రియను రికార్డు చేయాలని దాఖలైన పిటిషన్‌పై పాలనా పరమైన విధాన నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు తెలిపింది. అయోధ్య కేసుపై మంగళవారం నుంచి చీఫ్ జస్టిస్ రంజన్‌గొగోయ్ సారథ్యంలోని ధర్మాసనం రోజువారీగా విచారించనున్నది. ఈ నేపథ్యంలో కేసు విచారణ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారంగానీ, రికార్డుగానీ చేయాలని దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరుతూ ఆరెస్సెస్ మాజీ సిద్ధాంతకర్త కేఎన్ గోవిందాచార్య పిటిషన్ దాఖలు చేశారు. దీనిని అత్యవసరంగా విచారించనవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం విషయమైగానీ, రికార్డు చేసే విషయమైగానీ సంస్థాగతంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని తెలిపింది. రాజ్యాంగ సంబంధమైన, జాతీయ ప్రాముఖ్యం గల కేసుల విచారణను ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అనుమతినిస్తున్నట్లు గతేడాది సెప్టెంబర్ 26న సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ ఆదేశాలను పిటిషనర్ గోవిందాచార్య గుర్తుచేశారు.

## ఉన్నావ్ బాధితురాలిని 'ఎయిమ్స్'కు తరలించండి

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉన్నావ్ లైంగిక దాడి బాధితురాలికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు విమానంలో ఢిల్లీకి తరలించాలని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. ప్రస్తుతం లక్నోలోని కింగ్‌జార్జి వైద్య కళాశాల దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమెను మెరుగైన చికిత్స కోసం ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించాలని కోరుతూ ఆమె తరఫున డీ రామకృష్ణారెడ్డి పిటిషన్ దాఖలుచేశారు. కేసు తదుపరి విచారణను దీపక్‌గుప్తా, అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

## • హైదరాబాద్‌లో రోడ్ల పరిశీలన



సోమవారం వర్షపునీరు డ్రెయిన్‌లోకి సాఫీగా వెళ్లేందుకు వీలుగా మట్టిని, చెత్తను తొలిగిస్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికులకు సూచనలు ఇస్తున్న మేయర్ బొంతు రామ్మోహన్. చిత్రంలో కమిషనర్ దానకిశోర్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శంకరయ్య, మెట్రోరైలు ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.
- నమస్తే తెలంగాణ, హైదరాబాద్ సిటీబ్యూరో

## ట్రాన్స్‌జెండర్ల హక్కుల బిల్లుకు లోక్‌సభ ఓకే

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ బిల్లుకు లోక్‌సభ సోమవారం మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. దీనిపై కాంగ్రెస్‌పక్షనేత అధిర్ రంజన్ చౌదరి ప్రతిపాదించిన వాయిదా తీర్మానాన్ని అనుమతించనందుకు విపక్ష సభ్యులు ఆందోళన చేస్తుండగానే లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లును గతనెల 19న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ట్రాన్స్‌జెండర్లపై దాడి చేసినా, లైంగికదాడికి పాల్పడినా జరిమానా, జైలుశిక్ష విధించేలా నిబంధనలు మార్చినట్టు కేంద్రమంత్రి రతన్‌లాల్ కటారియా తెలిపారు.





తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తదితరులు ఉన్నారు.

# పేదల సంక్షేమానికి సర్కారు కృషి

- పుస్తకావిష్కరణలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అబ్కారీ, క్రీడలు, సాంస్కృతికశాఖల మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా ప్రగతి సాధించేందుకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని సోమవారం సచివాలయంలో మంత్రి ఆవిష్కరించి మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాలను ఏర్పాటుచేశారని తెలిపారు. సర్కారు కల్పించిన సౌకర్యాలతో గురుకుల పాఠశాలల్లో సీటు కోసం విద్యార్థులు క్యూ కడుతున్నారని చెప్పారు. మార్కెట్ కమిటీల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, బీసీలకు మహాత్మా జ్యోతిబా పూలే పేరు మీదనే స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 80శాతం జనాభా ఉన్న బీసీల కోసం కేంద్రం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయకపోవడం బాధాకరమని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అరచేతిలో రిజర్వేషన్ టికెట్లు!

- చార్టు తయారయ్యాక కూడా సీటు ఖాయం
- గమ్యస్థానం చేరేలోగా బెర్త్ పొందే అవకాశం
- కొత్తగా అమల్లోకి తెచ్చిన ఇండియన్ రైల్వే



**అంబర్‌పేట, నమస్తే తెలంగాణ:** రైల్వే రిజర్వేషన్ టికెట్ పొందడం మరింత సులువైంది. రిజర్వేషన్ చార్ట్ తయారయిన తర్వాత కూడా టికెట్ పొందే అవకాశం ఏర్పడింది. ఇకపై రైల్లో ప్రయాణిస్తూనే రిజర్వేషన్ బెర్తును ప్రయాణికులు సులువుగా పొందవచ్చు. ఇండియన్ రైల్వేశాఖ చేసిన తాజా మార్పులతో ఇక రైల్వే రిజర్వేషన్ దాదాపుగా గమ్యస్థానం చేరేలోపు ఏదో ఒక కోటాలో బెర్తులు అందరికీ దక్కనున్నాయి. ఆన్‌లైన్ ద్వారా స్మార్ట్‌ఫోన్ నుంచే ప్రయాణికుడు నేరుగా రిజర్వేషన్ బెర్తులు పొందవచ్చు. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో రిజిస్టరయి ఉండాలి. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి తిరుపతి ప్రయాణించే వ్యక్తికి హైదరాబాద్ కోటాలో బెర్తు దక్కకపోయినా చార్ట్ తయారయిన తర్వాత మార్గమధ్యలో మహబూబ్‌నగర్, కర్నూలు, గుంతకల్ కోటాల్లో బెర్తు లభిస్తుంది. ఇది రైలు ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రైల్వేశాఖ వందరోజుల ప్రణాళికలో భాగంగా దీన్ని పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చింది.

**ఐఆర్‌సీటీసీ ద్వారానే అన్నీ**

ముందుగా ప్రయాణికుడు ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లి లాగిన్ అయిన తర్వాత కొత్తగా 'చార్ట్/ వెకెన్సీ' అనే ఆప్షన్ వస్తుంది. దాన్ని క్లిక్ చేయగానే నేరుగా అన్ని రైళ్లలోని చార్టులు దర్శనమిస్తాయి. ఏ రైల్లో బెర్తు కావాలో ఎంచుకోవాలి. 'జర్నీ డిటెయిల్స్'లో రైలు పేరు లేదా నంబరు నమోదు చేయాలి. ఆ తర్వాత బోర్డింగ్ స్టేషన్‌ను ఎంటర్‌చేసిన వెంటనే రైల్లో ఖాళీ బెర్తుల వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ తరగతుల్లో ఖాళీగా ఉన్న బెర్తుల వివరాలు కనిపిస్తాయి. దానిపై క్లిక్ చేయగానే సంబంధిత స్టేషన్ కోటాలో ఖాళీగా ఉన్న బోగీ, బెర్తు నంబరు, సైడు, అప్పర్, లోయర్, సైడ్ అప్పర్ బెర్తులు స్పష్టంగా కనిపిస్తాయి. ఎన్ని బెర్తులు ఖాళీగా ఉన్నాయో కూడా తెలుస్తుంది. అనంతరం పైన కనిపించే 'బుక్' ఆప్షన్‌ను క్లిక్ చేస్తే 'బుక్ టికెట్' అని వస్తుంది. అప్పుడు ఐఆర్‌సీటీసీ యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఎంటర్‌చేసి డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, ఇతర వాలెట్‌ల ద్వారా రిజర్వేషన్ టికెట్లు పొందవచ్చు. రిజర్వేషన్ టికెట్ బెర్తుల వివరాలు మెసేజ్ రూపంలో ఫోన్‌కి వస్తుంది. దాన్ని టీటీఈకి చూపించి ఇబ్బందిలేకుండా ప్రయాణించవచ్చు.

### రాయితీ విషయంలో జాగ్రత్త

ఐఆర్‌సీటీసీ ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్లు చేసుకునే సీనియర్ సిటిజన్ ప్రయాణికులు జాగ్రత్తగా లేకపోతే టికెట్లపై రాయితీని కోల్పోవాల్సి వస్తుంది. పేద, ధనిక తేడా లేకుండా అన్ని వర్గాలు రాయితీలను ఉపయోగించుకోవడంలో జరిగే నష్ట నివారణకు రాయితీలపై ఇటీవల రైల్వేశాఖ ప్రత్యేక ఆప్షన్లు ఇచ్చింది. ప్రస్తుతం 60 ఏండ్లు దాటిన పురుషులకు 40 శాతం, 58 ఏండ్లు దాటిన మహిళలకు 50 శాతం రాయితీ ఇస్తున్నది. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసేప్పుడు రాయితీలు పొందేవారు 'ఓకే' అని, రాయితీలు వద్దనుకునే వారు 'క్యాన్సల్' అని క్లిక్ చేయాలి. ఇటీవల ప్రయాణికులు ఆప్షన్లు ఎంచుకునే విషయంలో గందరగోళానికి గురై ఒకదానికి బదులు మరొకటి క్లిక్ చేస్తూ రాయితీ కోల్పోతున్నారు. దీని విషయంలో చిన్నపాటి జాగ్రత్త తీసుకుంటే రాయితీని ఉపయోగించుకోవచ్చు.



ప్రొఫెసర్ సీఎన్‌రావును సన్మానిస్తున్న ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, సీఎస్‌ఐఆర్ జనరల్ డైరెక్టర్ డాక్టర్ శేఖర్ మండే

# ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

- విద్యార్థుల్లో పరిశోధనాసక్తిని పెంపొందించాలి
- ఐఐసీటీ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భారతరత్న సీఎన్నార్ రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/తార్నాక:** నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని, విద్యార్థుల్లో చిన్నతనం నుంచే పరిశోధనపై ఆసక్తిని పెంపొందించాలని భారతరత్న, ప్రొఫెసర్ సీఎన్నార్‌రావు పేర్కొన్నారు. మానవాళి అభ్యున్నతికి పరిశోధనలను వేగవంతంచేయాలని కోరారు. శ్రమను ఆయుధంగా మలుచుకుంటే విజయాలు వెంట వస్తాయని విద్యార్థులకు సూచించారు. సోమవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'ఆధునిక ఆవర్తన పట్టిక పరిచయం' అనే అంశంపై మాట్లాడుతూ మూలకాల ఆవర్తన పట్టికను ఆవిష్కరించి 150 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో దాని ప్రత్యేకతను వివరించారు. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న సీఎస్‌ఐఆర్-ఐఐసీటీ ఎన్నో ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచిందని ప్రశంసించారు. జంతుసంరక్షణ, పంటపొలాలు, ఇతర పారిశ్రామికరంగాల్లో నూతనవస్తువుల తయారీలో మరిన్ని మార్పులు జరుగాలని.. అప్పుడే ప్రజలకు తక్కువ ఖర్చులతో వస్తువులు లభ్యమవుతాయని చెప్పారు. భారత్‌లో అత్యాధునికమైన పరిశోధనలు జరగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీఎస్‌ఐఆర్ డీజీ డాక్టర్ శేఖర్ సీ మండే, ఐఐసీటీ డైరెక్టర్ ఎస్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## లొల్లి వద్దన్నందుకు దాడి.. వ్యక్తి మృతి



**రఘునాథపాలెం:** గొడవను ఆపేందుకు వెళిన వ్యక్తిపై దాడి చేయగా మృతి చెందిన ఘటన ఖమ్మంలో సోమవారం చోటుచేసుకున్నది. కృష్ణాజిల్లా నందిగామ మండలం చందర్లపాడుకు చెందిన తొండపు మోహన్‌రావు(56) బతుకుదెరువు కోసం కుటుంబంతోసహా ఆరేండ్ల కిందట ఖమ్మంకి వచ్చి అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సోమవారం ఉదయం మోహన్‌రావు పొలం దగ్గరకు బయల్దేరారు. ఈ క్రమంలో తన ఇంటిముందు నుంచి బస్సు వెళ్లద్దంటూ రిటైర్డు ఉద్యోగి శెట్టుపల్లి వెంకటేశ్వర్లు ఓ ప్రైవేట్ బస్సు డ్రైవర్‌తో గొడవ పడుతున్నారు. మోహన్‌రావు జోక్యం చేసుకొని ఇద్దరికి సర్దిజెప్పే ప్రయత్నం చేశారు. అది నచ్చని వెంకటేశ్వర్లు ఇంట్లో నుంచి కర్ర తెచ్చి మోహన్‌రావు తలపై బలంగా కొట్టాడు. దీంతో మోహన్‌రావు కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, రైతు మృతదేహంతో నిందితుడు వెంకటేశ్వర్లు ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మృతుని కుమారుడు శివ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశామని పోలీసులు తెలిపారు.

# మోడల్‌స్కూళ్లలో ప్రవేశాల జోష్

- గతేడాది కంటే నాలుగు వేల ప్రవేశాలు అధికం
- నాణ్యమైన విద్యవైపు మొగ్గుచూపుతున్న విద్యార్థులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ మోడల్ స్కూల్ సొసైటీ అధ్వర్యంలో కొనసాగుతున్న మోడల్ పాఠశాలలకు ఆదరణ పెరుగుతూ వస్తున్నది. విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతంలో అంగ్ల విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన మోడల్ స్కూల్ సొసైటీ నాణ్యమైన విద్యనందించడంలో తనదైన ముద్ర వేసుకుంటున్నది. బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హాస్టళ్లకు మంచి ఆదరణ లభిస్తుండగా.. బాలురకు హాస్టల్ సదుపాయం లేకపోయినప్పటికీ ప్రవేశాలు మాత్రం తగ్గడం లేదు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే స్కూల్‌లో తరగతులు నిర్వహిస్తుండడంతో పాటు, ఉత్తమ ఫలితాలు సాధించడం మోడల్ స్కూళ్లకు ఆదరణ పెరగడానికి కారణమవుతున్నది. గత ఐదు విద్యాసంవత్సరాల నుంచి ప్రవేశాల సంఖ్య క్రమేణా పెరుగుతూవస్తున్నది. గతేడాదితో పోల్చితే.. 2019-20 విద్యాసంవత్సరంలో 4,025 ప్రవేశాలు పెరిగాయని మోడల్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఎస్ సత్యనారాయణ తెలిపారు. గతేడాదిలో స్కూల్, ఇంటర్ అడ్మిషన్లు కలిపి మొత్తం 1,28,091 అడ్మిషన్లు జరుగగా.. ఈ ఏడాది 1,32,116 ప్రవేశాలు జరిగాయన్నారు. మోడల్ స్కూళ్లలో ప్రవేశాల ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మరికొన్ని ప్రవేశాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

**ఐదేండ్లుగా మోడల్ స్కూళ్లలో నమోదైన ప్రవేశాల వివరాలు**

| సంవత్సరం | 6 - 10 తరగతి | | | ఇంటర్మీడియట్ | | | మొత్తం ప్రవేశాలు | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | బాలురు | బాలికలు | మొత్తం | బాలురు | బాలికలు | మొత్తం | బాలురు | బాలికలు | మొత్తం |
| 2015-16 | 33,854 | 35379 | 69,233 | 4,942 | 8,955 | 13,897 | 38,796 | 44,334 | 83,130 |
| 2016-17 | 42,024 | 41,621 | 83,645 | 6,678 | 14,691 | 21,369 | 48,702 | 56,312 | 1,05,014 |
| 2017-18 | 45,815 | 46,104 | 91,919 | 11,082 | 22,629 | 33,711 | 56,897 | 68,733 | 1,25,636 |
| 2018-19 | 47,656 | 47,586 | 95,242 | 8,374 | 24,475 | 32,849 | 56,030 | 72,061 | 1,28,091 |
| 2019-20 | 46,620 | 48,502 | 95,122 | 11,660 | 25,334 | 36,994 | 58,280 | 73,836 | 1,32,116 |

## బీజేపీలో ఉన్న టీడీపీ కోవర్ట్ సుజనాచౌదరి

- వైసీపీ ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎంపీ సుజనా చౌదరి బీజేపీలో ఉన్న టీడీపీ కోవర్ట్ అని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ రామచంద్రయ్య ఆరోపించారు. సోమవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలోని దోపిడీని అరికడుతుంటే బీజేపీ నేతలు వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. బీజేపీ ఎదగాలని ప్రయత్నించడంలో తప్పులేదని కానీ ఆర్థిక నేరస్థులు, ఫ్యాక్షన్ లీడర్లను పార్టీలో చేర్చుకుంటున్నదని ఆరోపించారు. చంద్రబాబు హయాంలోని అవినీతి తవ్విన కొద్దీ బయటకొస్తున్నదని ఆరోపించారు.

## ఏపీ వీఐటీలో మెకాట్రోనిక్స్ వర్క్‌షాప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జర్మనీకి చెందిన యూరోపియన్ సెంటర్ మెకాట్రోనిక్స్ సంస్థ.. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో సోమవారం అమరావతిలోని వీఐటీ ప్రాంగణంలో 8 రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించింది. యూరోపియన్ సెంటర్ మెకాట్రోనిక్స్ సంస్థ ఆధునాతన ఆటోమేషన్, తయారీ పరిష్కారాలను దశాబ్దకాలంగా జర్మన్ పరిశ్రమలకు అందిస్తున్నది. ప్రస్తుతం ఏపీలోనూ సేవలను విస్తరించాలని భావిస్తున్నది. ఈ నేపథ్యంలో ఏపీలోని 32 విద్యాసంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నది. వర్క్‌షాప్‌లో సంస్థ ప్రతినిధులు వంగపండు వెంకట నాగరాజు, అభిరాం వర్మ రుద్రరాజు పాల్గొన్నారు.

## భవనం ఎప్పుడు ప్రభుత్వపరమైంది?

- ఎర్రమంజిల్‌పై వివరాలు సమర్పించాలన్న హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎర్రమంజిల్ భవనాన్ని ప్రభుత్వం ఎప్పుడు స్వాధీనం చేసుకున్నది? తదితర వివరాలు అందజేయాలని హైకోర్టు సోమవారం ప్రభుత్వాన్ని అడిగింది. ఎర్రమంజిల్ ప్రాంతంలో కొత్త అసెంబ్లీ నిర్మించాలని మంత్రిమండలి నిర్ణయం తీసుకోవడానికి ముందు క్యాబినెట్ ఎజెండాలో ఉంచిన ఫైళ్లను సమర్పించాలని సూచించింది. క్యాబినెట్ ఏయే అంశాలపై ఆధారపడి కొత్త అసెంబ్లీని నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నదో స్పష్టత వస్తుందని పేర్కొన్నది. మరోవైపు, ఎర్రమంజిల్ భవనం కూల్చివేతను వ్యతిరేకిస్తూ మిర్ అస్గర్‌హుస్సేన్ దాఖలుచేసిన పిటిషన్‌పై సోమవారం వాదనలు కొనసాగాయి. పిటిషనర్ తరపు న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేసు మంగళవారానికి వాయిదా పడింది.

# పంచాయతీరాజ్‌కు ప్రాధాన్యం ఇవ్వండి

- ఢిల్లీలో ఎన్కే సింగ్‌ను కలిసిన స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశంగౌడ్
- కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు రావాలని ఆహ్వానం



కేంద్ర ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎన్కేసింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేశంగౌడ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్ సంస్థలకు నిధుల కేటాయింపుల్లో తొలి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ఆర్థికసంఘం చైర్మన్ జీ రాజేశంగౌడ్ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎన్కే సింగ్, సెక్రటరీ అరవింద్ మెహతాతో సోమవారం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం అధ్యక్షుడు రాజేశంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖ అందజేశారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సలహాలు, సూచనలతో సమగ్ర నివేదిక సిద్ధం చేశామని, పంచాయతీరాజ్ సంస్థలకు కేంద్ర నిధుల విడుదల ఆవశ్యకతను వివరించినట్టు రాజేశంగౌడ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థికసంఘం సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాల్సిన అవసరం, ఆర్థికసంఘాల బలోపేతంపై చర్చించినట్టు తెలిపారు. వచ్చే 15వ ఆర్థికసంఘం సిఫారసుల మేరకు అన్ని స్థాయి సంస్థలకు అవసరమైన నిధుల విడుదలకు సూచనలు ఇస్తామని వివరించారు. స్థానిక సంస్థల బలోపేతానికి అవసరమైన నిధులు, అధికారాల బదలాయింపునకు రాష్ట్రాల ఆర్థిక సంఘాల సూచనలు చాలా ముఖ్యమైనవని, కేంద్రం వీటిని కచ్చితంగా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. కాగా సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయపథకాలపై రాష్ట్ర ఆర్థికసంఘం చైర్మన్ రాజేశంగౌడ్.. ఎన్కే సింగ్‌కు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలని ఈ సందర్భంగా ఎన్కే సింగ్‌ను కోరామని.. ఇందుకు ఆయన సమ్మతించారని రాజేశంగౌడ్ తెలిపారు. స్టేట్‌ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు చెన్నయ్య ఆయన వెంట ఉన్నారు.



మైనార్టీ కమిషన్ సభ్యులు, అధికారులతో సమావేశమైన చైర్మన్ మహ్మద్ కమ్రుద్దీన్

# మైనార్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఫిర్యాదుల స్వీకరణకు జిల్లాలవారీగా ఇంచార్జీలు
- మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ కమ్రుద్దీన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా మైనార్టీల సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని మైనార్టీ కమిషన్ చైర్మన్ మహ్మద్ కమ్రుద్దీన్ స్పష్టంచేశారు. అందులో భాగంగా కమిషన్ సభ్యులను జిల్లాలవారీగా మైనార్టీల ఫిర్యాదులు స్వీకరించేందుకు ఇంచార్జీలుగా కేటాయించామని తెలిపారు. సోమవారం కమిషన్ కార్యాలయంలో మైనార్టీ కమిషన్ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషన్ సభ్యులు విద్యాస్రవంతిని నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు, సర్దార్ సురేందర్‌సింగ్‌ను కరీంనగర్ జిల్లాకు, బొమ్మల కట్టయ్యను నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు, మహ్మద్ అర్షద్‌అలీఖాన్‌ను ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు, ఎంఏ అజీమ్, గుస్తీ నోరియాలను హైదరాబాద్‌కు ఇంచార్జీలుగా కేటాయించారు. సమావేశంలో కమిషన్ వైస్‌చైర్మన్ శంకర్ ల్యూక్, సలహాదారులు ఖాదిర్‌సిద్ధిఖీ, మహ్మద్ రియాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

# ఘరానా మోసగాడు అరెస్ట్

- రాజకీయ నాయకులే లక్ష్యంగా మోసాలు
- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులకు బురిడీ
- తెలుగు రాష్ట్రాలలో 60 కేసులు
- సైబర్‌క్రైం పోలీసులకు చిక్కిన బాలాజీనాయుడు



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాజకీయ, నాయకులు ప్రజాప్రతినిధులే లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్న ఘరానా మోసగాడు బాలాజీ నాయుడును హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడికి చెందిన తోట బాలాజీ నాయుడు కాకినాడలో బీటెక్ పూర్తి చేశాడు. అనంతరం ఎన్టీపీసీలో కొంతకాలం అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేశాడు. సునాయసంగా డబ్బు సంపాదించాలన్నా ఆలోచనతో ఆర్థికశాఖ డిప్యూటి సెక్రటరీనంటూ నమ్మిస్తూ ప్రజాప్రతినిధులను మోసం చేస్తున్నాడు. అతడిపై రెండు రాష్ట్రాల్లో 60 కేసులున్నాయి. గతంలో పలువురిని మోసం చేసి జైలుకు వెళ్లి వచ్చాడు.

**ఎమ్మెల్యే కుమారుడికి టోకరా..**

ఈ ఏడాది ఫిబ్రవరి 28న ముషీరాబాద్ ఎమ్మెల్యే కుమారుడు ముఠా జయసింహకు ఫోన్‌చేసి తాను ఆర్థికశాఖలో డిప్యూటి సెక్రటరీనంటూ చెప్పుకొని రూ. 2.5 లక్షలు బురిడీ కొట్టించాడు. రూ. 25 లక్షల వరకు లోన్ వస్తుందని అందుకు ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్లు పంపించాలని లోన్ మొత్తంలో ఐదు శాతం ప్రాథమికంగా డిపాజిట్ చేయాలని సూచించాడు. దీంతో జయసింహ రూ. 2.5 లక్షలు బాలాజీనాయుడుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశాడు. మరుసటి రోజు సచివాలయానికి వెళ్లి ఆరాతీయగా మోసపోయినట్టు గ్రహించిన జయసింహ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదుచేశారు.

**మాజీ ఎమ్మెల్యేకు..!**

ఈ ఏడాది జనవరిలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజ సత్యవతికి ఫోన్ చేసి, తాను రాష్ట్ర ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ దాసరి అనిల్‌కుమార్‌ను మాట్లాడుతున్నానంటూ నమ్మించి.. సీడీఎఫ్ నుంచి (సెంట్రల్ డెవెలప్‌మెంట్ ఫండ్) రూ. 25 లక్షల వరకు లోన్ వస్తుందని నమ్మించి.. రూ. 1.25 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయాలంటూ కోరాడు. దీంతో ఆమె ఆ డబ్బును అతడు సూచించిన బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశారు. తరువాత తన సెల్‌ఫోన్‌ను స్విచ్ అఫ్ చేశాడు. ఇతని వ్యవహారంపై అనుమానం వచ్చిన ఆమె కుమారుడు కుంజ సంతోష్‌కుమార్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

# ప్రైవేట్ వర్సిటీల్లో స్థానిక రిజర్వేషన్లపై పిల్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రైవేట్ యూనివర్సిటీల చట్టంలో స్థానిక విద్యార్థుల రిజర్వేషన్ల అంశంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు సోమవారం ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. అనంతరం విచారణను నాలుగువారాలు వాయిదావేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ యూనివర్సిటీల చట్టం- 2018లోని క్లాజ్ 33 ప్రకారం ప్రైవేట్ యూనివర్సిటీల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్థానిక విద్యార్థులకు 25శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు రాష్ట్రానికి చెందిన స్థానిక విద్యార్థులకు 85శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్దేశిస్తున్నాయని పిటిషనర్లు పేర్కొన్నారు. కొత్తగా అమల్లోకి వచ్చిన ప్రైవేట్ వర్సిటీల చట్టంలో ఆ మేరకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కౌంటర్ దాఖలుచేయాలని ప్రభుత్వానికి సూచించింది.




కరీంనగర్

నమస్తే తెలంగాణ

# జిందగీ

మంగళవారం 6 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

## పంజాబ్ 'ఐరన్ లేడీ'



**శవాన్ని చూడడానికే కొంతమంది ఆడవాళ్లు భయపడిపోతుంటారు. అలాంటిది పంజాబ్‌కు చెందిన ఈ ఐరన్‌లేడీ అనాథ శవాలకు ఘనంగా అంత్యక్రియలు చేస్తున్నది. అది కూడా దాదాపు 20 సంవత్సరాల నుంచి.**

పంజాబ్‌కు చెందిన అమర్‌జిత్ కౌర్ ధిల్లాన్‌ను అంతా 'ఐరన్ లేడీ' అని పిలుచుకుంటారు. ఎందుకంటే ఆమెలోని ధైర్య సాహసాలు, సామాజిక సేవే అందుకు కారణం. చావు కూడా పెండ్లిలా జరిగే మన దేశంలో.. ధనికుల అంత్యక్రియలు ఘనంగానే జరుగుతాయి. మరి మధ్యతరగతి, నిరుపేదల ఇండ్లలో పరిస్థితి చాలా ఆందోళనకరంగానే ఉంటుంది. ఎందుకంటే అంత్యక్రియలు డబ్బుతోనే ముడిపడి ఉంటాయి కాబట్టి. అలాంటి నిరుపేదల అంత్యక్రియలకు ఈ ఐరన్ లేడీ ముందుంటుంది. జరగాల్సిన ఏర్పాట్లు అన్నీ చేస్తుంది. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఓదార్చి, అంత్యక్రియల తంతును తానే సొంతంగా నిర్వహిస్తుంది. 2000వ సంవత్సరంలో బ్యాంక్‌లో ఉద్యోగిగా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న అమర్‌జిత్ కౌర్ అప్పటి నుంచీ సేవా కార్యక్రమాలు చేపడుతున్నది. తన 20 యేండ్ల ప్రస్థానంలో ఎన్నో మంచి పనులు చేసింది. చండీఘఢ్‌లోని పీజీఐఎంఈఆర్ ఆస్పత్రిలో మూడు వందలకు పైగా అనాథ శవాలకు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించింది. నిరుపేదలైన వారి కొడుకులు, భార్యలు, భర్తలు, కూతుళ్లు చనిపోతే అన్నీ తానై చూసుకొని అంత్యక్రియలు నిర్వహిస్తుంటుంది అమర్‌జిత్. తానే సొంతంగా అంబులెన్స్‌ను ఏర్పాటు చేసుకొని నిరుపేదలకు నిత్యం అందుబాటులో ఉంటున్నది. అంతేకాకుండా పేద రోగులకు మందులు, ఆహారంతోపాటు ఆర్థిక సహాయం అందిస్తున్నది అమర్‌జిత్ కౌర్.

**జీవితం అంటే తెల్ల కాగితాలతో ఉన్న ఖాళీ పుస్తకం. అందులో రంగు రంగుల పేజీలను మనమే నింపుకోవాలి.**
**మనకంటూ ఓ శాశ్వత సంతకాన్ని సృష్టించుకోవాలి. లేదంటే అందంగా సాగాల్సిన జీవితం సాదాసీదాగానే సాగుతుంది.**
**భిన్న రంగాల్లో అభిరుచిని పెంచుకుంటే జీవితానికో గుర్తింపు ఉంటుంది.**
**ఆసక్తితో మొదలైనా ఆ అభిరుచి మంచి కీర్తిని కూడా తెచ్చిపెట్టొచ్చు. ఇలాంటి నేపథ్యం ఉన్న యువతే ప్రియాంక లక్ష్మి.**
**చదువు, ఉద్యోగమే జీవితం కాకుండా కళారంగంలో ప్రతిభను కనబరుస్తున్నది.**
**కవితలతో మొదలైన ఆమె ప్రయాణం పాటల పూదోటగా మారింది.**
**సినిమాల్లో గేయరచయిత్రిగా.. మరోవైపు చిత్రకారిణిగా..**
**ఆమె ప్రయత్నం నూతనత్వాన్ని సంతరించుకుంటున్నది.**

# అక్షరాల ఆణిముత్యం!



ఒక పని మొదలు పెట్టి దాన్ని పూర్తి చేయాలంటేనే చాలా అవస్థలు పడుతుంటారు. అలాంటిది ప్రియాంక పాటలతో ప్రయాణం చేస్తూ బిజీబిజీగా ఉంది. అటు తనకెంతో ఇష్టమైన చిత్రలేఖనంతో చెలిమి చేస్తూ అందరినీ అబ్బురపరుస్తుంది. అక్షరాలతో అనుబంధాన్నీ కొనసాగిస్తున్నది. వీటికి తోడు చదువునూ పక్కకు పెట్టలేదు. బిజీలైఫ్‌లోనైె భిన్న రంగాల్లో రాణిస్తూ అందరితో మన్ననలు పొందుతున్నది. అన్నింటికీ ప్రత్యేకమైన సమయం కేటాయించి ఆమె అభిరుచులను మెరుగుపరుచుకుంటున్నది.



### సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి..

ప్రియాంకది ఖమ్మం జిల్లా సత్తుపల్లి . ప్రస్తుతం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉంటున్నది. ప్రాథమిక విద్య అంతా తెలుగు మీడియంలోనే చదివింది. ఉన్నత చదవుల కోసం హైదరాబాద్ వచ్చింది. ఇంజినీరింగ్ చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడింది. ఇదంతా ప్రియాంకలో ఒక కోణం. మరోవైపు ఆమెకు తెలుగు భాష అంటే ఇష్టం. చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదువడం, కవితలు రాయడం అలవాటు. ఆమె రాసిన కవితలను అప్పుడప్పుడూ సోషల్ మీడియాలో పెట్టేది. వాటికి మిత్రుల నుంచి మంచి స్పందన వచ్చేది. ఇలా ఆమెకు రాయాలన్న ఆసక్తి పెరిగింది. కవితలు రాయడం నిత్య కృత్యంగా అలవాటు చేసుకుంది. ఆమె అనుభవాలకు, ఆలోచనలకు, అనుభూతులకు అక్షరరూపం ఇచ్చుకుంటూ వచ్చింది. అందుకే ఉద్యోగాన్ని వదులుకొని పూర్తిగా అక్షరాలకు అంకితమైంది. అలా రాసిన కవితలు మంచి ఆదరణ పొందాయి. నలుగురిలో గుర్తింపు తీసుకొచ్చాయి. ఎందుకంటే ఆమె రాసే అక్షరాల్లో వైవిధ్యం కనిపిస్తుంది. అన్ని రకాల కవితలను ఈమె రాయగలదు. ఎలాంటి భావననైనా కవితల్లో జొప్పించగలదు. ఈ భావం తాలూకు లోతును ఆమె అక్షరాల్లో చూపించగలదు.

### తొలి అడుగు

కవితల ప్రవాహంలో వెళ్తున్న ప్రియాంకకు సినిమాల్లో అవకాశాలొస్తాయని అస్సలు ఊహించలేదు. ఈ క్రమంలోనే సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్ కొడకండ్ల ద్వారా ప్రియాంకకు అవకాశం వచ్చింది. 2016లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఓ యూట్యూబ్ చానెల్ వాళ్లు చేసిన 'వందేమాతరం' సాంగ్‌కు మొదటిసారి పాట రాసింది. ఈ పాటను ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడారు. మొదటి పాటనే ఆయన గళంలో వినడం ఆమె పెద్ద అచీవ్‌మెంట్‌గా భావించింది. ఆయనతోపాటు ఉషా, పృథ్వీరాజ్, దినకర్, మోహన భోగరాజు, దీపు, రమ్య బెహరా కూడా గొంతు కలిపారు. కార్తీక్ మ్యూజిక్ ఇచ్చారు. ఇదే ఆమె తొలి పాట. ప్రముఖ సింగర్లు పాడిన ఈ పాటకు గీత రచయితగా ఆమె ప్రతిభను చాటుకుంది. తర్వాతే సినిమాల్లో పాటలు రాసే అవకాశాలొచ్చాయి.



### రాస్తూనే ఉండాలి

'నాకు చిన్నప్పటి నుంచి తెలుగు అంటే చాలా ఇష్టం. చదువుకునేటప్పుడే కవితలు రాయడం అలవాటయింది. నిజానికి అప్పటి అభిరుచే ఇప్పుడు నాకు ఇష్టంగా మారింది. దీంట్లోనే నేను కొనసాగాలనుకుంటున్నా. మధ్య తరగతి కుటుంబం మాది. అయినా మా అమ్మా, నాన్న నన్ను బాగా ప్రోత్సహించారు. అందుకే బాగా రాయగలుగుతున్నా. జీవితంలో ఎదురైన ఘటనలు, వాటి తాలూకు ఆవేదన, ఆ వేదన నుంచి పుట్టిన భావాలనే అక్షరాలుగా మార్చేదాన్ని. అలా అలవాటైన నా ప్రయాణం ఇప్పుడు భిన్న రకాల పాటలు రాయడం వరకూ వచ్చింది. సినిమా పాటలు రాయడం అంటే చిన్న విషయం కాదు. ఎంతోమంది నమ్మకాన్ని నిలబెట్టాలి. అందుకోసం మంచి లిరిక్స్ ఎంచుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నాను. నా రంగానికి న్యాయం చేయాలి. నేను రాసే పాటలను ప్రజలు వినాలి. అలాంటి వాటిని నేను ఇంకా రాయాలనుకుంటున్నాను. నేను రాసిన పాటలకు వచ్చిన స్పందనలే నన్ను ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ప్రయాణంలో నాకు చాలామంది సపోర్ట్‌గా ఉన్నారు. వారికి చాలా కృతజ్ఞతలు' అంటున్నది ప్రియాంక లక్ష్మి.

### సినిమా అవకాశాలు

వందేమాతరం ఆల్బమ్‌తో ప్రతిభను కనబర్చిన ప్రియాంక ప్రయాణం మెల్లగా సినిమాల వైపు మళ్లింది. సప్తగిరి నటించిన 'సప్తగిరి ఎల్‌ఎల్‌బీ' సినిమాలో ఐటెం సాంగ్ రాసింది. 'ఏక్ దమ్ మస్తుంది' అనే పాటను రాసి అందిరినీ అబ్బురపరిచింది. తర్వాత 'గౌతమి' అనే ఇండిపెండెంట్ సాంగ్ రాసింది. అట్లాగే అమీర్‌పేట్ టు అమెరికా, సూపర్ స్కెచ్, ఇట్లు అంజలి, హవా సింగిల్ కార్డ్, మధురా వైన్స్ సినిమా పాటలకు లిరిక్స్ ఇచ్చింది. దీంతోపాటు పెళ్లిగోల, కైలాసపురం, మ్యాడ్ అనే వెబ్ సిరీస్‌లు ఆమె ప్రస్తుత ప్రాజెక్ట్‌లు.

### చిత్రకారిణి కూడా..

కవితలు, పాటలు రాయడమే కాకుండా ప్రియాంకకు ఆర్ట్ అంటే అభిమానం. ఖాళీ దొరికినప్పుడల్లా చిత్రలేఖనం చేయడం అలవాటు. డూడుల్స్ వేయడం, ప్రత్యేకమైన మాండాలాస్ వేయడంలో ప్రియాంకకు మంచి పట్టుంది. ఆకర్షణీయమైన చిత్రాలు గీసి బంధువులకు, స్నేహితులకు బహుకరిస్తుంది. వీటిని కూడా సోషల్ మీడియాలో ఉంచడం ద్వారా పలువురి నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. వారి కోసం ప్రత్యేక చిత్రాలు గీసి ఇవ్వడం ఈమె దినచర్యలో భాగమైపోయింది. ఇంకా ఈ ఆర్ట్స్‌ను ఎకో ఫ్రెండ్లీ బ్యాగ్‌ల మీద అచ్చు వేయించి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. త్వరలోనే వీటిని మరింత విస్తరిస్తానని ఇంకా ఎక్కువ ఆర్ట్స్ వేస్తానని అంటున్నది.







ప్రియాంక గీసిన చిత్రాలు

... వినోద్ మామిడాల

## హర్గిలా ఆర్మీ ప్రయత్నం!

**మారుతున్న కాలానికి తగినట్లుగా టెక్నాలజీ పెరుగుతున్నది. కానీ, ఇదే సమయంలో పక్షులు అంతరించిపోతున్నాయి. అందులో గ్రేటర్ అడ్జూటాంట్ (కొంగ జాతి) పక్షుల గురించి బహుశా ఎవరికీ తెలియకపోవచ్చు. వీటిని పరిరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నదో మహిళ.**



**అస్సోం,** కమ్రూప్ జిల్లాలోని పబ్ మాజిర్ గావ్ గ్రామానికి చెందిన పూర్ణిమ అమ్మమ్మ దగ్గర పెరిగింది. అక్కడ పచ్చని వరి పొలాల్లో కొంగలు వచ్చి వాలేవి. వాటిని చూసిననప్పుడల్లా పూర్ణిమ మనసు చాలా ప్రశాంతంగా అనిపించేది. ఎకాలజీ, వైల్డ్‌లైఫ్ బయాలజీ మాస్టర్స్ చేస్తున్నప్పుడు అంతరించిపోతున్న గ్రేటర్ అడ్జుటాంట్ కొంగల గురించి ప్రొఫెసర్లు చెప్పారు. ఆ కొంగలు వరి పొలాల్లో పూర్ణిమకు ఎక్కడా కనిపించలేదు. వాటి సంఖ్యను పెంచాలనే దిశగా.. అరణ్యక్ వన్య ప్రాణుల సంరక్షణ సంస్థలో వలంటీర్‌గా చేరింది. కానీ ఆ సంస్థ వాళ్లు ఖడ్గమృగం, పులి వంటి పెద్ద జంతువుల వైపు ఆసక్తి చూపడం చూసింది. గ్రేటర్ అడ్జుటెంట్ కొంగలను రక్షించడానికి ఎందుకు పనిచేయకూడదు అనుకున్నది. పీహెచ్‌డీ తర్వాత బాధ్యతలు చేపడదామనుకున్నది. కానీ, అప్పటికే చాలా ఆలస్యం అవుతుంది. చదువు పక్కన పెట్టి అడ్జుటాంట్ కొంగలపై అక్కడి ప్రజలకు అవగాహన పెంచాలని నిర్ణయించుకుంది. అంతకుముందు ఈ పక్షులను పోషిస్తూ 28 గూళ్ళు మాత్రమే ఉన్నాయి. ఈ పక్షి ప్రత్యేకత గురించి ప్రజలకు తెలియజేయడానికి 2015లో మహిళా టీం ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రచారం మొదలుపెట్టింది. 2019 నాటికి సుమారు 200 గూళ్ళు అయ్యేలా చేసింది. ఈ గూళ్లు ఏర్పాటు చేసిన కాలనీలో ప్రపంచంలో అత్యధిక హర్గిలాస్ సాంద్రత ఉందని పూర్ణిమ అంటున్నది. అంతరించిపోతున్న ఈ జాతి పరిరక్షణ కోసం పనిచేసే మహిళలను 'హర్గిలా ఆర్మీ' అంటారు. టీంలో సుమారు 400 మంది సభ్యులున్నారు. పూర్ణిమ ఇంతటితో ఆగకుండా ఆయా గ్రామాల్లో మహిళలకు వంటలపోటీలు, ఉపాధి సదుపాయం కల్పిస్తూ 2017లో వైట్లీ అవార్డు అందుకున్నది పూర్ణిమ.

## ఎలాంటి మొక్కలు కొనాలి?



- మొదటిసారి మొక్కలు కొనేవారు కాక్టస్ లాంటి రకాలను ఎంచుకోవడం మంచిది. ఎందుకంటే వాటిని పెంచడం చాలా సులువు. అయితే కుండీలు కాస్త పెద్దగా ఉండేట్లు చూసుకోవాలి. అలా అయితేనే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. వీటికి రసాయన ఎరువులు కూడా అవసరం ఉండదు.
- నెలకు ఒకసారి బకెట్ నీటిలో అరకప్పు ఎప్సం సాల్ట్ కలిపి మొక్కలకు పోయడం మంచిది. ఎందుకంటే అందులోని మెగ్నీషియం, సల్ఫేట్ పోషకాలు నీటిద్వారా మొక్కలకు చేరి ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదపడుతాయి.
- ఆక్వేరియం ట్యాంకులోని నీళ్లు మొక్కలకు మంచి బలాన్నిస్తాయి. ఆక్వేరియంలో నీరు మార్చినప్పుడల్లా, ఆ నీటిని వృథా చేయకుండా కుండీలకు వాడాలి. వాటిలోని నైట్రోజన్లు, ఇతర పోషకాలు మొక్కలకు మంచి బలాన్నిస్తాయి.
- మొక్కలకు ప్రతి రోజు నీళ్లు పోయాల్సిన అవసరం లేదు. రెండు రోజులకోసారి తగినన్ని నీళ్లు పెట్టి పదినిమిషాలు ఆగాలి. ఆ తరువాత కుండీలో ఇంకా నీరు ఉన్నట్లయితే తొలగించాలి.
- ఎండిన ఆకుల్ని, పువ్వుల్ని ఎప్పటికప్పుడు తొలగించాలి. ఇలా చేస్తేనే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. అలాగే రెండు నెలలకోసారి విస్తరిస్తున్న కొమ్మల్ని కత్తిరించడం కూడా తప్పనిసరి.

## వర్షాకాల వ్యాధులా?

**వర్షాకాలం ఎక్కువగా వ్యాధులు మనం తాగే నీళ్లు, తినే ఆహార పదార్థాల మూలంగా వస్తాయి. మనకు తెలిసినవైనా కొన్నింటిని నిర్లక్ష్యం చేస్తుంటాం. అయితే ఈ వర్షాకాలం కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.**

- ఈకోలీ అనే బ్యాక్టీరియా ఫుడ్ పాయిజనింగ్‌కు కారణమవుతుంది. నీళ్లను రాగి బిందెల్లో నిల్వ చేసినప్పుడు ఈ బ్యాక్టీరియా చనిపోతుంది. రాగి నీళ్లను పరిశుభ్రం చేస్తుంది. క్రిములతో పోరాడుతుంది. అందుకే రాగి బిందెలో నీళ్లను తాగితే మంచిది. ముఖ్యంగా వర్షాకాలం రాగి బిందెలో నీరు తాగితే మరీ మంచిది.
- శరీరంలో నిల్వ ఉన్న హానికర కొవ్వులను కరిగించడంలో ఈ లోహం బాగా పనిచేస్తుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. రాగి బిందెలో నీళ్లు బరువు తగ్గడానికి దోహదపడతాయి. రాగిలో ఉండే పలు రకాల పోషకాలు మెదడు పని తీరును మెరుగుపరుస్తాయి.
- వర్షాకాలం జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. ఈ కాలంలో ఫాస్ట్ ఫుడ్ అస్సలు తీసుకోకపోవడమే మంచిది. ఫాస్ట్‌ఫుడ్ కారణంగా జీర్ణక్రియ మీద ఒత్తిడి పెరుగుతుంది. అంతే కాకుండా ఫాస్ట్‌ఫుడ్ తినడం వల్ల కొవ్వు పేరుకుపోతుంది. వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఎక్కువ.
- మిత ఆహారం మంచిది. వర్షాకాలంలో ఎక్కువగా ఆహారం తీసుకోవద్దు. ఎప్పుడు తిన్నా సగం కడుపు ఖాళీగానే ఉంచుకోవాలి. ముఖ్యంగా నూనె పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడమే ఆరోగ్యానికి మంచిది. ఒక్కసారి వేడి చేసిన నూనెను మళ్లీ వాడవద్దు.
- వర్షాకాలంలో రోగనిరోధక శక్తి పెరగాలంటే.. ఈ కాలంలో దొరికే పండ్లను ఎక్కువగా తినాలి. మొక్కజొన్న, జామ, అల్లనేరేడు, సపోటా వంటి పండ్లు త్వరగా జీర్ణమవుతాయి. ఆరోగ్యానికి మేలు చేస్తాయి.



నమస్తే తెలంగాణ
# జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 6 ఆగస్టు 2019

## విటమిన్-ఎ తక్కువైతే?

**విటమిన్-ఎ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అంధత్వ సమస్యలు రాకుండా ఇది చూస్తుంది. మరి అలాంటి కీలకమైన విటమిన్-ఎ సమృద్ధిగా అందితేనే మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు. అయితే దీనిని సమపాళ్లలో తీసుకుంటే క్యాన్సర్‌ను సైతం తరిమేయ వచ్చునని అంటున్నారు నిపుణులు.**




సరిపడా విటమిన్-ఎ ఆరోగ్యాన్ని చాలావరకు ప్రభావితం చేస్తుంది. క్యారెట్, చిలగడదుంప, పాలు, చేపలు, బ్రకోలి, తోటకూర వంటి వాటిలో ఇది పుష్కలంగా ఉంటుంది. కాబట్టి వీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల చర్మ క్యాన్సర్‌ను సైతం తరిమేయొచ్చునని అంటున్నారు నిపుణులు. అమెరికాకు చెందిన బ్రౌన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తాజాగా దీనిపై అధ్యయనం చేశారు. 125000 మందిని దీంట్లో భాగంగా పరిశీలించారు. విటమిన్-ఎ సమృద్ధిగా లభించే పదార్థాలు తీసుకోవడం వల్ల చర్మక్యాన్సర్‌ను 15% వరకు తగ్గించవచ్చునని తమ అధ్యయనంలో వెల్లడైనట్లు పరిశోధకులు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా విటమిన్-ఎ లభ్యమైనా కూడా రోజుకు కనీసం 10,000 మంది అయినా దీనిని తీసుకోవడం లేదని తెలిపారు.

## ఆందోళన తగ్గించే చాక్లెట్

**జీవితం ఒత్తిళ్ల మధ్య గడపాల్సి వస్తుందని కొందరు ఆందోళన చెందుతుంటారు. కానీ.. పరిశోధకులు అదొక సమస్య కాదు అని చెప్తున్నారు. మనం ఎలా భావిస్తే అలాంటి ఫీలింగ్స్ కలుగుతాయంటున్నారు. ఐడియా ఉంటే చాక్లెట్‌తో కూడా ఒత్తిడి, ఆందోళన తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు.**



చాక్లెట్లు ఆరోగ్యాన్ని పాడుచేస్తాయని అంటుంటారు కదా. అయితే అన్ని చాక్లెట్లు అలా కావు అంటున్నారు నిపుణులు. డార్క్ చాక్లెట్లు తినడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందట. ఎలాంటి ఒత్తిడి ఉన్నా తగ్గిపోతుంది. తీవ్ర ఆందోళన ఉన్న సమయంలో ఒక డార్క్ చాక్లెట్ తింటే ఆందోళన మొత్తం తగ్గిపోయి మనసు కుదుటపడుతుందని యూఎస్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సర్వే చెప్తున్నది. 13626 మందిపై ఈ సర్వే చేశారు. వీరిలో 70% డిప్రెషన్, ఆంగ్జయిటీ వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారని చెప్తున్నారు.



**అమ్మ జన్మనిస్తుంది. ఆడిస్తుంది.. పాడిస్తుంది.. ఆరోగ్యవంతమైన జీవితాన్నిస్తుంది. సృష్టి ధర్మంగా పాలు ఇస్తుంది. ఆ పాలు ఆకలి మాత్రమే తీర్చేవి కావు. ఆప్యాయత.. ప్రేమ.. అనురాగం.. కరుణ కలబోసిన అమృతం లాంటివి. ఆరోగ్యపరంగా చూస్తే తల్లిపాలల్లో మంచి పోషకాలు ఉంటాయి. బిడ్డ భవిష్యత్ కోసం.. ఆరోగ్య భరోసా కోసం అమ్మ ఇచ్చే పాలు.. జీవితాంతం మురిపాలు అందిస్తాయి. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అమృతం లాంటి అమ్మపాల ప్రాధాన్యం గురించి తెలుసుకుందాం.**

# అమ్మపాలు.. అమృతం!

తల్లిపాల గొప్పదనం గురించి అందరికీ తెలుసు. కానీ పాలు ఇవ్వాలంటే వెనకడుకు వేస్తున్నది నేటి తరం. ఎందుకు అంటే? ఏమో.. అసలు కారణమైతే చెప్పరు కానీ బిడ్డకు పాలివ్వడం పట్ల పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. గత పదేళ్ల కాలంగా అయితే ఈ ధోరణి ఎక్కువవుతున్నదని అంటున్నది నేషనల్ హెల్త్ సర్వీస్. వెనకటి రోజుల్లో ఆడవాళ్లు పెద్దగా చదువుకోకపోయినా బిడ్డకు మాత్రం ఐదేండ్ల వరకు పాలు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు ఉన్నతంగా చదివి అన్నీ తెలిసినవాళ్లే పిల్లలకు పాలు ఇవ్వడానికి ఇష్టపడటం లేదు. కానీ.. తల్లిపాలు అనేవి సృష్టిధర్మం. అవి ఆకలి మాత్రమే తీర్చేవి కావు. అమృతంలాంటివి. కాబట్టి తల్లి పిల్లలకు పాలు ఇవ్వాల్సిందే.

### తల్లిపాలు ఎందుకు?

బిడ్డ ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఉపయోగపడుతాయి. శరీరానికి ఎంత బరువు అవసరమో అంతే బరువు పొందేలా తల్లిపాలు ప్రభావం చూపిస్తాయి. పిల్లలకు విరేచనాలు సక్రమంగా అవుతాయి. తల్లిపాలకు తొందరగా జీర్ణమయ్యే గుణం ఉంటుంది. వీటిలో పుష్కలమైన ప్రొటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మినరల్స్, కాల్షియం, పొటాషియం లభిస్తాయి. పుట్టిన 4-5 గంటల నుంచే తల్లిపాల ద్వారా ఇవన్నీ సమపాళ్లలో అందడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతుంది. పైగా ఎలాంటి ఇన్ఫెక్షన్లను కలిగించవు. ముర్రుపాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే శిశువు మోకాళ్లు వంకరలు తిరుగుతాయి. ఇతర ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలా కాకుండా ముర్రుపాలు తాగిస్తే వైరస్ ఇన్ఫెక్షన్లు, అలర్జీ దరిచేరవు. ప్రొటెక్టివ్ యాంటీబాడీస్ తల్లిపాలల్లో ఉండటం వల్ల శిశువులో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. తల్లిపాలు తాగితే ఆస్తమా రాదు. తల్లితో మానసిక అనుబంధం ఏర్పడుతుంది. ఊబకాయం, డయాబెటీస్ నుంచి రక్షణ లభిస్తుంది. మలబద్ధకం సమస్య ఉండదు. విటమిన్స్ అందుతాయి. తెలివి తేటలు బాగుంటాయి. కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి రక్షణ ఉంటుంది.

### ఎంతకాలం ఇవ్వాలి?

వెనకటి రోజుల్లో అయితే బిడ్డకు ఏడేండ్ల వయసొచ్చే వరకు కూడా తల్లులు పాలు ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు అలా ఇవ్వడం వీలు కాకపోతుండొచ్చు. కాబట్టి ఐదేండ్ల వరకు ఇవ్వొచ్చు. శిశువుకు మొదటి ఆరు నెలలు ఇతర ద్రవ, ఘన పదార్థాలు ఏవీ ఇవ్వకుండా కేవలం తల్లిపాలు అయితే కచ్చితంగా ఇవ్వాలి. ఆ తర్వాత నుంచి తల్లిపాలతోపాటు ఘన పదార్థాలు తినిపిస్తూ సుమారు రెండేండ్ల వరకైనా పాలు ఇవ్వాలి. తల్లి దగ్గర పాలు లేకపోవడం.. ఆరోగ్యం సహకరించకపోవడం వంటి కారణాలు ఉంటే కనీసం ఒక సంవత్సరం అయినా పాలు ఇస్తేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది. అయితే రెండేండ్లు అంతకంటే ఎక్కువ వయసు వరకు శిశువుకు తల్లిపాలు పట్టించాలి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తున్నది.

### పోత పాలు మంచివేనా?

ఏ పాలూ.. తల్లిపాలతో సమానం కావు. చాలా మంది ఆవుపాలు తాగిస్తున్నామనే భరోసాతో ఉంటుంటారు. కానీ ఆవుపాలల్లో కాల్షియమ్, సోడియం, క్లోరైడ్ స్థాయిలు ఎక్కువ అవడంతో అవి బిడ్డ కిడ్నీ మీద ప్రభావం చూపే ప్రమాదముందని గ్రహించడం లేదు. ఇంకో ఆప్షన్ పోతపాలు. అయితే సహజరీతుల్లో విటమిన్‌లు, ఖనిజాలు లభించడం కాకుండా కృత్రిమ పద్ధతిలో యాడ్ చేసి ఇవ్వాల్సి వస్తుంది. పోతపాలు తాగే పిల్లల్లో ఇన్ఫెక్షన్లు, విరేచనాలు ఎక్కువగా వస్తాయి. మలబద్ధకం, ఊబకాయం వంటి సమస్యలు అధికం. కడుపు నొప్పి, అలర్జీలూ కూడా ఎక్కువగానే ఉంటాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని పోతపాలను నమ్ముకోవడం కాకుండా తల్లిపాలను పట్టడమే శ్రేయస్కరం.



రెండేండ్లు వచ్చేసరికి శిశువుకు కావాల్సిన పోషకాలు ఇతర ఆహారాలలో అందుతాయి కాబట్టి పాలు ఇవ్వడం తగ్గించినా నష్టమేమీ లేదని డబ్ల్యూహెచ్‌ఓ చెప్తున్నది.

### ఇవ్వకపోతే?

తల్లిపాలు బిడ్డకు వరం లాంటివి. వాటిని పిల్లలకు అందివ్వకపోతే వారి జీవితం ప్రమాదంలో పడొచ్చని చెప్తున్నది యూనిసెఫ్ సర్వే. ఈ సర్వే ప్రకారం తల్లిపాలు తక్కువగా తాగే పిల్లల్లో శారీరకంగా, మానసికంగా ఎదుగుదల లోపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 76 దేశాల్లో యూనిసెఫ్ ఈ అధ్యయనం చేసింది. దీని ప్రకారం సుమారు 7 కోట్ల 80 లక్షల మంది శిశువులకు పుట్టిన గంటలో కూడా పాలు అందడం లేదు. పుట్టిన 4-5 గంటల్లో కూడా పాలు ఇవ్వకపోవడం వల్ల 33% పిల్లలు చనిపోతున్నారు. పుట్టిన 24 గంటల్లో కూడా తల్లిపాలు బిడ్డకు అందకపోతే మరణించే ప్రమాదం రెట్టింపు అవుతుంది.

### వీనింగ్ అంటే?

బిడ్డకు ఆర్నెళ్ల తర్వాతే ప్రత్యామ్నాయ ఆహార పదార్థాలు అలవాటు చేయాలి. బిడ్డను పాల నుంచి ఇతర ఘన పదార్థాలకు అలవాటు చేయడాన్ని వీనింగ్ అంటారు. తల్లి పాలల్లో కార్బోహైడ్రేట్స్ 7.1%, ఫ్యాట్స్ 4.5%, ప్రొటీన్స్ 0.9%, మినరల్స్ 0.2%, బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన డైజెస్టివ్ ఎంజైమ్స్, హార్మోన్లు, విటమిన్లు, యాంటీ బాడీస్, లింఫోసైట్స్ ఉంటాయి. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ తల్లిపాలను తప్పనిసరిగా తాగించాలని సూచిస్తున్నది.

### పాలల్లో ఉండే హార్మోన్లేంటి?

బిడ్డ ఆకలి గమనించగానే ప్రొలాక్టిన్, ఆక్సిటోసిన్ హార్మోన్‌లు తల్లిపాలలో ఉత్పత్తి అవుతాయి. ప్రొలాక్టిన్.. పిట్యూటరీ గ్రంధి ముందు భాగం నుంచి విడుదల అవుతుంది. ఇది రొమ్ములో పాలు ఉత్పత్తి అవడానికి తోడ్పడుతుంది. ఆక్సిటోసిన్ హార్మోన్.. పిట్యూటరీ గ్రంధి వెనకభాగం నుంచి విడుదల అవుతుంది. ఇది పాలు నాళాల నుంచి బయటకు రావడానికి ఉపయోగపడుతుంది.

### ముర్రుపాలు తాగకపోతే?

బిడ్డ పుట్టిన తొలి మూడురోజుల్లో వచ్చే పాలు తప్పకుండా తాగించాలి. అవి బిడ్డ భవిష్యత్‌కు ఎంతో మంచివి. వీటిని ముర్రుపాలు అంటారు. ముర్రుపాలలో కొలోస్ట్రమ్ అనే పదార్థం ఉంటుంది. ఇది చిక్కటి పసుపు పచ్చటి ద్రవం. ముర్రుపాలలో అధికశాతం ప్రొటీన్లు ఉంటాయి. ఇవి బిడ్డకు బలాన్ని, రోగ నిరోధక శక్తిని కలిగిస్తాయి. ఆరోగ్యవంతమైన బాలింత నుంచి రోజుకు సుమారు 600 మిల్లీలీటర్ల పాలు ఉత్పత్తి అవుతాయి. కాబట్టి తల్లి సరైన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. పాలు, ఆకుకూరలు, పళ్లు, పప్పులు, గుడ్లు, చేపలు కలిగిన పరిశుభ్రమైన సమతల ఆహారం తీసుకోవాలి. సమృద్ధిగా మంచినీళ్లు తాగాలి. టమాట, ఉల్లి, క్యాబేజీ కుటుంబానికి చెందినవి తేలికగా జీర్ణం కావు కాబట్టి వీటిని తగ్గించుకోవాలి.

### ఎలాంటి సమస్యలుంటే ఇవ్వొద్దు?

రొమ్ము మీద చీము గడ్డలు ఉన్నప్పుడు, టీబీ వ్యాధి తీవ్రంగా ఉంటే, క్యాన్సర్ మందులు వాడేటప్పుడు, యాంటీ థైరాయిడ్, రేడియేషన్ మందులు వాడేటప్పుడు, జబ్బుగా ఉన్నప్పుడు బిడ్డకు పాలు ఇవ్వకూడదు. రిట్రాక్టెడ్ నిపుల్స్, క్రాక్డ్ నిపుల్స్ వంటి సమస్యలు ఉన్నవాళ్లు గర్భిణిగా ఉన్నప్పుడే ఈ సమస్యలను గుర్తించి, జెంటిల్ మసాజ్, బ్రెస్ట్ పంప్ ట్రాక్షన్‌తో సమస్యను తగ్గించుకోవాలి.



**అనూష కొమ్మిని**
పీడియాట్రిక్ నర్సింగ్ లెక్చర్, కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్

### అసహజ ప్రసవాలే కారణమా?

యునిసెఫ్ రిపోర్ట్ ప్రకారం తల్లిపాల గురించి ఇండియాలో అవగాహన చాలా తక్కువగా ఉంది. ఆఫ్రికా ప్రజల్లో బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల 65% అవగాహన ఉంటే ఇండియాతో పాటు తూర్పు ఆసియా దేశాల్లో కేవలం 32%గా ఉన్నట్లు పేర్కొన్నది. బ్రెస్ట్‌ఫీడింగ్ పట్ల అవగాహన ఉన్న దేశాల్లో ఇండియా 56వ స్థానంలో ఉన్నది. శ్రీలంక ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉండటం గమనార్హం. అయితే దీనికి కారణం కూడా చెప్పారు. ఆపరేషన్ వల్ల జరిగే ప్రసవాల సంఖ్య పెరిగిపోవడం వల్లే బ్రెస్ట్ ఫీడింగ్ పట్ల అవగాహన ఉండటం లేదని పరిశోధకులు చెప్తున్నారు. ఆపరేషన్ వల్ల ప్రసవాలు గతంలో కంటే ఇప్పుడు 20% పెరిగాయి.

### తల్లికి ప్రయోజనాలుంటాయా?

బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బిడ్డ ఆరోగ్యంతో పాటు తల్లి ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. ఈ రోజుల్లో 80% గర్భసంచి సమస్యలు వస్తున్నాయి కదా. అయితే తల్లి సక్రమంగా పాలు ఇవ్వడం వల్ల గర్భసంచి సమస్యలు రావు. ప్రసవం అయిన కొద్ది కాలానికే అది ముడుచుకొని సాధారణ పరిమాణానికి వస్తుంది. అధిక రక్తస్రావం జరుగదు. పాల ద్వారా ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలవ్వడం వల్ల తల్లికి మానసిక ప్రశాంతత లభిస్తుంది. పాలివ్వడం వల్ల ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవడంతో ప్రసవం తర్వాత ఊబకాయం రాకుండా నిరోధిస్తుంది. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ప్రమాద శాతం తగ్గుతుంది. గుండె సమస్యలు, మధుమేహం వచ్చే అవకాశాలు కూడా తగ్గుతాయి.

దాయి శ్రీశైలం

# నులిపురుగులు పరార్!

**పిల్లలు.. తినమంటే ఆకలి కావడం లేదంటారు. తరుచూ విరేచనాలు చేసుకుంటారు. పోషకాహారం తినక.. బరువు తగ్గిపోతుంటారు. రక్తం తగ్గిపోయి బలహీనంగా కనిపిస్తుంటారు. ఎందుకు ఇలా చేస్తున్నారో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతారు. కడుపులో నులిపురుగులు ఉండటం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయి. ఈ నెల 8న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వాటిని ఎలా నివారించాలో తెలుసుకుందాం!**



19 ఏళ్లలోపు పిల్లలపై నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయి. తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులే పీల్చుకోవడంతో చిన్నారుల్లో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది.

### ఎందుకు వస్తాయి?

అపరిశుభ్రత వల్లే నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోకపోవడం, పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, కలుషిత ఆహారం వల్ల ఇవి సంక్రమిస్తాయి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల కూడా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశించి హాని చేస్తాయి.

### నిర్మూలన ఎలా?

నులిపురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి. 1-2 ఏండ్ల పిల్లలు 200 మిల్లీ గ్రాముల మాత్రలు, ఆపైబడిన వారు 400 మిల్లీ గ్రాముల మాత్రను వేసుకొని బాగా నమలాలి. కడుపులో నులి పురుగులు ఉంటే మాత్రలు వేసుకున్న తర్వాత ఒకటి రెండు రోజుల్లో మల విసర్జన ద్వారా బయటకు వస్తాయి. వీటిని ప్రతి ఆరునెలలకోసారి వేసుకోవడం వల్ల నులిపురుగులు తగ్గిపోతాయి. ఆల్బెండజోల్ కోసం అంగన్వాడీ కేంద్రం లేదా పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వీటిని పంపిణీ చేస్తున్నారు. హాస్పిటల్‌లో ఎప్పుడు వెళ్లినా వేస్తారు.

### ఎలా వ్యాపిస్తాయి?

ఇవి పరాన్న జీవులు. పేగులను ఆవాసంగా మార్చుకొని వేల సంఖ్యలో గుడ్లు పెడతాయి. మల విసర్జన ద్వారా బయటకొచ్చి మన చుట్టూ పరిసరాల్లో వ్యాపిస్తాయి. మట్టిలో కలిసిపోయిన గుడ్లు తీవ్ర వాతావరణాన్ని సైతం తట్టుకొని ఏండ్లతరబడి అలాగే ఉంటాయి. మట్టిలో ఆడుకునే 5-19 ఏండ్ల వయసున్న పిల్లలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. చేతులను శుభ్రంగా కడుక్కోకపోవడం, మట్టిలో చేతులుపెట్టి అలాగే భోజనం చేయడం ద్వారా ఈ పరాన్నజీవులు కడుపులోకి చేరతాయి.

### ఎన్ని రకాలు?

పిల్లల పేగుల్లో సాధారణంగా మూడు రకాల పురుగులు తిష్ఠ వేస్తాయి. అవి.. ఏలిక పాములు (ఆస్కారిస్ లుంబ్రికాయిడ్స్), కొంకి పురుగు (ఆంకైలోస్టోమా డియోడెనేల్), చుట్టపాములు (టీనియా సోలియం). ఇవి 55 అడుగులు పెరిగి 25 ఏండ్ల వరకు బతుకుతాయి. వీటి గుడ్లు మట్టిలో 10 ఏండ్లకు పైగా దెబ్బతినకుండా ఉంటాయి. సరిగ్గా ఉడికించని పంది, పశు మాంసాల ద్వారా చుట్టుపురుగులు కడుపులోకి చేరుతాయి. మట్టిలో ఆడితే పాదాల ద్వారా కొంకి పురుగుల లార్వాలు శరీరంలోకి ప్రవేశిస్తాయి.

### మాత్రల ప్రభావం ఎంత?

ఆల్బెండజోల్ మాత్రలు వాడటం వల్ల కడుపులోని నులిపురుగులు తగ్గిపోతాయి. వీటిని నిర్మూలించడం వల్ల రక్తహీనతను నియంత్రణలోకి వస్తుంది. పోషకాహార అవసరాన్ని మెరుగుపరుస్తుంది. వ్యాధి నిరోధకత మెరుగవుతుంది. ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం పెరుగుతుంది. పని సామర్థ్యం కూడా పెరుగుతుంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పిల్లల చేతివేళ్ల గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. వాటిలో మట్టి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశుభ్రమైన నీటినే తాగాలి. తినే ఆహారం కలుషితం కాకుండా మూతలు పెట్టాలి. సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్న పదార్థాలే తీసుకోవాలి. ఈగలు, దోమలు ఆహారంపై వాలకుండా జాగ్రత్తపడాలి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను శుభ్రమైన నీటితో కడిగిన తర్వాతే వండాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనను మానేసి మరుగుదొడ్ల వాడకాన్ని అలవాటు చేసుకోవాలి. ఇంటి చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.



**డాక్టర్ చేతన్ ముందాడ**
సీనియర్ పీడియాట్రిషన్
యశోద మదర్& చైల్డ్ ఇనిస్టిట్యూట్, సికింద్రాబాద్

# మధుమేహం ఇక బాధించదు!

**సరైన అవగాహన లేక.. ఆరోగ్యవంతమైన జీవన శైలి లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా 100 మిలియన్ల ప్రజలు ఈ మధుమేహం బారిన పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా నివేదికలో పేర్కొన్నది. గింజలు తినడం వల్ల మధుమేహాన్ని నియంత్రణలో పెట్టొచ్చు అని నిపుణులు సూచిస్తున్నారు.**



**గుమ్మడికాయ గింజలు:** వీటికి రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. ఫైబర్ కూడా ఉంటుంది. వీటి వల్ల టైప్-2 డయాబెటీస్ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.



**అవిసె గింజలు:** వీటిని పొడిగా చేసుకొని ఓట్‌మీల్, తృణధాన్యాలు, పెరుగులో కలుపుకొని తింటే మధుమేహ ప్రభావం తగ్గుతుంది.



**చియా గింజలు:** వీటిని అవిసె గింజల వలె గ్రైండ్ చేయాల్సిన అవసరం లేదు. అల్పాహారం, తృణధాన్యాలు, గంజి, కూరగాయలు, పెరుగులో నేరుగా కలుపుకొని తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది.



**మెంతి గింజలు:** వీటిని రాత్రిపూట ఒక కప్పు నీటిలో నానబెట్టి ఉంచాలి. పొద్దున ఆ నీటిని తాగాలి. దీనివల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయి అదుపులో ఉంటుంది. డయాబెటీస్ బెడద ఉండదు.



**స్వచ్ఛమైన గింజలు:** చక్కెర రహిత పదార్థాల ద్వారా ఉపశమనం పొందాలనుకునేవాళ్లు వాటిని కాకుండా స్వచ్ఛమైన గింజలను తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. రకరకాల డైట్ల వల్ల సమస్యలే తప్ప లాభం ఉండదు.

## సుడోకు

**డైలీ సుడోకు 113 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 8 | 6 | 5 | 1 | 2 | 3 | 4 | 7 |
| 4 | 5 | 7 | 3 | 8 | 9 | 6 | 1 | 2 |
| 2 | 3 | 1 | 4 | 6 | 7 | 9 | 5 | 8 |
| 5 | 6 | 3 | 7 | 2 | 8 | 1 | 9 | 4 |
| 8 | 1 | 2 | 6 | 9 | 4 | 5 | 7 | 3 |
| 7 | 9 | 4 | 1 | 5 | 3 | 8 | 2 | 6 |
| 6 | 2 | 9 | 8 | 7 | 5 | 4 | 3 | 1 |
| 1 | 4 | 5 | 2 | 3 | 6 | 7 | 8 | 9 |
| 3 | 7 | 8 | 9 | 4 | 1 | 2 | 6 | 5 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు - 114**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | | 2 | 8 | | | | 3 | |
| 3 | | | | 9 | 5 | | | |
| | | | 1 | 4 | | 7 | | |
| | | 1 | 5 | | | 9 | | 7 |
| | 4 | 5 | | | | 8 | 1 | |
| 2 | | 9 | | | 1 | 3 | | |
| | | 8 | | 1 | 6 | | | |
| | | | 7 | 5 | | | | 8 |
| | 5 | | | | 8 | 1 | | 3 |

## ట్వీట్




**సంపూర్ణేష్ బాబు**
@sampoornesh

**నేను మిమ్మల్ని కలవడానికి వరంగల్, ఖమ్మం, విజయవాడ వస్తున్నాను. రండీ.. కలుద్దాం. సదా మీ ప్రేమకు బానిసను!**



సంపూర్ణేష్ బాబును ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
65,627

## కామన్‌మ్యాన్ వాయిస్

దశాబ్దాల గోస, వలసలు, పోరాటం ఆకాంక్ష గురించి పట్టించుకోలేదు. నేషనల్ ఫ్రంట్ ఉన్నప్పుడు తెలంగాణ వద్దని చంద్రబాబు అంటే అతని మాట విని రాష్ట్రం ఇయ్యలేదు. రాష్ట్రం ఏర్పాటు క్రమంలో ఏర్పడినంక మొన్నటి ఎన్నికల్లో కూడా తెలంగాణపై విషం చిమ్మినా.. మనం మాత్రం జేజేలు కొట్టాలె. అంగీలు చింపుకోవాలె.
– Burra Manohar Goud

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒకటే భారత్. అదే అఖండ భారత్!
– Suresh Jai

సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న భారత ప్రభుత్వానికి సలాం. మోదీ.. అమిత్‌షా తీసుకున్న నిర్ణయం సూపర్.
– Swapna Satheesh Kumar

## వైరల్ వీడియో



**స్నేహితులు ఎలా ఉంటారు? ఎలా స్పందిస్తారు? అసలు స్నేహం అంటే ఏంటి? ఓ చిన్న వీడియో ద్వారా చూపించారు. ఇది యూట్యూబ్ ట్రెండింగ్‌లో టాప్‌వన్‌గా నిలిచింది. లెట్స్ వాచ్.**

Comali – Official Trailer (Tamil) | Jayam Ravi, Kajal Aggarwal | Hiphop Tamizha
Total views : 1,48,79,982+
Published on Aug 3, 2019

నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
మంగళవారం 6 ఆగస్టు 2019

# పాలపుంత త్రిమితీయ పటం

**భూమికి ఆవాసమిచ్చిన 'పాలపుంత'కు చెందిన కొత్త త్రిమితీయ (త్రీడీ) చిత్రాన్ని శాస్త్రజ్ఞులు ఆవిష్కరించారు. విశ్వరహస్యాల శోధనకు ఇదెంతో ఉపయుక్తమని వారంటున్నారు.**

విశ్వదర్శనం



సూర్యునినుండి మహానక్షత్రాల సముదాయమైన 'సెఫీడ్' (Cepheid) తారలవరకూ గల దూరం ఆధారంగా మన గెలాక్సీ (పాలపుంత: Milky Way) విస్తృత పటాన్ని శాస్త్రవేత్తలు తాజాగా త్రిమితీయ (3D: Three-dimensional) రూపంలో ఆవిష్కరించారు. దీనికి సరికొత్త ప్రామాణిక పద్ధతిని అవలంభించినట్లు వారు చెబుతున్నారు. అమెరికాలోని ఓహియో స్టేట్ యూనివర్సిటీ, పోలాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వార్సా (University of Warsaw): అస్ట్రానమికల్ అబ్జర్వేటరీ శాస్త్రవేత్తలు అభివృద్ధి పరిచిన ఈ పరిశోధనా పత్రం ఇటీవల 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైంది. ఆప్టికల్ గ్రావిటేషనల్ లెన్సింగ్ ఎక్స్‌పర్‌మెంట్ (OGLE), ఆల్ స్కై ఆటోమేటెడ్ సర్వే ఫర్ సూపర్‌నోవా (ASAA-SN) చిత్రీకరించిన చిత్రాల ఆధారంగా వారు ఈ అధ్యయనం జరిపారు. ఈ సందర్భంగా మొత్తం 2,431 సెఫీడ్ నక్షత్రాల సముదాయాన్ని విశ్లేషించినట్టు చెబుతున్నారు. ఇదివరకంటే ఎంతో విస్తృత దూరం ప్రాతిపదికన ప్రస్తుత త్రిమితీయ పటం (చిత్రం) రూపొందిందని, దీనితో మన పాలపుంత సమతలంగా లేదని, కొంత వొంపుతో, మలుపు తిరిగి ఉందన్నది నిరూపితమైందనీ వారు తెలిపారు.

# 10 కోట్ల ఆంత్రజీవులు!

**ఒక్క ఆపిల్ పండులోనే 10 కోట్ల సూక్ష్మజీవులను శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఇవి మనకు మేలు చేసేవేనని, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో వీటి పాత్ర ఎంతో కీలకమని వారంటున్నారు.**

జీవశాస్త్రం



సాధారణంగా పచ్చిపండ్లు, కూరగాయల్లో జీర్ణశక్తిని పెంపొందింపజేసే ఆంత్రక్రిములు అత్యధికంగా ఉంటాయి. ఇంకా ప్రత్యేకించి, సేంద్రియ (సంప్రదాయ) పద్ధతిలో పండిన పండ్లలో అయితే ఇవి మరింత మెండుగా లభ్యమవుతాయి. ఆస్ట్రియాలోని స్టిరియా (Styria, Austria) రాష్ట్రానికి చెందిన గ్రాజ్ (Graz) యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో ఒక్క సేపు (ఆపిల్) పండులోనే సుమారు 10 కోట్ల (100 మిలియన్) సూక్ష్మజీవులు ఉన్నట్టు తేలింది. సాధారణ సంప్రదాయ దుకాణం నుండి తెచ్చిన పండులోనే ఈ పరిస్థితి వెల్లడైంది. ఇక, తాజా సేంద్రియ పచ్చి ఆపిల్‌లో అయితే మరింత ఎక్కువ సంఖ్యలో సూక్ష్మజీవులు ఉంటాయని వారంటున్నారు. ఫ్రంటీర్స్ ఇన్ మైక్రోబయాలజీ (Frontiers in Microbiology) జర్నల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధనలో 240 గ్రాముల బరువు తూగే ఆపిల్ పండులోనే అంతటి సంఖ్యలో మనకు మేలు చేసే ఆంత్రజీవులు ఉన్నట్టు వారు గుర్తించారు. దీని పొట్టుకన్నా గుజ్జు, గింజలలోనే అవి ఎక్కువ ఉన్నట్టు వారు చెబుతున్నారు.

# ద్రవ బంగారం!

తల్లి పాలను 'ద్రవ బంగారం' (liquid gold) గా పిలుస్తున్నారంటేనే వాటి విలువ ఎంతో తెలుస్తుంది. రేపటితో 'ప్రపంచ మాతృపాల వారోత్సవం' ముగుస్తున్న వేళ అమ్మపాలలోని గొప్పదనమిది.

శాస్త్రీయం



చంటిబిడ్డలకు అమ్మపాలు అమృతం వంటివే. వీటిని మించిన పోషక పదార్థాలు మరేవీ ఉండవు. అందుకే, తల్లులు ప్రసవం తర్వాత అందచందాల పరిరక్షణ పేరుతో తాము నవమాసాలు మోసి, అష్టకష్టాలూ పడి కన్న బిడ్డకు పాలు పట్టడానికి మొహమాట పడకూడదని నిపుణులు సలహా ఇస్తుంటారు. అభం శుభం తెలియని పసిపిల్లలకు కావలసిన అన్ని పోషకాలనూ తల్లి పాలు పుష్కలంగా ఇస్తాయని వారంటున్నారు. తల్లి పాలు తాగే పిల్లలకు ఎలాంటి మలబద్ధకం సమస్యలు రాకపోగా, వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు వంటివేవీ సాధారణంగా దరిచేరవనీ వారంటారు. తల్లిపాలు తాగి, పెరిగే పిల్లల్లో ప్రజ్ఞ (ఐక్యూ- intelligence quotient) కు తిరుగుండదని కూడా శాస్త్రవేత్తలు అంటారు. పుట్టిన వెంటనే వైద్యులు సూచించే వరకు రోజుకు 8 నుంచి 12 పర్యాయాలు బిడ్డకు తల్లి పాలివ్వాలని వారు సూచిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు 'వరల్డ్ బ్రెస్ట్‌ఫీడింగ్ వీక్'ను ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నాం. తొలి రోజుల్లో తల్లులనుండి బిడ్డకు సుసంపన్నమైన పోషకాలతో కూడిన పాలు (Colostrum) లభిస్తాయని, వీటి రంగు పసుపుపచ్చగా ఉండడం వల్ల 'ద్రవ బంగారం'గానూ వీటిని వ్యవహరిస్తారని వారు అంటున్నారు.

జ్ఞానదీపం

## గాంధేయ సాంకేతిక విజ్ఞానం

# బాపూ వైజ్ఞానిక బాటలో!

**మహాత్మాగాంధీ అనగానే మనకు దేశ స్వాతంత్ర్య పోరాట విశేషాలే గుర్తుకు వస్తాయి. కానీ, ఆయన శాస్త్ర సాంకేతిక రంగాలపై కూడా తనదైన ముద్రతో కూడిన ఆలోచన వెలువరించారన్న సంగతి చాలా తక్కువమందికి తెలుసు. దశాబ్దం క్రితం ఇద్దరు ప్రసిద్ధ శాస్త్రవేత్తలు ఆయనలోని వైజ్ఞానిక, సాంకేతిక దృష్టిని పరిచయం చేశారు. ఈ ఏడాది మహాత్మాగాంధీ 150వ జయంతి (పుట్టిన ఏడాది: 1869) సంవత్సరం సందర్భంగా ప్రస్తుత తరం పరిశోధకులకు పనికి వచ్చే ఆ విశేషాలపైనే ఈ వ్యాసం.**



గాంధేయ సాంకేతిక విజ్ఞానం (గాంధీయన్ ఇంజినీరింగ్) అనే పదప్రయోగం తొలిసారిగా ఒక దశాబ్దం క్రితం జరిగింది. ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఆర్.ఏ. మషేల్కర్, సి.కె. ప్రహ్లాద్‌లు దీనిని ప్రపంచానికి పరిచయం చేయడం విశేషం. మన జాతిపిత మహాత్మాగాంధీ దృష్టిలో విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, వాటి పరమార్థం వంటి విషయాలను అర్థం చేసుకొనే అవకాశం చాలామందికి దీనితో లభించింది. ముఖ్యంగా 'గాంధీయన్ ఇంజినీరింగ్' (Gandhian Engineering) అన్నది మిగిలిన సాంకేతికతలకంటే ఏ రకంగా విభిన్నమో, అధిక ప్రయోజనదాయకమో వారిద్దరూ అప్పట్లోనే సవివరంగా పేర్కొన్నారు. 2010 ఏప్రిల్‌లో మషేల్కర్ చేసిన 'గాంధీయన్ ఇంజినీరింగ్: మోర్ ఫ్రమ్ లెస్ ఫర్ మోర్' అనే ప్రసంగం, ప్రదర్శన అప్పట్లోనేకాక ఇప్పటికింకా చాలామందిని ఆలోచింపజేస్తున్నది.

మషేల్కర్ (R.A.Mashelkar) ప్రఖ్యాత రసాయనిక శాస్త్రవేత్త. సిఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. సి.కె.ప్రసాద్ మేనేజ్‌మెంట్ విభాగపు నిపుణులు. వీరిద్దరూ ఈ 'గాంధీయన్ ఇంజినీరింగ్' భావనను ప్రపంచవ్యాప్తం చేయాలని అప్పట్లో విశేషంగా కృషి చేశారు. అయితే, సి.కె. ప్రహ్లాద్ 2010 ఏప్రిల్‌లోనే గతించడం విషాదం. 'తక్కువ వనరులను వినియోగించుకొని తద్వారా పొందే ఫలితం మాత్రం ఎక్కువమందికి అందాలన్ననేదే' బాపూజీ ప్రతిపాదించిన సాంకేతికతా విధానంలోని అంతఃసూత్రం. అత్యుత్తమమైన, అత్యున్నతమైన టెక్నాలజీ ద్వారా ఉన్నత ప్రమాణాలతో, తక్కువ ఖర్చుతో ఎక్కువమందికి ప్రయోజనం చేకూర్చాలన్నదే ఈ 'గాంధీయన్ ఇంజినీరింగ్' పరమార్థం. ఇంతకూ, ఇది సాధ్యమా, అదెలా? వంటి ప్రశ్నలకు పై శాస్త్రవేత్తలు అత్యంత సముచితమైన రీతిలోనే సమాధానం ఇచ్చారు.

పూర్తిగా, విభిన్నంగా ఆలోచించడం గాంధీజీ శైలి. యాపిల్ సంస్థ ప్రారంభకులలో ఒకరైన స్టీవ్ జాబ్స్ (Steven Paul Jobs) కు గాంధీజీ అంటే వ్యక్తిగతమైన ఆరాధనాభావం ఉండేదని, విభిన్నంగా ఆలోచించే రీతికి గాంధీస్ఫూర్తి అనీ, 'జాబ్స్ జీవిత చరిత్ర'లో వాల్టర్ ఐజాక్సన్ (Walter Isaacson) అభిప్రాయపడ్డారు. పరిశోధనలు, ప్రయోగాల పేరిట జంతువులను, రకరకాల ప్రాణులను చంపడం గురించి తీవ్రంగా వ్యతిరేకించిన గాంధీ అప్పట్లోనే ఒకమాట అన్నారు- 'రక్తప్రసరణను కనుగొన్న శాస్త్రవేత్త ఎంత జీవహింస చేశారో కదా!' అని. కాస్త నెమ్మదిగా ఈ అంశంపై దృష్టి పెడితే గాంధీజీలోని భిన్నకోణం మనకు ద్యోతకమవుతుంది.

మషేల్కర్, ప్రహ్లాద్‌లు ఇరువురూ గాంధీయన్ ఇంజినీరింగ్‌ను, ఇన్నోవేషన్‌నూ ఇలా వివరించారు- 'డూయింగ్ థింగ్స్ డిఫరెంట్లీ, మేకింగ్ ఎ బిగ్ డిఫరెన్స్ అండ్ మేకింగ్ ఇంపాజిబుల్ పాజిబుల్' (విభిన్నంగా ఆచరించడం, అసాధ్యమైన దానిని సాధ్యపరుస్తూ, చేసే పనులలో వైవిధ్యభరితంగా సత్ఫలితాలను రాబట్టగలగడం). ఇదీ ఆ మహాత్ముని ఆలోచన. మషేల్కర్, ప్రహ్లాద్ ఇచ్చిన అయిదు ఉదాహరణలలో డా॥ పి.కె.సేథి నేతృత్వంలోని రామచంద్రశర్మ కృత్రిమపాదం ఒకటి. అమెరికాలో అథమపక్షం 12 వేల డాలర్లు అయ్యేది, కానీ 30 డాలర్ల ఖర్చుతో పదిరెట్లు దానిని మెరుగ్గా సాధించారు ఈ జైపూర్ పాదంతో! ఇటువంటి ఆవిష్కరణలు గాంధేయ సృజనాత్మక సాంకేతిక విజ్ఞానంతోనే సాధ్యం.

మన దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటే కనీసం 20 ఏండ్లు పడుతుంది. సంప్రదాయ పద్ధతిలో అక్షరమాలతో ప్రారంభించకుండా పదాలను నేర్పడంతో మొదలుపెట్టి రెండు నెలలలోపు కనీసజ్ఞానాన్ని, తక్కువ ఖర్చుతో పొందవచ్చు. దీన్ని ఎఫ్.సి.కోహ్లి రూపొందించారు. ఇది 'గాంధీయన్ ఇంజినీరింగ్'కు రెండవ ఉదాహరణ. ఎవరీ 'ఎఫ్.సి.కోహ్లి?' అంటే, టిసిఎస్ (టాటా కన్సల్టెంట్ సర్వీసెస్) సంస్థాపకులు. మొత్తం మీద 'తక్షణ అవసరాలను తక్కువ ఖర్చుతో, త్వరగా, మెరుగ్గా సాధించడమే' గాంధీజీ ఆలోచనా విధానంగా మనం అర్థం చేసుకోవాలి.

1920 దశాబ్దంలో చర్కాను మెరుగుపరిచే ఇంజినీరింగ్ ఇన్నోవేషన్‌కు ఏటా బహుమతులు ప్రకటించారు. ఈ బహుమతి మొత్తం 10 సంవత్సరాలలో రూ॥ 5,000 నుంచి లక్ష రూపాయల దాకా పెరిగింది. 'ఖాదీ అనేది కేవలం వస్త్రం కాదు. అది ఒక కట్టుకున్న భార్య వంటిది, ఓ ఆదర్శం (ఐడియా, ఐడియల్)' అంటారు గాంధీజీ. నిజానికి దీన్ని అర్థం చేసుకోవడం అంత సులువు కాదు కూడా. కనుకనే ఆయన గతించి ఏడు దశాబ్దాలు అవుతున్నా ఇంకా కొన్ని అపోహలు కొనసాగుతూనే ఉన్నాయి. సరిగ్గా అర్థం చేసుకోకపోతే చాలా సమస్యలు కలుగుతై. ఇదే ఇంతవరకు జరిగింది. డా॥ ప్రాణ్ జీవన్ మెహతా 1909 నవంబర్ 8న గోపాలకృష్ణ గోఖలేకు రాసిన లేఖలో గాంధీజీని 'మహాత్మా' అని సంబోధించారు. ఇది ఠాగోర్ పిలువడం కంటే చాలా ముందు. ఇలాంటి విషయాలు లోతుగా గమనించిన మషేల్కర్, సి.కె.ప్రహ్లాద్‌లు గాంధీజీ సాంకేతికతా వైజ్ఞానిక దృష్టిని ప్రపంచానికి చాటాలని దశాబ్దం క్రితం భావించడం విశేషం.

ఇంతేకాదు, అంతర్జాతీయంగా 800 రూపాయలకు లభించే హెపటైటిస్ వాక్సిన్ కేవలం 34 రూపాయలకు శాంతా బయోటిక్ వరప్రసాద్‌రెడ్డి సాధించారు. ప్రపంచవ్యాప్తంగా సగం మార్కెట్ వాడకాన్ని ఇదే కైవసం చేసుకొంది. ఇదీ గాంధీయన్ ఇంజినీరింగ్ విధానమే. నాలుగు నిమిషాలు తొక్కితే నాలుగు గంటలు వెలిగే ఎల్ఈడీ కెపాసిటర్‌ను సి.కె.ప్రహ్లాద్ శిష్యుడు ఆశీష్ గావ్‌డే రూపొందించారు. దాంతో సంబంధిత కెపాసిటర్‌ను 50 డాలర్ల ఖరీదునుంచి 5 డాలర్లకు తగ్గించారు ఆయన తన పరిశోధన ద్వారా. ఇలా బాపూజీ బాటలో వైజ్ఞానిక ఆలోచనలు చేస్తున్నది ప్రపంచ ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలు. మాటల కన్నా చేతలు, వాటి ఫలితాలు ప్రధానమనే నిపుణులు వారు. ఇది మన బాపూజీ 150వ జయంతి సంవత్సరం. ఇప్పటికైనా ఆయనలోని విభిన్నమైన, సృజనాత్మకమైన, అత్యధిక ప్రయోజనకరమైన ఆలోచనలను మనం స్వీకరిద్దాం. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అధ్యయనాలకు మనవంతు ఊతమిద్దాం.

-డా॥ నాగసూరి వేణుగోపాల్
సెల్: 94407 32392

### ఆ పుస్తకంలో మరిన్ని విశేషాలు

'హింద్ స్వరాజ్' గ్రంథాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోలేక పోయామని భారత రాజకీయవేత్త, కాలమిస్టు సుధీంద్ర కులకర్ణి అంటారు. అది 275 పుటల గ్రంథం. ఇంగ్లాండ్ నుంచి దక్షిణాఫ్రికా వెళుతున్నప్పుడు గాంధీజీకి, ఆయన ఆప్తమిత్రుడు, ప్రఖ్యాత వైద్యుడు, లాయర్ అయిన డా॥ ప్రాణ్‌జీవన్ మెహతా (1864-1932)కు మధ్య విస్తృత చర్చ జరిగింది. తర్వాత గాంధీజీ కేవలం 4 రోజులలో దీనిని రచించారు. మధ్యలో కుడిచేయి సహకరించకపోతే సుమారు 40 పేజీలు ఎడమచేతితో రాశారు గాంధీజీ. తర్వాత 60 లైన్లను తీసివేయడం, అక్కడక్కడ కొన్ని పదాలు మార్చడం మినహా అందులో మరేమీ మార్పు చేయలేదాయన. ఈ పుస్తకంలో సైన్స్, టెక్నాలజీ, ఆధునీకరణ వంటి విషయాలను గాంధీజీ చర్చించారు.



# పోలీస్, రేసర్ వార్!



సిద్ధార్థ

సిద్ధార్థ, జీవీ ప్రకాష్ కథానాయకులుగా 'బిచ్చగాడు' దర్శకుడు శశి దర్శకత్వంలో తమిళంలో 'సివప్పు మంజల్ పచ్చై' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో 'ఎరుపు పసుపుపచ్చ' పేరుతో అభిషేక్ ఫిల్మ్స్ పతాకంపై రమేష్ పిళ్లై విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఒక ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కి, ఒక బైక్ రైసర్‌కి మధ్య సాగే ఎమోషనల్ వార్ చిత్రమిది. మంచి భావోద్వేగాలతో కూడిన ఫ్యామిలీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో అన్ని వర్గాల వారిని మెచ్చే అంశాలున్నాయి. సెప్టెంబర్ ప్రథమార్ధంలో తమిళంతో పాటు తెలుగు, హిందీలోనూ చిత్రాన్ని విడుదల చేస్తాం. అన్ని భాషల వారికి కనెక్ట్ అయ్యే యూనివర్సల్ సబ్జెక్ట్ ఇది' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'బిచ్చగాడు తరువాత నా దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో తెలుగు ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలుంటాయి. అన్ని భావోద్వేగాల మేళవింపుతో వస్తున్న ఈ చిత్రంతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ఆదరణ పొందుతాననే విశ్వాసం వుంది. సిద్ధార్థ పాత్ర చిత్రణ ఆకట్టుకుంటుంది' అని తెలిపారు. కాశ్మీర పరదేశి, లిజిమోల్ జోస్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సిద్ధుకుమార్.

నమస్తే తెలంగాణ చిత్రం

# వీడే సరైనోడు



నయనతార, జీవా

జీవా, నయనతార జంటగా ఆర్ఎస్ రామనాథం దర్శకత్వంలో తమిళంలో రూపొందిన ఓ చిత్రాన్ని తెలుగులో 'వీడే సరైనోడు' పేరుతో అనువదిస్తున్నారు. నోవా సినిమాస్ పతాకంపై కోకా శిరీష సమర్పణలో జక్కుల నాగేశ్వరరావు ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఈ నెల 23న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ, నగర నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ చిత్రంలో జీవా నటన, నయనతార గ్లామర్ ప్రధాన ఆకర్షణగా వుంటుంది. త్వరలోనే ఆడియోను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. కరుణాస్, జోమల్లూరి, మీనాక్షి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీకాంత్ దేవా, సాహిత్యం: వెన్నెలకంటి, చంద్రబోస్.

# పదింతలు ఎక్కువ నవ్విస్తుంది



సంపూర్ణేష్‌బాబు

''హృదయకాలేయం' సినిమాతో హీరోగా పరిచయం చేసిన నిర్మాత సాయిరాజేష్ ఇండస్ట్రీలో నన్ను నిలబెట్టడం కోసం ఎన్నో కష్టాలు పడి 'కొబ్బరిమట్ట' తీశాడు. ఇందులో నేను త్రిపాత్రాభినయం చేశాను' అని అన్నారు సంపూర్ణేష్ బాబు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కొబ్బరిమట్ట'. రూపక్ రొనాల్డ్‌సన్ దర్శకత్వం వహించారు. ఆది కుంభగిరి, సాయిరాజేష్‌నీలం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. నిర్మాత సాయిరాజేష్ మాట్లాడుతూ 'నాలుగేళ్ల శ్రమకు ప్రతిఫలమిది. ఈ ప్రయాణంలో సినిమా కష్టాలన్నీ చూశాను. సంపూర్ణేష్ చెప్పిన సింగిల్‌షాట్ డైలాగ్‌ను విడుదల చేసిన తర్వాతే బిజినెస్ పూర్తయింది. అప్పటి వరకు మా పరిస్థితి వేరుగా ఉంది. సినిమా విడుదలలో గీతా ఆర్ట్స్, దిల్‌రాజు, యూవీ క్రియేషన్స్ చక్కటి సహకారాన్ని అందించారు. ఈ సినిమాతో ప్రేక్షకుల్ని నవ్విస్తూ హిట్ కొడతామనే నమ్మకం ఉంది' అని తెలిపారు. 'ప్రతి ఒక్కరం ఇష్టపడి, కష్టపడి చేసిన సినిమా ఇది. సంపూర్ణేష్‌బాబుకు నటుడిగా మంచి పేరు తీసుకొస్తుందనే నమ్మకముంది. 'హృదయకాలేయం' కంటే పదింతలు ఎక్కువ ప్రేక్షకుల్ని నవ్విస్తుంది' అని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, గాయత్రి గుప్తా, మహేష్ కత్తి తదితరులు పాల్గొన్నారు.

# మురికివాడ సందేశం



ఆశరాథోడ్, విజయ్

విజయ్, ఆశ రాథోడ్, మధుప్రియ, ప్రేమ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'మురికివాడ'. పాలిక్ దర్శకుడు. తిరుపతి పటేల్, రామ్, భాను, నీలిమ నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్రం ప్రారంభమైంది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్‌నివ్వగా, సాయివెంకట్ కెమెరా స్విఛాన్ చేశారు. రామసత్యనారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'మురికివాడ నేపథ్యంలో సాగే చిత్రమిది. స్నేహం, ప్రేమ అంశాలకు చక్కటి సందేశాన్ని జోడించి రూపొందిస్తున్నాం. త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'మూడు షెడ్యూల్స్‌లో పూర్తిచేస్తాం. ఐదు పాటలుంటాయి. ఈ సినిమాతో కొత్త నాయకానాయికల్ని చిత్రసీమకు పరిచయం చేస్తున్నాం' అని పేర్కొన్నారు. నటనకు ఆస్కారం ఉన్న మంచి పాత్రను పోషిస్తున్నానని హీరో విజయ్ అన్నారు. అశోక్‌కుమార్, గీతా సింగ్ తదితరులు చిత్ర తారాగణం.

# తోటబావి ఫస్ట్‌లుక్



'తోటబావి' ఫస్ట్‌లుక్ ఆవిష్కరణ దృశ్యం

వ్యాఖ్యాతగా అందరికి సుపరిచితుడైన రవి హీరోగా, గౌతమి హీరోయిన్‌గా గద్వాల్ కింగ్స్ సమర్పణలో జోగులాంబ క్రియేషన్స్ పతాకంపై అలూర్ ప్రకాష్‌గౌడ్ నిర్మిస్తున్న చిత్రం 'తోటబావి'.అంజి దేవండ్ల దర్శకుడు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో కొత్త కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రం ఇది. సెప్టెంబరులో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని తెలిపారు. శివశంకర్, ఛత్రపతి శేఖర్, నర్సింహా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: చిడతల నవీన్, ఎడిటర్: గిరి.

# 'తూనీగ' గీతావిష్కరణ



'తూనీగ' గీతావిష్కరణ దృశ్యం

వినీత్‌చంద్ర, దేవయానీశర్మ జంటగా నటించిన చిత్రం 'తూనీగ' (ఒక దైవరహస్యం). ప్రేమ్‌సుప్రీమ్ దర్శకుడు. సిద్ధార్థ్ సదాశివుని సంగీతాన్నందించిన ఈ చిత్ర గీతాలు ఇటీవల విడుదలయ్యాయి. బిగ్‌సీడీని నిర్మాత రాజ్‌కందుకూరి ఆవిష్కరించారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రౌడ్‌ఫండింగ్ విధానం ద్వారా ఈ చిత్రాన్ని పూర్తిచేశాను. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, శ్రీకాకుళంలో చిత్రీకరణ జరిపాం. భారతీయ సంస్కృతిలోని అనేక అంశాలను తీసుకొని తాత్విక భూమికతో పురాణేతిహాస ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సిద్ధార్థ్ సదాశివుని అద్భుతమైన సంగీతాన్నందించారు' అన్నారు. ఈ మధ్య విడుదలైన చిన్న చిత్రాలు మంచి విజయాల్ని సాధించాయని, అదే కోవలో ఈ సినిమా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉందని రాజ్ కందుకూరి చెప్పారు.

# అన్నపూర్ణమ్మ మనవడి కథ



అన్నపూర్ణమ్మ, మాస్టర్ రవితేజ

సీనియర్ నటి అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. నర్రా శివనాగేశ్వరరావు దర్శకుడు. యం.ఎన్.ఆర్.చౌదరి నిర్మాత. మాస్టర్ రవితేజ టైటిల్‌రోల్‌ని పోషిస్తున్నాడు. సీనియర్ నటి జమున కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోమవారం నిర్మాత సి.కల్యాణ్ విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'పల్లెటూరి నేపథ్యంలో సాగే కథ ఇది. అనుబంధాలకు దర్పణంగా ఉంటుంది. అన్నపూర్ణమ్మగారి సోదరి పాత్రలో జమునగారు నటించారు' అన్నారు. 'ఈ సినిమాలో అన్నపూర్ణమ్మ, జమున వంటి లెజెండరీ నటీమణులు భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో ఆడియో, అక్టోబర్‌లో సినిమాను విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 6 ఆగస్టు 2019

# నా వయసుకు తగిన కథ ఇది!



నాగార్జున, రకుల్‌ప్రీత్‌సింగ్

'**ఆ**గస్ట్ నెలంటే నాకు చాలా ఇష్టం. ఈ మధ్యే బిగ్‌బాస్ మొదలుపెట్టాను. త్వరలో నా పుట్టినరోజు రాబోతుంది. ఈ సినిమాకు 'మన్మథుడు-2' అని టైటిల్ ఎందుకు పెట్టామంటే.. తొలి సినిమాలో నేను అమ్మాయిలను ద్వేషిస్తుంటా. కానీ ఇందులో మాత్రం ప్రేమిస్తుంటా' అన్నారు నాగార్జున. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మన్మథుడు-2'. రాహుల్‌రవీంద్రన్ దర్శకుడు. నాగార్జున, కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. నాగార్జున మాట్లాడుతూ 'ఈ వయసులో ప్రేమకథ చేయడమేంటని అడుగుతున్నారు. ఏ వయసులోనైనా ప్రేమించవొచ్చు. ఈ అంశాన్ని తెలియజెప్పే సినిమా ఇది. సంవత్సరం క్రితం ఓ ఫ్రెంచి సినిమా చూశాను. నా వయసుకు తగిన కథ అనిపించింది. దర్శకుడు రాహుల్‌రవీంద్రన్ అద్భుతంగా తెరకెక్కించాడు. పోర్చుగల్‌లో 40రోజులు షూటింగ్‌ను బాగా ఎంజాయ్ చేశాం. అందరూ నాకు ఇద్దరు పిల్లలున్నారు కదా అంటుంటారు. నాగచైతన్య, అఖిల్ నాకు బ్రదర్స్ అనుకుంటా (నవ్వుతూ). 'మన్మథుడు' చిత్రం నాకు ఎన్నో మధురానుభూతులు మిగిల్చింది. 'మన్మథుడు-2' కూడా అందరిని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. 'నాన్న సినిమాల ప్రీరిలీజ్ వేడుకలకు రావాలంటే కొంచెం భయంగా అనిపిస్తున్నది. నాన్న, నేను, అఖిల్, ...మేం ముగ్గురం బ్రదర్స్‌లా ఉన్నామని అందరూ అంటుండేవారు. ఇప్పుడు నాన్న మాలాగే యూత్‌ఫుల్ కంటెంట్‌తో సినిమాలు చేస్తున్నారు. ఈ టైమ్‌లో నాన్న ప్రేమకథని చేయడం చాలా గ్రేట్. జయాపజయాలతో సంబంధం లేకుండా నాన్న విభిన్నకథలతో దూసుకుపోతున్నాడు. అందుకే ఆయన్ని అందరూ కింగ్ అంటారు. మాలాంటి వారందరికి నాన్నే స్ఫూర్తి. భవిష్యత్తులో రాహుల్‌రవీంద్రన్‌తో సినిమా చేయాలని ఉంది' అని నాగచైతన్య చెప్పారు. రాహుల్‌రవీంద్రన్ మాట్లాడుతూ 'నా మొదటి సినిమా రిలీజ్‌కు ముందు నాగార్జునగారు ఇంటికి పిలిచి మాట్లాడారు. నా టేకింగ్ బాగుందని మెచ్చుకున్నారు. ఓ ఫ్రెంచ్ సినిమా చూపించి ఈ సినిమాని నువ్వు డైరెక్ట్ చేయడం కరెక్ట్ అని చెప్పారు. నేను వెంటనే ఒప్పుకున్నాను' అన్నారు. నాగార్జునతో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందని, సినిమాలో తాను పోషించిన అవంతిక పాత్ర అందరిని మెప్పిస్తుందని కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్ చెప్పింది. ఈ వేడుకకు 'మన్మథుడు' చిత్ర దర్శకుడు విజయ్‌భాస్కర్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.



బెల్లంకొండ సురేష్

**'మా అబ్బాయి బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌కు నటుడిగా మంచి పేరు తెచ్చిపెట్టిన సినిమా ఇది. పరిణితితో కూడిన అద్భుతమైన అభినయాన్ని కనబరచగలడని ఈ సినిమా నిరూపించింది' అని అన్నారు బెల్లంకొండ సురేష్. ఆయన తనయుడు సాయి శ్రీనివాస్ నటించిన 'రాక్షసుడు' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో బెల్లంకొండ సురేష్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**

# ధైర్యంగా మాట్లాడుతున్నా!

ఐదేళ్ల ప్రయాణంలో ఏడు సినిమాల్లో నటించాడు సాయిశ్రీనివాస్. తొలి సినిమా 'అల్లుడుశీను' అగ్ర హీరోల చిత్రాల స్థాయిలో మంచి వసూళ్లను సాధించింది. మాస్, కమర్షియల్ హంగులతో దర్శకుడు వి.వి.వినాయక్ తెరకెక్కించిన ఈ చిత్రం దాదాపు 34 కోట్ల షేర్‌ను సాధించింది. ఆ తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో రూపొందిన 'జయజానకి నాయక' మంచి విజయాన్ని సాధించింది. గతంలో అతడు చేసిన సినిమాలన్నీ దర్శకులకు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులకు పేరుతీసుకొచ్చాయి. కానీ 'రాక్షసుడు' సినిమా సాయిశ్రీనివాస్‌ను మంచి నటుడిగా నిరూపించింది. వసూళ్లు బాగున్నాయి. ఫైట్స్, డ్యాన్స్, రొమాన్స్ లేకుండా భావోద్వేగాలు, సందేశంతో కూడిన సినిమా ఇది. ఇలాంటి అరుదైన కథ దొరకడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ సినిమా ప్రారంభించే సమయంలో శ్రీనివాస్ బలమే డ్యాన్సులు, ఫైట్లు. అవి లేకుండా సినిమా చేసి అతడి భవిష్యత్తును పాడు చేయొద్దని చాలా మంది అన్నారు. నటుడిగా శ్రీనివాస్‌కు పేరుతెచ్చే సినిమా అవుతుందని బలంగా నమ్మాను. అదే నిజమైంది. మా అబ్బాయితో మంచి సినిమాను నిర్మించిన నిర్మాత కోనేరు సత్యనారాయణకు హ్యాట్సాఫ్ చెబుతున్నాను.

**ఈ సినిమాలకు మించి ఆనందాన్ని..**

నేను ఇండస్ట్రీలో అడుగుపెట్టి 30 ఏళ్లు అవుతోంది. 21 ఏళ్లుగా సినిమాల్ని నిర్మిస్తున్నాను. ఈ ప్రయాణంలో ఇరవై ఐదు స్ట్రెయిట్ సినిమాల్ని నిర్మించాను. ఎనిమిది డబ్బింగ్ చిత్రాల్ని విడుదలచేశాను. మరో ఎనిమిది చిత్రాల్లో నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించాను. వాటన్నింటికి మించిన ఆనందాన్ని 'రాక్షసుడు' సినిమా ఇచ్చింది. శ్రీనివాస్ ఇప్పటివరకు నటించిన ఆరు సినిమాలు ఒకెత్తయితే ఈ సినిమా ఒకఎత్తుగా నిలిచింది. ఓవర్‌సీస్‌లో మంచి ఆదరణ లభిస్తున్నది. శనివారం రోజు 95 శాతం అక్యూపెన్సీ ఉంటే ఆదివారం రోజు 100 శాతానికి పెరిగింది.

**ఆ ధైర్యాన్నిచ్చాయి..**

అల్లుడుశీను, జయజానకి నాయక చిత్రాలు శ్రీనివాస్‌కు విజయాల్ని అందించాయి. స్పీడున్నోడు, కవచం, సీత చిత్రాలు పరాజయాలుగా నిలిచిన మంచి రెవెన్యూను సాధించాయి. హిందీలో అనువాదమైన దక్షిణాది హీరోల సినిమాల్లో అత్యధిక మంది యూట్యూబ్‌లో వీక్షించిన వాటిలో సాయిశ్రీనివాస్ సినిమాలే ఉన్నాయి. స్పీడున్నోడు 200 మిలియన్లు, జయజానకి నాయక 140 మిలియన్లు, కవచం 120 మిలియన్లపైగా ప్రేక్షకులు యూట్యూబ్‌లో వీక్షించారు. శాటిలైట్ హక్కులు, టీఆర్‌పీ రేటింగ్స్‌తో అద్భుతమైన విజయాల్ని సాధించాయి. మేము చేసింది మంచి సినిమాలే అనే ధైర్యాన్నిచ్చాయి.

**ఐదేళ్ల తర్వాత**

నేను వేదికలపై సినిమాల గురించి మాట్లాడి ఐదేళ్లయ్యింది. విడుదలకు ముందు రోజు 'రాక్షసుడు' సినిమా చూశాను. గ్యారెంటీ హిట్ అనే నమ్మకం కలిగింది. ఆ నమ్మకం నిజమైంది కాబట్టే ధైర్యంగా మాట్లాడుతున్నాను. ఇంత పెద్ద విజయాన్ని అందించిన ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు చెబుతున్నాను.

**వచ్చే ఏడాది బాలీవుడ్‌లో..**

మా అబ్బాయితో బాలీవుడ్‌లో ఓ స్ట్రెయిట్ సినిమా చేస్తామని పెద్ద నిర్మాణ సంస్థ సంప్రదించింది. తెలుగులో హిట్టయిన ఓ సినిమాను హిందీలో మా అబ్బాయితో రీమేక్ చేసే ఆలోచనలో ఉన్నాను. మా సంస్థలోనే వచ్చే ఏడాది ఈ సినిమా ఉంటుంది. ప్రస్తుతం శ్రీనివాస్ కోసం కథలు వింటున్నాను. కథాబలంతో కూడిన మంచి సినిమాలు మాత్రమే చేయాలనే ఆలోచనలో ఉన్నాం. శ్రీనివాస్‌తో తదుపరి సినిమా బాధ్యతను దిల్‌రాజుకు అప్పగించాను. లాభాలను తెచ్చి పెట్టే మంచి కథ దొరికితే రీమేక్ సినిమా చేయడానికి అభ్యంతరం లేదు.

# 40ఏళ్ల వ్యక్తిగా శర్వా మెప్పించాడు



కల్యాణి, శర్వానంద్, త్రివిక్రమ్, సుధీర్‌వర్మ, పీడీవీ ప్రసాద్, నాగవంశీ

'**నా** సన్నిహిత మిత్రుడి ద్వారా శర్వానంద్‌తో ఎప్పటినుంచో పరిచయం ఉంది. ఈ సినిమాలో శర్వా 40ఏళ్ల వ్యక్తిగా బాగా నటించారు. యువకుడైన అతను మధ్యవయస్కుడి పాత్రను సమర్థవంతంగా పోషించడం తొలి విజయంగా భావిస్తున్నాను' అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాకినాడలో జరిగిన 'రణరంగం' చిత్ర థియేట్రికల్ ట్రైలర్ ఆవిష్కరణ వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శర్వానంద్ కథానాయకుడిగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. కాజల్ అగర్వాల్, కల్యాణి ప్రియదర్శన్ కథానాయికలు. త్రివిక్రమ్ మాట్లాడుతూ '1980ల కథను నేటికాలంతో అనుసంధానించి మంచి సినిమాను తీశారనిపిస్తున్నది. దర్శకుడు సుధీర్ ఈ సినిమా కోసం బాగా శ్రమించాడు. కొన్ని సన్నివేశాలను చూస్తే సుధీర్ మంచి ప్రేమకథలు తీయొచ్చనిపించింది' అన్నారు. 'శర్వానంద్‌తో కలిసి రెండేళ్లు పనిచేశా. మంచి ఎనర్జీతో సినిమా చేశాడు. నేను చెప్పదలచుకున్న విషయాలన్నింటిని సినిమాలో చూపించాను. సినిమా అందరిని మెప్పిస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు తెలిపారు. శర్వానంద్ మాట్లాడుతూ 'నేను సినిమాల్లోకి రావడానికి ప్రయత్నించే ముందు క్యారెక్టర్ల కోసం త్రివిక్రమ్‌గారిని కలుస్తుండేవాడిని. ఆ టైమ్‌లో ఆయన పెద్ద రచయిత. ఓసారి కారులో ఇద్దరం కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు 'ఏదైనా సినిమాలో క్యారెక్టర్ ఇవ్వండి సార్' అని అడిగాను. 'నీతో సినిమా చేస్తే హీరోగానే చేస్తాను. క్యారెక్టర్ అయితే ఎప్పటికీ ఇవ్వను' అన్నారాయన. 'రణరంగం' ట్రైలర్ అందరికి నచ్చిందనుకుంటున్నాను. కాకినాడలో కొన్ని రోజులు షూటింగ్ చేశాం. ఇక్కడే ట్రైలర్‌ను విడుదలచ చేయడం మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుంది' అన్నారు. 'సుధీర్‌వర్మ సినిమాల్లో గన్స్, వయొలెన్స్ ఎక్కువగా ఉంటాయి. ఈ సినిమా చూసిన తర్వాత అందమైన ప్రేమకథను కూడా ఆయన తీయగలరని అర్థం చేసుకుంటారు' అని చిత్ర కథానాయిక కల్యాణిప్రియదర్శన్ చెప్పింది. ఈ కార్యక్రమంలో చిత్ర సమర్పకులు పీడీవీ ప్రసాద్, నిర్మాత సూర్యదేవరనాగవంశీ, నటులు అజయ్, రాజా, సంగీత దర్శకుడు కార్తీక్, రచయితలు కృష్ణచైతన్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# హాలీవుడ్ సినిమాలా అనిపించింది!



పీవీపీ, నాని, అడివి శేష్, వెంకట్ రామ్‌జీ

'**ట్రై**లర్ చూస్తుంటే హాలీవుడ్ సినిమాలా ఉంది. ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తించింది. వినూత్నమైన కథాంశంతో ధైర్యంగా ఈ సినిమా చేశారు' అని అన్నారు హీరో నాని. అడివి శేష్, రెజీనా, నవీన్‌చంద్ర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎవరు'. వెంకట్ రామ్‌జీ దర్శకుడు. పీవీపీ సినిమా పతాకంపై పెరల్ వి పొట్లూరి, పరమ్ వి పొట్లూరి, కెవిన్ అన్నె నిర్మిస్తున్నారు. ఈ నెల 15న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో హీరో నాని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'శేష్ నటించిన 'గూఢచారి' ప్రచార చిత్రాన్ని నేనే విడుదలచేశాను. ఆ సెంటిమెంట్‌తోనే బాధ్యతగా భావించి ఈ వేడుకకు వచ్చాను. సినిమాలో శేష్, రెజీనా అభినయం బాగుంది' అని తెలిపారు. అడివిశేష్ మాట్లాడుతూ 'నేను ఇష్టపడిన, బాగా నమ్మిన సినిమా ఇది. ఇందులో ప్రతి పాత్ర ద్విముఖాలతో కనిపిస్తుంది. ప్రతి పది నిమిషాలకు మనస్తత్వాలు మారిపోతూ వినూత్నంగా ఉంటాయి. దర్శకుడు ఈ కథ చెబుతున్నప్పుడు మలుపుల్ని నేను కూడా ఊహించలేకపోయాను. హీరోగా ఏ నిర్మాత నన్ను నమ్మని సమయంలో పీవీపీ నాపై నమ్మకం ఉంచారు. ఆ గౌరవంతోనే 'క్షణం' తర్వాత మళ్లీ ఆయనతో ఈ సినిమా చేస్తున్నాను' అని అన్నారు. రెండేళ్ల క్రితం ఈ కథ విన్నానని, మంచి సినిమాను నిర్మిస్తున్నందుకు గర్వపడుతున్నానని నిర్మాత పీవీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి రవి, గ్యారీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.


